ఆంధ్రమహిళ

ఏకైక మహిళాభ్యుదయ మాస పత్రిక



VOL: XVII ANDHRA MAHILA SEP. 1961 No.

విషయసూచిక

చందాదారులకు

విజ్ఞప్తి

మావిన్నపాన్ని మన్నించి, కొందఱు చందాదారులు తమచందాలు పంపినా, ఇంకను చాలమంది పంపకున్నారు. వారికి సక్రమంగా ప్రతినెల 'ఆంధ్రమహిళ' మాత్రం పంపుతున్నాము, వారియెడ మాకు ఉన్న విశ్వాసాన్ని పురస్కరించికొనిఅయినా, సాధ్యమయినంతత్వరితంగా చందాలుపంపి, యెప్పటిమోస్తరే 'మహిళ'ను పోషించాల్నని కోరుతున్నాము. లేనిపక్షంలో వారికి పత్రికపంపటం మానుకోవలసివస్తుందని మనవి చేస్తున్నాము.

మేనేజరు

"ఆంధ్ర మహిళ"

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 17 :: సెప్టెంబరు, 1961 :: సంచిక 9

భారత స్వాతంత్ర్య దినోత్సవం

"ఎఱుపున్ దెల్పును పచ్చరంగుల బెడంగేపారి, నీలప్రభా
కరమౌ చక్రముదాల్చి, మా కనులకుం, గళ్యాణివై, చుంబితాం
బరవై. సర్వజగత్పవిత్రవయి, భాస్వత్కీర్తిమన్మూర్తివై
కరమొప్పారెడు శ్రీ పతాకమ! నమస్కారమ్ము గావించెదన్"

(అంజలి : శ్రీ నాగగోపాలరావు.)

"ఆంధ్ర మహిళా" పాఠకులకు ఈ పదునైదవ స్వాతంత్ర్య దినోత్సవారంభసమయమున మా హృదయపూర్వక శుభాభినందనములు చెల్లిస్తున్నాము.

దాదాపు రెండుశతాబ్దాలకాలం విశృంఖలవృత్తితో భారతదేశాన్ని పాలించిన ఆంగ్లేయులపతాక 1947 సం॥ ఆగస్టు 15 వ తారీఖునాటి అర్ధమరేయి నేలకు ఒరిగిపోయింది. దానిస్థానాన్ని హైందవత్రివర్ణతాశోక జాతీయపతాక ఆక్రమించి ఆకాశవీధిలో రెపరెపలాడింది. భారతజాతి చిరకాల వాంఛితం ఈడేరింది. వారి బానిసతనపు సంకెళ్ళు వీడిపోయినాయి. విజయంలభించింది.

కీ॥ శే॥ పటేలుగారి రాజకీయ పరిజ్ఞాన చాకచక్యంవల్ల స్వదేశసంస్థానాలు, జమీన్‌లు మొదలయినవి విశాలభారత సామ్రాజ్యంలో లీనమైనాయి. జాతిమతకుల తత్వాలకు జలాంజలి ఈబడింది. స్వతంత్ర భారతరాజ్యాంగచట్టం ఏర్పడింది. పరదేశీయులకు భారతీయుల నిజస్వరూపం తెలియవచ్చింది. ఖండఖండాంతరాలలో మన విజయభేరి మ్రోగింది.

కడచిన పదునాలుగేండ్లు మనభారతదేశం వివిధరంగాలలో ఎంతవరకు అభ్యుదయాన్ని పొందగలిగిందో—అందరికీ విదితమయిన విషయమే. పంచవర్ష ప్రణాళికల ననుసరించి సర్వతోముఖంగా అభివృద్ధిపొందటానికి తగినట్లు ప్లానింగుకమీషన్ పూనుకుంది. అందులో మొదటి పంచవర్ష ప్రణాళికలో—వ్యవసాయ సంబంధంగా ఆనకట్టలు, వంతెనలు. కాలువలు. వ్యవసాయాభివృద్ధికైన నవీనసాధనాలు, ఆహార సందర్భంగా స్వయంపోషకత్వానికి దారిచూపే కార్యాలు మొదలయినవాటికి ప్రాధాన్యము ఇచ్చింది. ప్రయాణసౌకర్యాలకయి రైళ్ళఇంజన్లు పెట్టెలు మున్నగువానిని తయారుచేసే కర్మాగారాల స్థాపనలకుకూడా ప్రాముఖ్యమిచ్చింది.

రెండవ ప్రణాళికలో ఇనుము, ఉక్కు. సిమెంటు పరిశ్రమలు, నిరుద్యోగాన్ని నిర్మూలించే చిన్న పరిశ్రమలు సాగించటానికి అవకాశం కల్పించటమే కాకుండా, ఇనుపదారులు, నానావిద్యల పాఠశాలలు, రాసాయనికోపు చెరువులు, బొగ్గు–ఇల్లాంటివాటి వుత్పత్తులకు తగిన ఆధారాలుకూడా ఏర్పటిచింది,

మూడవ ప్రణాళిక ఈ 1961 సం॥ రమునుండి అమలుకు వస్తుంది. ఇటీవలనే ఈ ప్రణాళికాంశాలు లోకసభవల్ల అంగీకారంకూడా పొందింది.

ప్రకృతం ఈ ప్రణాళికల కార్యాలకు ఆర్థికంగా విదేశాల సహాయం లేనిపక్షంలో పేదదైన మన భారతసీమ వాటిని కొనసాగించటం దుర్లభం. అందుచే అమెరికా, రష్యావంటి దేశాలు సుహృద్భావంతో ఆదుకొంటున్నాయి.

ఇతర విషయాలు ఈ 14 సం॥ రాలలో ఎన్నోజరిగాయి. రాష్ట్రాల విభజనలు, పరదేశ నాయకుల ఆగమనాలు, విదేశీయుల సరిహద్దుల ఆక్రమణాలు, స్వాతంత్ర్య ప్రియులయిన భారతీయ నాయకుల నిర్యాణాలు–ప్రకృతిసిద్ధంగా తటస్థించాయి.

చక్కగా నిష్పక్షపాతంగా పరిశీలించే వారికి భారతదేశం తక్కిన ప్రాగ్దేశాలకంటె అన్నిట ముందంజ వేసిందని–దాని నెవ్వరు అడ్డుకోలేరని స్పష్టంగా గోచరిస్తుందనటం సత్యదూరంకాదు.

పొదుపు విధానం

ఈనాడు ఆర్థికోపపత్తి సాధనాలను గూర్చిన సమస్య ఒకయెత్తయితే, ఆదాయాలకు మించిన వ్యయాల విషయం ఒక యెత్తుగా కనిపిస్తూవున్నది. సామాన్యప్రజానీకం మొదలు, సామ్రాజ్యాధికారి వర్గం వరకు పొదుపరితనం ప్రచారంలో వున్నంత తీవ్రంగా ఆచరణలో ఏమాత్రం అవుపడటంలేదు. రాష్ట్రమంత్రులయితేనేమి, జిల్లా కలెక్టరులయితేయేమి. తాలూకా తాశీలుదార్లయితేనేమి, తుదకు గ్రామాధికార్లుగూడా "పొదుపువిధానం అవలంబించండి. పొదుపరితనంవల్ల మిగిల్చిన ద్రవ్యం దేశాభ్యుదయానికి పాటుపడే ప్రభుత్వానికి అప్పుగా ఇవ్వండి. భావికాలంలో లాభంపొందండి." అని చెప్పటానికేమో, శ్రీరంగనీతులెన్నైనా చెప్పవచ్చు. సభల్లో వుపన్యాసాలివ్వవచ్చు. తన్మార్గాలనుగూర్చి ప్రబోధించవచ్చు. కాని, ఇలాటివారు ఈ నీతిని అనుసరింపవలసిన అవసరం తమదాకా వచ్చేటప్పటికి పప్పులో అడుగు వేయటం ప్రత్యక్షానుభవం.

ఏ భవనం తెరవటానికో–ఏ చిత్రపటావిష్కరణకో–ఏ సంస్థాశతాబ్దోత్సవానికో తాను వెళ్ళకపోతే కొంప ములిగిపోతుందనే వూహతో ఆవూరు రెండువందల మయిళ్ళ లోపుదయినా సరే. విమానంలోనే పోయి వచ్చే రాష్ట్రమంత్రికి లేని పొదుపు, ఆపూటకు అరకడుపుకైనా ఆకటికి ఆహారం చాలని అదాయంతో అవస్థపడుతూ జీవితం వెళ్ళబుచ్చే గుమస్తాలకెలా వీలవుతుంది? ఇంతకూ నేటి నాయకులు చేసి చూపాలనేవారుకాక, చూపినట్లు తాము చేయని వారనటం తథ్యం. ఇది జాతిపితయొక్క ఆశయానికి పూర్తిగా వ్యతిరేకం.

మనకు ప్రజాప్రభుత్వం ఏర్పడకముందు ఏలికలు తమ ముఖ్యస్థానాలు సాధారణంగా, విడువకుండానే పరిపాలించారు. అయితే, "అప్పుడు పరదేశీయులు మన కధికారులు, స్వార్థపరులయిన తెల్లవారి నిరంకుశ పాలనలో ప్రజలకు వారేమాత్రం పూచీవహించ వలసిన అవసరం వుండేదికాదు. ఈనాడు ప్రజా ప్రతినిధులమయిన మేము అలా చేయటానికి వీలుపడదు. అప్పుడప్పుడు వారిని సందర్శించి వారి లోటు పాటులు తెలుసుకొని వాళ్ళకి అనుకూలంగా మా విధులను నెరవేర్చాలి." అని యీ తిరగటానికి మరిగిన మంత్రులు అంటారు. వీరి ప్రయాణాలకు బత్తాలకు ప్రభుత్వనిధుల నుంచే డబ్బు ఖర్చు అవాలి. ప్రజాభిప్రాయాలకు అంత

పొదుపు విధానం

విలువయిచ్చే వీరు తమ వేతనాలు పొదుపుగా వాడుకొని ఏల చేర్చి పెట్టకూడదు? ఊఁహుఁ ! అలావల్లకాదు. అందుచేతనే వారి ప్రబోధాలన్నీ పరోపదేశపాండిత్యాలకంటె భిన్నంకాదని లోకులు అనుకోవలసి వస్తున్నది.

పొదుపు విషయంలో పురుషులకంటే స్త్రీలే మెరుగనిపిస్తున్నారు. ఏలనంటే, పురుషుడికి కావలసినదల్లా, తనపని, నిగ్రహించుకోవటం మీదనే దృష్టివుంటుంది. కాని ఆర్థికంగా అందుకయ్యే ఖర్చు మితంగా చేశామా, అమితంగా చేశామా, అనే జిజ్ఞాసే అతడికుండదు. రాత్రి యే పదిగంటలప్పుడో వుబుసుపోకకయి వచ్చే స్నేహితుడితో బాతాఖానీలు కొట్టుతూ ఒంటిగంటవరకేనా మేలుకొని వుండటంచేత ఎలక్ట్రికులైట్లో కిరసనాయిలులాంపులో వెలుగుతూంటుంది. అది దుబారా వెచ్చంకిందికే వస్తుంది. రైళ్ళల్లో ప్రయాణం చేసే సమయాల్లో ఎలెక్ట్రిక్కులైట్లో, పంకాలో వేసికొని గమ్యస్థానంలో దిగివెళ్ళేటప్పుడు, వాటిని ఆపకుండానే పోతూవుండటం గమనిస్తూంటాము. తపాలాఫీసులో, మనియార్డరుఫారాలు వగైరాలు తమకెన్ని కావలెనో, అన్నిటిని మాత్రమే తీసుకోకుండా, ఎక్కువగా (తేరకు వస్తాయికదా అని), తీసికొనివచ్చి పాడుచేయటం సర్వసాధారణం. చుట్టలు, బీడీలు. సిగిరెట్లు, ముక్కుపొడుం—వీటికి పెట్టేఖర్చు వ్యర్థమనేది, అలావుండగా తోచినప్పుడల్లా వాటిని ముట్టించటానికి ఉదయం అగ్గిపుల్లలపెట్టె ఒకటికొని సాయంకాలానికి ఖాళీచేసే మహానుభావులు, ఇంటిలో భార్యామణులకు పొదుపులేదని కేకలేస్తూవుంటారు. మడత మాయని డ్రెస్సులతో పూలరంగళ్ళ మోస్తరు ఇతరులకు కనిపించాల్నని— యీ వేళధరించే యిస్త్రీ బట్టలు మరునాటికి పనికిరావని తీసి పారేస్తువుంటారు. వాటిని శుభ్రంగా సబ్బుపెట్టి యింట్లోనే గుంజుకుంటే సరిపోయేది. కాని వారంత పాపానికి ఒడిగట్టరు, మళ్ళా అవి చాకలిషాపుకు వెళ్ళాల్సిందే. పిల్లల బట్టలు త్వరగా మాసిపోతాయనే విషయం తెలిసి వారికి అధికంగా బట్టలు కొనియివ్వాలనే తలంపే లేకుండా, ఫాషన్లు ముదిరి దినానికొకరకంగా వచ్చే దుస్తులు కొనివేసుకొనే నాగరికులయిన తలిదండ్రులనుగూర్చి యేమనాలి? తొడిగేవి ఒకజత బూట్సులే అయినా, అరడజను జతలు తనయింట్లో వుండాలి. ఇక నానారకాలైన 'టై' లు చేతిగుడ్డలు, గుండీలు, మేజోళ్ళు, లెక్కపెట్టలేనన్ని ఉంటేగాని, సంఘంలో తాము చెలామణికామేమో ననుకుంటారు, నేటి షోకీలాలు. తమకంత అవసరం లేకపోయినా, తాగేవాళ్ళను చూచి, ఉత్సాహం(Temptation) రేకెత్తి తామూ తాగాల్నని కాఫీహోటళ్ళలో దూర్చి డబ్బు దుబారాచేసే స్వాములెందరు లేరు? మాటవరసకి శ్రీ వి. కె. కృష్ణమీనన్ (కేంద్ర సైనికశాఖా మంత్రి) అమెరికాకు కాశ్మీర్ విషయాన్నిగూర్చి వాదించటానికి లోగడ ఒకసారి వెళ్ళివుండినపుడు జబ్బు పడ్డాడు. ఆ సందర్భంలో ఆయన ఆరోగ్యాన్ని కనిపెట్టటానికి నియమింపబడ్డ, డాక్టర్లలో ఒకాయన, శ్రీ మీనన్‌గారు రోజుకు 30 కప్పుల తేనీరు సేవించటంమూలాన మందులు అనుకున్నంత త్వరగా పనిచేయటం అసాధ్యమని వెల్లడించాడు. రోజుకు గంటలు 24 మాత్రమే అయితే, శ్రీ మీనన్‌గారి తేనీటి సేవనం ముప్పయి పర్యాయాలా? ఎంత విడ్డూరం? పోనీ, అది వ్యాధిని కుదిర్చే ఔషధమా అంటే, కాదు. ఆహారమా, అంటే అదీకాదు. బలాన్ని చేకూర్చే పదార్థమా అంటే—అదీకాదు. అది దురభ్యాసంతో కూడిన దుబారాఖర్చు కాకపోతే మరేమవుతుంది?

ఈ పొదుపు విధానం అనేది, ముఖ్యంగా మహిళలు అవలంబించటంవల్ల, సంసారాలెంతో బాగుపడతాయి. చూచినవాటినెల్లా కొనటానికి డబ్బు దండుగచేసే దుర్గుణం— విద్యావతులు, విద్యావిహీనలు అయిన స్త్రీలందరిలోనూ సమానంగానే కనబడుతూంది. చేతికి తొడుక్కునే గాజులు. చోళీలు, చీరెలు, పౌడర్లు, వాసన ద్రవ్యాలు, వీటన్నిటికీ మించి ఆభరణాలు, పాదరక్షలు, ఎప్పటికప్పుడు, నాజూకుగా, నాణ్యంగా దృగ్గోచరం కావలసిందే తరవాయి. ఇక ఇంట్లో పురుషుల ప్రాణాలు కొరుక్కు తినేస్తారు. సామాన్య సంసారాల్లో ఇలా సహజంగా వనితలు అన్నిటికీ పురుషుల్ని వేధించుకు తినటంవల్ల వారికి మగవారి ఆదాయాదికాలుగాని అవస్థలుగాని మనస్సుకేరావు.

గృహిణులలో వివేకవతులయినవారైతే వారికి పొదుపరితనం నేర్పటం సుకరం. కానప్పుడు పురుషుడు సంసారంకంటె నరకమే మేలనుకుంటాడు. ఒక్కొక్కప్పుడు ప్రాణత్యాగమే యుక్తమని భావిస్తాడు కూడా. ఇంతకీ కాంతలు కొంతవరకైనా, భర్తలకార్థికాదులలో ఆదుకోవలెననే తలంపుగలవారై నిత్య జీవిత

ములో దుబారావ్యయాలను కొంతవరకు అరికట్టవచ్చును. రాత్రులలో పడకలు చేరేటప్పుడు ఏ బెడ్రూము లైటో (Bed room light) సన్నగా వెలుగుకోసం వుంచుకుంటారుగదా, ఉదయంలేవగానే, ఆ దివ్వెరేకతోనే వేడినీళ్ళపొయ్యో, కుంపటో, స్టవ్వో (Stove) కిరసనాయల ఖర్చులేకుండా కాగితము కొబ్బరిపీచు మొదలగువాటితో ముట్టించుకుంటే సరిపోతుంది. మరల సాయంకాలం వంటకు ఒక్క అగ్గిపుల్లే ఖర్చు. అప్పటి నిప్పు బెడ్డురూములైటు వెలిగేవరకు పనికివస్తుంది. ఇక స్నానాలకు పొయ్యిగాని, బాయిలర్ (Bailor) గాని ముట్టించినపుడు. నీళ్ళు కాగుతుండునపుడే, ఇంటిలోని అందరు స్నానాలు ముగించుకోవాలి; కాని, తీరుబాటుగా ఏ మధ్యాహ్నానికో. సాయంసమయానికో, స్నానాలకింకా రావలసిన వాళ్ళున్నారని అంతవరకు కట్టెలు, బొగ్గులు వ్యర్థంగా మండిపోతూ వున్నప్పుడు చూస్తూవుండకూడదు. ఇంటిలోని వాళ్ళందరికీ ఏపూట కాపూటకు సరివచ్చేటట్టు వంటసామానులు కర్చుచేయాలి, అదనంగా ఏకొంచెమో మిగిలితే సర్దుకొనిపోతూండాలి. మితిమించి వంటసామానులు వృథాచేయకూడదు. ఉదయంపూట సాధారణంగా కార్యాలయాలకు వెళ్ళే పురుషులకు 9 గంటలకల్లా భోజనం తయారు కావలసిన పక్షంలో కాఫీలు పెట్టనక్కరలేదు. ఆ వ్యసనం గలవారికి మాత్రం ఏ అరకప్పో సరఫరా చేస్తేచాలు. మధ్యరకపు సంసారిణులు అయితే వాళ్ళకి అరడజను రవికలు, నాలుగుచీరెలు, బయటవెళ్ళేటప్పుడు ఉపయోగించుకోవటానికి రెండు మేలురకంకోకలు ఉంచేచాలు. ఇరుగు పొరుగు అమ్మలక్కలు కొన్నారని తాజాగావచ్చే చీరెలకు రవికలకు ఉబలాటపడరాదు. భార్యా భర్తలు, ఇద్దరు బిడ్డలు వుండే కుటుంబానికి పనికత్తెలు అనవసరం. పురుషులు వుద్యోగాలకువెళ్ళి మరలఇల్లుచేరేవరకు తమ రవికలు, బిడ్డలదుస్తులు కుట్టటం(నేర్చుకోవటం)యుక్తం. పనిలేని యిరుగు పొరుగు అబలలు బాతాఖానీకోసం మధ్యాహ్నాలలో వచ్చినపుడు, గౌరవంగా నాలుగయిదు మాటలు మాట్లాడి పంపివేయాలి. కాని తమపని చెడగొట్టుకోకూడదు.

దొడ్లు ఉన్నవాళ్ళు, కూరగాయల పాదులు వేసుకోవచ్చును. పూలచెట్లు పెంచుకోవచ్చును. పశువులు, కోళ్ళు మొదలయినవాటిని సాకుకొనవచ్చును. పనిమనుష్యులను పెట్టుకొనే తాహతువుండే గృహిణులు వారివారి గుణాలెటువంటివో పరిశీలించి మరీ పెట్టుకోవాలి. వంటవాండ్లు పురుషులుగా వుండరాదు. అనుభవంగల యాభై దాటిన అమ్మమ్మలు అయితే. యే చీకూచింతా. బాదరబందీ లేకుండా తమ పనులు ఓపికతో చేసుకుపోతారు. అలా కాకుండా యువతులను పెట్టుకుంటే చిక్కులు ఇన్ని అన్నీకావు. పురుషులయిన వంటవాండ్లు పదార్థాలను చిక్కనగా వాడరు. యజమానిని దివాలాతీయిస్తారు. ఈ వంటవాండ్లలో దోపిడీతనానికి జీతపడినవాళ్ళెక్కువ. వాళ్ళ విషయంలో కుటుంబినులకు అనుక్షణం జాగరూకత అవసరం. ఇక పిల్లలని క్రమపద్ధతిలో పెంచటంలో తల్లులశ్రద్ధే ప్రధానం. వారికి వేళకు స్నానాలు, చిరుతిండ్లు, ఆహారాలు తగు మాత్రంగా పెట్టి బళ్ళకు సమయానికి వెళ్ళేట్టుచూడాలి. సాయంకాలాల్లో ఏ ఒక గంట అయినా క్రీడలకు అవకాశం కలిగించాలి. తరవాత ఒళ్ళు. దుస్తులు, శుభ్రపరచుకొని. కాళ్లు చేతులు మలినం లేకుండా కడుక్కొని 7 గంటలకు చదువుకోటానికి కూచోపెట్టాలి. భోజనాలకు లేచేవరకు వారిలోవారు తగువులాడుకోక చదువుకొనేటట్లు తల్లి దగ్గరేవుండాలి. ఇలాచేస్తే వాళ్ళు తప్పక ప్రతిసంవత్సరం పరీక్షలో వుత్తీర్ణులవుతారు. వారి చదువుమీద, ప్రవర్తనమీద తలిదండ్రులు నిఘావుంచకుంటే ప్రతితరగతిలో రెండు మూడేండ్లు బేస్తు పెట్టటం తప్పదు. తన్మూలాన దండుగ కర్చులూ తప్పవు. ఇంతవరకూ కుటుంబాలకు సంబంధించినవి.

బాహాటంగా వివాహాదులలో మనవారు చేసే దండుగవ్యయాలు అలవికి మించినవి. తమ సంబంధులు, చుట్టాలు, మిత్రులు మెచ్చుకోవలెనని వారు చేతికి నరంలేకుండా కర్చుచేస్తుంటారు. కొందలు అహ్వానపత్రికలు అందంగా ఆకర్షణీయంగా వుండేటట్లు వాటికి మాత్రమే నూర్లకొద్ది కర్చుచేస్తారు. ఇక విందులు, అల్పాహారాలు చెప్పనక్కరలేదు. వచ్చినపెద్దలు తిని తిన్నంత పారవేసేటట్లు వడ్డనలు సాగుతాయి. అలాటి సందర్భాలల్లో బీదలకొటపూట కడుపునిండుగా అన్నంపెట్టే పాపానపోరు. ఆకారణం చేతనే కడుపుకాలిన వాళ్లు, తిని పారవేసే యెంగిలి విస్తళ్ళకు కుక్కలతోబాటు ఎగబడుతూ మహానగరాలలో విపరీతంగా చూస్తూ వుంటాము. ఇలా చెప్పటానికి మొదలుపెడితే ఈ ఒక్క వ్యాసం చాలదు.

(తరవాయి 13వ పుటలో చూడుడు)

సుడిగుండాలు

శ్రీ నరిశేపల్లి లక్ష్మీనారాయణ

లేతనీలిచెవర్లేట్ కారు బంగళా వదలి వుడ్‌లాండ్స్ హోటలువైపు అతివేగంగా పరుగిడసాగింది. దట్టముగా పెరిగిన మామిడిచెట్లగుండా కారు తన వెలుతురును ప్రసరిస్తూ సాగిపోతోంది. ఆచూత వృక్షాలు వరుసగా నిల్చుని కారుకు గౌరవవిన్యాసం ఇస్తున్నట్లు అగుపిస్తున్నాయి. ఆ రోడ్డు కొన్ని వంకలుతిరిగి దట్టమైన వృక్షాలలో అదృశ్యమైంది.

తూర్పున దినకరుడు ఇంకా అగుపించకపోవటంవల్ల, ప్రకృతి వాతావరణంలో చల్లదనం తరిగిపోలేదు. హాయిగా వీస్తున్న గాలిలో పక్షుల కిలకిలారావాలు, వాటితోపాటు చెట్లకొమ్మల కదలికలచప్పుడు, ఆకులు రాలుతున్న సవ్వడి వినిపిస్తున్నాయి. తన క్రొత్త కారును సగర్వంగా నడువుకుపోతున్న ఉషారాణీ హృదయం ఆనందపు వెలుగులతో నిండిపోయింది. వుడ్‌లాండ్స్‌హోటల్ యొక్క దీపకాంతులు ఆదట్టమైన పొదలలోకి చొచ్చుకురావటమేగాక, ఆకాంతులు హోటల్‌చేరువకు వస్తోందనే విషయాన్ని తెలియచేస్తున్నాయి. కారువేగం హెచ్చింది. స్పీడుమీటర్ ముల్లు అరవయ్యో నంబర్‌మీద తిష్టవేసింది. ఉషారాణి జీవితంలో ఇది ప్రత్యేకంగా పేర్కొనదగ్గ విషయం. ఆమె నటించిన చిత్రం. "బంగారు కోకిల" చాలా కేంద్రాలలో శతదినోత్సవాలు, నాలుగైదు కేంద్రాలలో రజతోత్సవాలుజరుపుకుంది. ఆచిత్రంలో ఆమె ఆ సంవత్సరానికి ఉత్తమనటిగా ఎన్నికైనట్టు ప్రకటింపబడింది. వుడ్‌లాండ్స్ హోటలులో ఆమె గౌరవార్థం ఏర్పాటుచేయబడ్డ ఒక ప్రత్యేక సభలో ఆమె స్వర్ణపతకాన్ని స్వీకరించటానికి వెడుతోంది,

ఉషారాణి ఇప్పుడిప్పుడే యౌవనంలో అడుగెట్టింది. ఆ యౌవన సౌందర్యం ఆమె శరీర మంతటిని ఆవహించింది. అందంతో అలరారే ఆమె వదనంలో అనిర్వచనీయమైన-ఒకరకమైన ఆకర్షణ ఇమిడిఉంది. తన నల్లటి కురులకు ఆమె ఒక తెల్లరిబ్బను కట్టడంవల్ల అది వాటికి సరిక్రొత్తశోభను చేకూరుస్తోంది. అనాలోచితంగా ఆమె తనకళ్ళను స్టీరింగుచక్రంవైపు త్రిప్పింది. ఆమె యొక్క పలుచని పొడుగైనవ్రేళ్ళు నిర్లక్ష్యంగా స్టీరింగుచక్రంపై బడి విశ్రాంతిని తీసుకున్నాయి. ఆమె ఉంగరపువ్రేలుపై ధగధగ మెరిసే ఉంగరం, సన్నటి "జెనిత్" రిస్టువాచి, వింతసోయగాన్ని ప్రదర్శించే ఆమె పొడుగైనమెడ, ఆమె కళ్ళువీటన్నిటిని పరిశీలించడంవల్ల, సంతృప్తి చెందింది. ఒక్కమారు గట్టిగా నవ్వింది అనుకోకుండా హఠాత్తుగ.

వెనుకసీటులో కూచుని కోడి నిద్రలో కునుకు తీస్తున్న ఉషారాణి స్నేహితురాలు నిర్మల, ఆమె నవ్వుకు ఉలిక్కిపడి కళ్ళుతెరచింది. కారు వంకరతిరిగి గాలిలోనికి బాణంలాగ దూసుకు పోయింది. కారు వేగంగా పోయేకొద్ది హోటలుదీపాలు చేరువకు వస్తున్నాయి. "గర్ర్...ర్ .ర్" అన్న శబ్దంతో కారు ఉన్నట్టుండి ఆగిపోయింది. ఆ కుదుపుకు నిర్మల వెనక్కు పడటంవల్ల కారుపైభాగం తలకు తగిలిఉన్న కాస్తమత్తును వదిలించేసింది. ఉషారాణి స్టీరింగ్ చక్రం మీదికి వాలిపోయింది. రోడ్డుమీద ఉన్నదేదో కారు చక్రానికి తగిలింది. భయంతో వణుకుతూ ఉషారాణి నిర్మలలిరువురూ కారుదిగి బయటికి వచ్చారు. "ఆ! అబ్బా!" అంటూ గాయపడిన ఒక వ్యక్తియొక్క మూల్గులు వినిపించాయి. ఉషారాణి గట్టిగా అరచి అరచేతులతో తన ముఖాన్ని కప్పుకుంది. చిరిగినదుస్తుల్లోవున్న ఆ మనిషికి కారుతగలటంవల్ల అతని ఫాలభాగంనుండి రక్తం చిమ్ముతోంది. అతి ప్రయాసతో నిర్మల, ఉషారాణి, ఇరువురూ కలసి అతన్ని కారులోనికిచేర్చి, వెనక్కు మరల ఉషారాణి బంగళాకుబయలుదేరారు.

"ట్రింగ్...ట్రింగ్" మని టెలిఫోను మ్రోగింది. రేడియోస్విచ్ ఆఫ్‌చేసి "సావిరహే తవదీనా రాధా" అన్న సినిమాగీతికను వింటున్న డాక్టర్ గంగాధర్ గారికి ఎక్కడలేని కోపంవచ్చింది. ఇటువంటి మధుర క్షణాలలోనా ఫోన్ మ్రోగాల్సింది, అని అనుకుంటూ విసుగుతోలేచి రిసీవర్ ఎత్తాడు. ఫోన్‌లో అటువైపు నుండి "డాక్టర్‌గారూ నమస్తే! లక్ష్మీసదన్ నుండి నేను....ఉషారాణిని మాటాడుతున్నది. ఇక్కడ ఒక ఘోర ప్రమాదం సంభవించింది. దయచేసి తక్షణం బయలుదేరి రావాలి." అన్నపలుకులు వినిపించాయి.

ఆమనిషికి దేహమంతటా కట్లు కట్టబడ్డాయి. దేహమంతటా అతనికి తీవ్రమైన గాయాలు ముఖ్యంగా ఫాలభాగంమీద గట్టిదెబ్బలు తగిలాయి. గదితలుపులు కిటికీలు తెరచి ఉంచబడటంవల్ల చల్లగాలి చిన్నగా

లోనికి వస్తోంది. ఆ మనిషికి తెలివి రావటంకోసం డాక్టర్ చాల శ్రమతీసుకున్నాడు.

రాత్రి సమయం. టవర్ క్లాక్ పన్నెండు గంటలు కొట్టింది. ప్రశాంతంగా ఉంది వాతావరణమంతా. మరో పావుగంట గడిచేసరికి ఆ మనిషికి కాస్త తెలివి వచ్చింది. చుట్టూ కలయచూడటానికా అన్నట్టు, తల అటూఇటూ త్రిప్పి మెల్లిగా మూలిగాడు బాధతో. ఇంతసేపూ ఉషారాణి మూగగా ఒకమూల కూచుని ఉంది. ఇప్పుడు ఆమె నెమ్మదిగా అతనిదగ్గరికివచ్చింది. అతని ఫాలభాగంమీద, అతని రెండుకళ్ళ మీద కట్టబడ్డ కట్లను చూచి ఆమె మనస్సు చివుక్కుమంది. తాను నిర్లక్ష్యంగా కారునడపటంవల్ల ఏర్పడ్డ ఫలితాన్నిగూర్చి ఆమె హృదయం విచారసాగరంలో మునిగి పోయింది.

ఆ పేదవాణ్ణి అంతులేని బాధకు గురిచేసినందుకు ఆరాత్రి ఆమె తనకుతానే దూషించుకుంది. తనివితీరా ఒకవేళ ఆ ప్రమాదంవల్ల అతనికళ్ళకు ఏదైనా జరిగితే? తనలో ఈ భావన ఉదయించగానే ఆమె హృదయం ఒక్కమారు ఆవేదనతో తల్లడిల్లి పోయింది. ఆమె ఈ ఊహను తన మనోపథంనుండి ఉపసంహరించుకోవటానికి ప్రయత్నించింది కానీ, ఎంత మరచిపోవాలని ఆశించిందో, ఆ విషయం అంత దృఢంగా ఆమెలో నాటుకుపోయింది. ఇక ఆ విషయాన్నిగూర్చి ఆమె ఏ మాత్రం ఆలోచించే స్థితిలోలేక పోవటంవల్ల తన కళ్ళు గట్టిగా మూసింది. కొంతసేపు కన్నీటిబిందువులు జలజలమని రాలాయి. కానీ నిద్రమాత్రం ఆమెను కౌగిలించుకోలేదు. నిద్రపోవటానికి అమె చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరకు ఆమె లేచి ఆ వ్యక్తికి సంభవింపబోయే మానసిక శారీరక కష్టనష్టాలను తీర్చటానికి తాను న్యాయంగా తన ఆధీనంలోఉన్న వస్తువులేవైనాసరే, తనఐశ్వర్యం, చివరకు తన జీవితమైనా త్యాగం చేయటానికి నిశ్చయించుకుంది. బహుశా ఈ తుదినిర్ణయం ఆమె మనస్సుకు సంతృప్తిని కలుగచేసిందేమో ఆమె హృదయంలోని చింతలన్నీ చెదరిన చీకట్లలాగ, విడిపోయిన మబ్బుల్లాగ మటుమాయ మయ్యాయి. అంతేగాక ఎటువంటి బాధాపూరితమైన ఆలోచనలు ఆమెయొక్క కంపిత మనస్సులో ప్రవేశింపక ముందే తేలికపడ్డ హృదయంతో ఆమె హాయిగా నిద్రపోయింది.

అనుదినం డాక్టర్ ఆమెను ఓదార్చి, ఆతృతకొద్దీ ఆమె వేసే ప్రశ్నలకు ఆయన తగు సమాధానాలు చెబుతున్నాడు. ఆ అనాథుని బాధలకు తానే కారకురాలని ఆలోచించికూడా, ఆమె అతనికి ఏ సహాయమూ చెయ్యలేక పోయింది. కానీ ఏకాంతంగా ఉన్నప్పుడు, ఎవరూ చూడనపుడు మాత్రం ఆమె అతని పట్ల సానుభూతితో భోరున విలపించేది.

దాదాపు ఒకమాసంరోజులు గడిచాక కట్లు కాస్త తొలగింపబడ్డాయి. చూడగా అతడు సవ్యంగా ఉన్నాడు. చేరువకెళ్ళి ఉషారాణి అతని ఫాలభాగాన్ని పరిశీలించింది. అక్కడ తగిలిన దెబ్బకు చిహ్నంగా ఒక కాటు మాత్రం ఏర్పడింది. ఆమె అతని కళ్ళలోనికి చూచింది. అవి నిర్మలంగా ఉన్నట్టు స్పష్టంగా అగుపించాయి.

"నేనెక్కడున్నాను? నేనెక్కడున్నాను?" అతను గట్టిగా అరచి ముందుకు నడిచాడు. ఒక్క అరుపుతో అతని హృదయం బద్దలైనట్టు బాధపడి "నేనేమీచూడలేను. నాకు కళ్ళున్నాయికానీ చూపులేదు" అని పలికాడు. తెరచుకున్న కళ్ళను నులుముకొని అతను శోకంతో క్రుంగిపోయాడు.

"నే నిప్పుడు ఎక్కడికెళ్ళాలి? ఎవరివద్ద కెళ్ళాలి? హా, భగవంతుడా! ఇంతటి ఆపదకు గురిచేసి నా దృష్టిని హరించి నీవు నన్ను ఇంకా ఎందుకు బ్రతికించావు?" అని విలపించాడు.

ఆ వ్యక్తి దురదృష్టాన్ని చూచి డాక్టరుగారు ఎంతో బాధపడ్డారు. అతనివీపు తట్టి డాక్టరుగారు స్నేహపూర్వకంగా "మిత్రమా! బాధపడకు. నీవు కావాలంటే వైద్యశాలలో ఉండు. నిస్సహాయుడవంటూ నీకేసును సిఫారస్‌చేసి నేను నీకు అందులో స్థానం ఇప్పిస్తా! నీవేమీ బెంగపెట్టుకోనక్కర్లేదు" అని పలికాడు.

"నిస్సహాయుడా!" అన్న పలుకులు అప్రయత్నంగా వల్లించింది ఉషారాణి.

"ఎందువల్ల?" ఆమె ప్రశ్నించింది. ఆ ప్రశ్నలో అతడు నిస్సహాయుడవటానికి బాధ్యురాలు తానేననీ అందుకు తగిన జరిమానా చెల్లించటానికి తాను సిద్ధంగాఉన్నాననే భావాలు ప్రతిధ్వనించాయి.

ఆమె డాక్టర్‌ను సమీపించి ఆ వ్యక్తికి కొన్ని మాసాలు తన బంగళాలోనే నివాసం కల్పిస్తాననే తన నిర్ణయాన్ని తెలియచేసింది.

అద్భుతమైన లక్ష్మీసదన్‌లో ఒక చలువరాతిగదిలో హేమంత్ ఒక మెత్తటి పరుపుమీద పడుకున్నాడు.

పిల్లవాయువులు వచ్చి అతని శరీరానికి చల్లగా తగల టంవల్ల అతడు నిద్రనుండి సంపూర్తిగ మేల్కొన్నాడు. తనమీద ఉన్న ఉన్ని శాలువను కాస్త తొలగించి, లేచి కిటికీవైపు నడిచాడు. అల్లా నడవడంలో అతడు అక్కడే ఉన్న ఇనుపస్టాండును ఢీకొట్టాడు. ఆస్టాండు, దానితోపాటు అందులోఉన్న దీపం క్రింద బడ్డాయి. స్టాండు క్రిందబడి దీపం ముక్కలవగానే, బంగళాలోని వారంతా అక్కడకు చేరారు. ఇంతలోనే ఉషారాణివచ్చి విషాద హృదయంతో అతని చేతులు పట్టుకొని "పరదేశీ, నీకంత నిస్పృహ కలగటానికి కారణమేమిటి? నీవు ఏ మాత్రం బెంగపడ వద్దు. నేను ఇక్కడే నీవద్దనే ఉండి, నీవు ఎక్కడి కెళ్ళాలన్నా సాయంగాఉండి తీసుకెడతాను. నీ దుర దృష్టానికి నేనే నిందితురాలను కనుక నీ చూపుకోసం నా కళ్ళనుకూడ సమర్పించి నీకు కలిగిన నష్టాన్ని పూరించటానికి సంసిద్ధంగా ఉన్నాను. విచారపడకు. సంపూర్ణంగా నిస్సహాయస్థితిలో ఉన్న ఏ మానవుడికైనా భగవంతుడు తప్పక సహాయపడతాడు. అసహాయస్థితిలో ఉన్న పెద్ద పక్షికైనా గూటిలో దాని ఆహారం లభిస్తోనే ఉంటుంది. ప్రపంచమంతా కన్నీటి మయంగా ఉంది. ఇటువంటి పరిస్థితులలో అశక్తులకు దిక్కులేనివారికి సహాయం చెయ్యటం ప్రతి ఒక్కరూ తమ విధిగా భావించాలి" అని పలికి ఉషారాణి చివరకు అతన్ని అనునయ పూర్వకంగా, పరుపుమీద విశ్రాంతి తీసికొనేట్టు చేసింది.

అతిశయించే బాధను భరింపలేక, పొరలివచ్చే దుఃఖానికి తట్టుకోలేక అతను ఏ క్షణంలోనైనా ఆత్మహత్య చేసుకుంటాడేమోనని ఆరోజు నుండి ఉషారాణి క్షణక్షణం భయపడుతూనే వచ్చింది. ఆమె తన మిత్రులను, అభిమానులను మరచిపోజొచ్చింది. విహార యాత్రల్లాంటి అనవసర కార్యక్రమాలకు స్వస్తి చెప్పటం ప్రారంభించింది. అంతేకాక బయట "నేమ్‌బోర్డు" లో తాను ఎల్లప్పుడూ బయటికెళ్ళినట్టు చూపమని పనిమనుషులకు సలహానిచ్చింది. స్టూడియోల కెళ్ళాల్సిన సమయాల్లో తప్ప రోజల్లా ఉషారాణి అతన్ని కనిపెట్టుకుని కూచునేది.

ఒకరోజు సాయంసమయం, గోడగడియారం ఆరు గంటలు చూపుతోంది. "ఆలిండియా రేడియో; మద్రాసుకేంద్రం. "బంగారు కోకిల" చిత్రంలో మీ అభిమానతార ఉషారాణి కమ్మని కంఠం వినండి" అని రేడియోలో ఒక స్వరం పలికింది. వెంటనే పురివిప్పి ఆడింది. "అందాల మయూరి" అనే పాట తేలియాడుతూ వినవచ్చింది. ఆపాట వింటూ అతడు తన ముందు ఒక ఉద్యాన వనాన్ని అందులో గొంతెత్తి పాడుతున్న ఒక కోకిలను, పురివిప్పి ఆడుతున్న ఒక నెమలిని ఊహించుకున్నాడు. అతని వీనులకు ఆపాట ఎంత మధురంగాఉంది. అతడు తన గ్రామంలోని టీ షాపులో కూర్చుని ప్రతి సోమవారం నాటి సాయంత్రం వేడివేడి టీ త్రాగేటప్పుడు వినేది, ఈమె కంఠమేననే విషయం, అతనికి తొలిసారిగ తెలియవచ్చింది. తప్పకుండా ఈమె ఆమే. ఆమెను కాస్త చూడడానికి తనకు కళ్ళుంటే ఎంత బాగుండేది. విధిబలీయం. టీ గ్లాసు పెదవులకు దగ్గరగానున్నప్పుడు ఆ పెదవులు గ్లాసును తాకలేని స్థితిలో ఉండి పొయ్యాయి. అతడు తన కళ్ళను గూర్చి ఆలోచించాడు. ప్రపంచంలోని వింతలు, విడ్డూరాలను చూచి ఆనందించటానికి అవి నోచుకోలేదు. ఎంత పనికిమాలినవి! కోపంకొద్దీ భగభగమండేలాగ అతడు తన కళ్ళను రెండు మూడు మార్లు గోళ్ళతో పొడిచాడు. కానీ మొదట ఉషారాణి దీనంగా తన మధురకంఠంతో వల్లించిన ప్రేమపూర్వక వచనాలను తలంచుకొని ఆ కళ్ళకు ఎటువంటి కీడును తలపెట్టలేక పొయ్యాడు. అంతేకాదు తాను ఆమె పలుకుల నెన్నటికీ మరువలేడు. ప్రతిరోజు ఉదయం తనకు అగుపించని చిరునగవుతో ఆమె తన్ను పలకరించే విషయాన్ని తల్చుకుంటే అతని హృదయవీణ ఎందుకో స్పందించి ఆనంద గీతాలాపనలు సాగించేది. అప్పుడు చీకటిగదుల్లాంటి అతని కళ్ళనుండి వెలుగు కిరణాలవంటి ఆనంద భాష్పాలు వెలువడేవి. కానీ ఆమెకు కనిపించకుండా అతను వాటిని వేంటనే తుడిచేసేవాడు.

"ఆ!" అని అతను ఉలిక్కిపడ్డాడు. ఎవరో అతన్ని స్పృశించారు. పాట ఆగిపోయింది. అతను వెంటనే ఒక్కమారు తన ముఖమూ, కళ్ళు తుడుచుకొని వెను దిరిగి ఆ వస్తువును స్పృశించాడు. "ఆహా! ఎంతమధురంగా పాడుతావు ఉషారాణీ!" అని విస్మయచకితుడై పలికాడు.

"మీకు నిజంగా నా పాటంటే అంత ఇష్టమా?" అడిగింది ఉషారాణి కళ్ళు పెద్దవిచేసి.

"అవును. నిస్సందేహంగా. ఆపాట కమ్మగా ఉంది. వింటోంటే మరీమరీ వినాలనిపిస్తుంది. నాకోసం నీవు

ఎందుకు పాడకూడదు? ఇంతటి విశాల భవనంలో రోజంతా ఒంటరిగా కూచోటం నాకు చాల విసుగును కలుగచేస్తోంది" అన్నాడు అతడు. ఈమాటలు పలుకుతున్నప్పుడు అతని ముఖంలో ఆవరించిన విషాద ఛాయలను అమె గుర్తించక పోలేదు.

"ఎందుకు పాడనూ? తప్పక పాడుతా!" అని పలికింది ఆమె, అతని మాటలకు సమాధానంగా. "నిజంగానా?" అంతకంటే అధికంగా అతను ఏమీ మాట్లాడలేదు.

ఆమె అతన్ని సమీపించి అతనిచేతులు పట్టుకొని "ఆ పాట నిన్ను సంతృప్తిపరచి నీకు అంత ఆనందాన్ని చేకూర్చితే తప్పకుండా నీ కోసం ఆపాట పాడుతాను. కాని హేమంత్ ఇదేమిటి? ఏ వేళ చూచినా నీ కళ్ళనుండి నీరు చిమ్ముతూనే ఉంటాయి. నీ దుఃఖాశ్రువు లెప్పుడూ నన్ను శూలాలతో పొడిచినట్టు బాధిస్తుంటాయి. అవి నా గుండెను బ్రద్దలు చేస్తాయి. చెప్పు! నీకు నీ కళ్ళకు నేను చేయగలిగిందేమిటి? నీకనుచూపు మరల నీకు లభ్యమయ్యేట్టుంటే అందుకు నా జీవితాన్నే నీ పాదాలవద్ద ఉంచుతాను" అని అంది ఉషారాణి గాద్గదికంగా.

"లేదు, లేదు, ఉషారాణీ, అల్లా అనవద్దు. నా జీవితమొక విషాద సమరగాథ. ఈ పోరాటంలో జయం పొందాలని నేనెంత పెనుగులాడుతానో, నాకు కలిగేది అంత దుఃఖ విచారాలే కానీ ఆనందంకాదు. నేను ప్రపంచానికే ఒకభారం. ఇటువంటి వ్యక్తికోసం నీవెందుకు బాధపడుతావ్? ననువెళ్ళనీ!" విషాదభరితమైన అతని హృదయాంతరాళం నుండి ఈ పలుకులు వెలుపలికి వచ్చాయి.

"లేదు హేమంత్! జీవితమనే ఈ గొప్పనాటకంలో మనమంతా నటకులము. ప్రపంచమనే నాటక రంగానికి దర్శకుడైన ఆ భగవంతుని ఆదేశానుసారంగా మనమంతా నటించాల్సిందే! ఒక మానవుని యువరాజుగ చేయటమో, రైతుబిడ్డగా మార్చటమో, అందంగా రూపొందించటమో, అందహీనంగా సృష్టించటమో, వివేకిగా వెలుగొందించటమో, అవివేకిగా అంతంచేయటమో, అంతా ఆ భగవంతునికే వదలి వేయబడింది. విచారపడకు. భగవంతుడు అభిలషిస్తే చీకటిలో కలసిన నీకనుచూపు మరల నీకు సంప్రాప్తిస్తుంది." అని పలికింది ఉషారాణి కనుకొలకుల నిల్చిన కన్నీటి బిందువులను తుడుచుకుంటూ. "హా! భగవంతుడా! నాకళ్ళు నాకివ్వు. నాకళ్లు నాకు మరలఇవ్వు." అని అంటూ అతను కళ్ళు తుడుచుకుంటూ పిచ్చిగా అరిచాడు. తన అలంకరణ గదిలోకెడుతున్న ఉషారాణి కర్ణపుటాల్లో అతనిపలుకులు గింగురుమన్నాయి. కొంతసేపటికి ఏమీ వినిపించలేదు. ఆ నిశ్శబ్దతవల్ల వాతావరణంలో ఒక విధమైన ప్రశాంతత ఏర్పడింది.

తనలో సంభవించిన మహత్తర పరిణామానికి ఉషారాణి ఎంతో ఆశ్చర్యపోయింది. లోపసహితమైన తన స్నేహితురాలి పాట విని ఆమెపట్ల తాను ఎంత కఠినంగా మాట్లాడేది, తన చిత్రాలలో తనతో నటించే నాయకుని నటనలో లోపాలేవైనా ఉంటే అతన్ని తాను ఎంతో నిర్దాక్షిణ్యంగా. నిర్భయంగా విమర్శించేది, అవసరమైన ఏర్పాట్లు అసంతృప్తికరంగా ఉన్నందువల్ల తాను గ్రామఫోను కంపెనీ వారితో చేసుకున్న కాంట్రాక్టును ఎంతనిర్లక్ష్యంగా రద్దుచేసుకుంది! క్రోధాన్ని ప్రకటించే తన చూపులకు తన సేవకులు ఎంత భయపడేవారు? కాని ఇవన్నీ గత చరిత్రకు సంబంధించినవి. ఇప్పుడు తాను ఇల్లాంటి వాటి నన్నిటినీ జయించింది. ఏవ్యక్తైతే భయంకర ప్రమాదానికి గురిచేసిందో, అతనిపట్ల తాను క్రూరంగా ఉంటుందా? తానుఇప్పుడు అతనిపట్ల దయార్ద్రహృదయంతో, సానుభూతితో ప్రవర్తించాలి; లేకపోతే భగవంతుని శాపమో, తన అంతరాత్మయొక్క ఘోషయో తనను వెంటాడి బాధిస్తుంది. అతని క్షేమం కోసం తాను ఇంతవరకూ ఏ బాధలూ పడలేదు. ఈ ఉద్దేశంతోనే అతనికి ఆత్మానందాన్ని ప్రసాదించటం కోసం ఆమె ఎల్లవేళల అతనికి జాగ్రత్తగ సితారాను వాయించటం నేర్పింది. అంతేకాక ఖరీదైన తన అభిమాన సితారాను అతనికి కానుకగా సమర్పించింది. దీనివల్లనైనా అతడు తన బాధలు మరచి కాలాన్ని అవలీలగా గడుపుతాడని ఆమె ఆశించింది.

ఉషారాణి, హేమంత్ లిరువురూ కే. యస్. ఆర్. హాస్పిటల్‌లో కంటి ఆపరేషన్ కోసం వరుసలో నిల్చున్నారు. ఐస్పెషలిస్ట్ డాక్టర్ నరోడ్ అమెరికానుండి వచ్చాడు. ఆమె మనస్సులో కుతూహలం, భయం ఉప్పొంగి పోతున్నాయి. అతని హృదయంలో ఆశ, ఆనందం చెలరేగిపోతున్నాయి. ఉభయులూ మెల్లిగా ముందుకు నడిచారు. అతను ఆపరేషన్ థియేటర్ లోనికెళ్ళగానే ఆమె బయట అక్కడే వెట్టివెట్టి ఆలోచనలతో, అర్థంలేని ఆవేదనలతో, ఫలితం ఎల్లా పరిణమిస్తుందోననే బెంగతో నిరీక్షించ సాగింది. ఒక అర

గంట గడిచాక తలుపులు తెరచుకొని హేమంత్ చక్రాలుగల ఒక కుర్చీలో బయటికి వచ్చాడు. తరువాత ఆమెను లోనికి పిలిచి డాక్టర్ ఆమెకు కొన్ని ముఖ్య విషయాలను సవివరంగా తెలియ చేశాడు. ఆమె వెనుదిరిగి వచ్చేటప్పుడు, హేమంత్ నేత్రచికిత్స విజయవంతమైనందుకు చిరునవ్వు చిందిస్తూ సంపూర్ణ సంతృప్తితో వచ్చింది. అతడు లేతనీలి చెవర్లెట్ కారులోని వెనుక సీటులో కూచోగానే, ఆమె డ్రైవింగ్ సీటులో కూచుని స్టీరింగుమీద చెయ్యివేసి" హేమంత్ నీవు త్వరలో ప్రపంచంలోని వెలుగు నీడలను తప్పక చూస్తావు" అని అనింది.

విసుగునుపుట్టించే సుదీర్ఘమైన గంటలతో-దాదాపు పక్షంరోజులు నెమ్మదిగా, మందంగా, గడచి పొయ్యాయి. నిండుపున్నమ చంద్రుడు నీలాంబరంలో స్వైర విహారం సల్పుతున్నాడు, పాలవంటి తెల్లని, చల్లని చంద్రకిరణాలు నిశ్శబ్దంగా నిదురపోతున్న పుష్పహృదయాలను స్పృశిస్తున్నాయి.

నడిరేయిసమయ మైందని హెచ్చరించటానికా అన్నట్టు గోడగడియారం పండ్రెండు గంటలుకొట్టింది ఉషారాణి వణుకుతూ నెమ్మదిగా అతని కళ్ళమీద కట్టబడిఉన్న కట్లను విప్పింది. హేమంత్ చివాలున లేచి నిల్చున్నాడు. "ఉషారాణి, ఉషారాణీ! నేను కోల్పోయిన నాఆస్తివి, నాకళ్ళను నాకు ప్రసాదించిన నాదేవతా మూర్తివి. ఈ సరికొత్త ప్రపంచంలో తొలిసారిగ నిన్ను చూడనీ!" అని అంటూ అతను గుండ్రంగా తిరిగాడు. (సశేషం)

తాగుబోతు

శ్రీమతి జి. శారద

మసకచీకటి పడుతోంది. క్రమ్ముచున్నమబ్బుల్లోంచి చందమామ దోబూచులాడుతున్నాడు. పక్షులన్నీ గూళ్ళు చేరుకుంటున్నాయి. పగలనగా పనికొచ్చిన కూలీలంతా గబగబానడచి ఇల్లుచేరుకుంటున్నారు. కానీ మోపెడుకట్టెలు నెత్తినపెట్టుకువెళ్తూన్న లచ్చిమాత్రం తోటి కూలీలతో నడవలేక వెనకబడిపోయింది. అంతా నిశ్శబ్దంగా వుంది. లచ్చిఅడుగుల చప్పుడు తప్ప వేరేధ్వని వినపడటంలేదు.

ఉన్నట్టుండి యేదో ఆకారం వెనకనుండి వచ్చి లచ్చి చెయ్యి పట్టుకుంది. లచ్చి ఉలిక్కిపడి వెనక్కి తిరిగేసరికి నెత్తినున్న కట్టెలమోపు క్రిందపడింది. ఆ ఆకారం లచ్చిని మరింతదగ్గిరకు లాక్కుంది. లచ్చి వాడిచేతుల్లోంచి విడిపించుకోవటానికి గిజగిజలాడింది. అతికష్టంమీద చెయ్యివిడిపించుకొని, బలంగా నోటిమీద ఒక్క గుద్దుగుద్ది, కట్టెలమోపు నెత్తిమీద పెట్టుకొని "సచ్చినోడా ఎవడ్రా నువ్వు. నీకు అక్కసెల్లెళ్లు లేరు" అనుకుంటూ గబగబా కొంగుసవరించికొని నడవసాగింది. కొంతదూరం వెళ్ళిన లచ్చికి 'అమ్మా ! అమ్మా !' అన్న మూలుగు వినబడి, తిరిగిచూసి, అతడు పూర్తిగా క్రిందపడిపోయి వుండటం గమనించి "మరేం ఫరవాలేదులే. అమ్మయ్య" అనుకుంటూ మళ్ళీ నడక మొదలుపెట్టింది. అతనినోటినుండి రక్తంకారడం గమనించిన లచ్చికి కొంచెం భయంకూడా కలిగింది. "అంతగట్టిగా కొట్టిందా తను!" అనుకుంటూ గబగబా ఇల్లుచేరిన లచ్చి కట్టెలమోపును కిందపడేసి, పొయ్యిముట్టించి, బియ్యం పొయ్యిమీద పడేసి, స్నానంచెయ్యసాగింది. ఒళ్ళు రుద్దుకుంటూన్నలచ్చికి ఆమనిషితో కలిగిన స్పర్శ గుర్తుకువచ్చి ఒళ్ళుపులకరించింది. సిగ్గుపడి గబగబా స్నానంపూర్తిచేసి బట్టలుకట్టుకుని బొట్టు పెట్టుకుంటూన్న లచ్చికి "పాపం! అతనెవడో? అంతగట్టిగా కొట్టిందే తను. రక్తంకూడా వచ్చింది. క్రిందపడిపోయాడు. ఎలావున్నాడో వెళ్ళిచూసొస్తే" అనుకోవడమేమిటి, పరుగుతీసిందిలచ్చి. ఆమనిషక్కడే పడుకున్నాడు. నోటినుంచి రక్తం కారి మరకకట్టింది. లచ్చి మెల్లిగా దగ్గిరికెళ్ళి "అయ్యా! ఓయ్యా!" అని పిలిచింది. ఆమనిషి కళ్ళుతెరిచాడు. లచ్చినిచూసి ఆశ్చర్యపోయినా లేవలేక అలాగే పడిపోయాడు. "లెయ్యి! కూడుతిందుగానీ", అన్నలచ్చిమాటలకి "నాకు కూడెందుకూ" అన్నప్పుడు ఆమనిషినోటినుండి వొచ్చిన వాసనకి లచ్చి ముక్కుమూసుకుంది. "ఓ త్రాగుబోతా" అనుకుంది లచ్చి. "ఫర్వాలేదులే! రా! మాయింటికిపోదాం. నీకు కూడుపెడ్తాను." అంటూ అతనిచెయ్యి పట్టుకొని నడిపించుకు తీసికెళ్ళింది లచ్చి.

"పారిపోయిన లచ్చి మొగుడు తిరిగొచ్చాట్ట! అబ్బే ఎవడో సైన్యంలోంచి పారిపోయి ఒచ్చాట్ట" "ఎదో దూరపుచుట్టంట. వరసకి బావే అవుతాడంటలే" అని పలుపురు పలువిధాలుగా అనుకోసాగారు. అతడు వూళ్ళో అడుగుపెట్టిన మూడోనాడే తెలిసింది "వాడు తాగుతాట్ట" అని. తాగుబోతు బజార్లో వొస్తున్నాడంటే ఆడవాళ్లంతా తప్పుకుని లోపలికెళ్ళిపోయేవారు. ఆడుకుంటున్న పిల్లలు, ఆడవాళ్ళవంకా, తాగుబోతువంకా వింతగా చూసేవారు. కానీ తాగుబోతుకివేమీ తెలియవు. ఎంతసేపూ ఆసారామైకం, తప్పితేలచ్చి. అసలుపేరు యేదైనా, వాడికి తాగుబోతుపేరే సార్ధకమైంది ఊళ్ళో.

ఆవూళ్ళోకల్లా పేరైనకుటుంబాల్లో ఒకటి రామిరెడ్డిది. ఇంకోటి రామస్వామినాయుడుదీను. ప్రతీదానిలోనూ ఈ రెండుకుటుంబాలూ పోటీగా వుండేవి. ఆపోటీయే ప్రబలశత్రుత్వంగాతయారయింది కానీ,ఆదేంవిచిత్రమో ఇంతవైరంలోను రెడ్డిగారికొడుకు నాయుడుగారికుమార్తెను ప్రేమించడం జరిగింది. వివాహంజరగడం అసాధ్యం అని తెలిసినా, ఆప్రేమబీజాన్ని పెరికివెయ్యక పెంచుతూవొచ్చారు. కానీ ఇదిరహస్యంగానే వుండిపోయింది.

ఇంతలో ఎలక్షన్లు ముంచుకొచ్చాయి. గ్రామపంచాయితీ ప్రెసిడెంటుగా రెడ్డి నిలబడుతున్నాడని తెలిసి నాయుడుకూడా పోటీచేశాడు. ఊరుఊరంతా కోలాహలంలో మునిగి పోయింది. "రెడ్డిగారికే మీ ఓటు" అంటే "నాడుగారికే మీఓటు'' అని మంత్రంలా పఠిస్తున్నారు ప్రజలు. "ఎంతడబ్బైనా సరే ఖర్చుపెడతాను. చూస్తాను వీడితడాఖా'' అంటున్నారు నాయుడుగారు. "నేనుమాత్రం తక్కువతిన్నానా" అంటున్నారు రెడ్డిగారు.

మూడువందలు ఖర్చుపెట్టి అన్నదానం చేయించారు నాయుడుగారు. ''ఓస్. ఇంతేనా? నేను ఐదువందలు ఖర్చుపెట్టి వస్త్రదానం చేయిస్తాను" అన్నారు రెడ్డిగారు. కానీ సమయానికి అతనిదగ్గిర డబ్బు లేకపోవడంవల్ల ఏంచెయ్యాలో తెలీక తికమకపడసాగారు. ఇదే అదను అనుకొని రెడ్డిగారికొడుకు రాఘవరెడ్డి తండ్రిదగ్గిరకెళ్ళి

"నాన్నా! మీకుకావలసిన డబ్బు నేనిస్తాను. మరి నాకొక సహాయం చేయాలి." అన్నాడు. సంతోషంతో రెడ్డి ఎగిరి గంతేశాడు. అతురతతో "ఎలా యిస్తావునాయనా" అన్నాడు. "నాయుడుగారి కూతురు రమని అడిగి యిస్తాను" "అన్నరాఘవరెడ్డి మాటలు విన్న రెడ్డిగారు నిశ్చేష్టులయ్యారు. "అదేమిటిరా" అన్నారు. "అవునునాన్నా" నేను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయికి కూడా నేనంటే యిష్టమే. మీరు మావివాహాన్ని జరిపించాలి" అన్నాడు. రెడ్డికి మనసులో ఒళ్ళుమండినా అవసరానికి" "సరే" అనక తప్పలేదు.

అర్థరాత్రి ఒకఆకారం నల్లటి ముసుగుల్లో నాయుడు గారి గేటుదూకి లోపలికెళ్ళింది. ఒక్కొక్కగదే దాటుతూ వెళ్ళింది. చివరగది కిటికీముందు కొచ్చి ఆగిపోయింది. చేతిలోని టార్చిలైటు వెలిగి నిద్రపోతూన్న రమ ముఖం మీద పడింది. ఉలిక్కిపడిలేచిన రమ "భయపడకు. నేనే రాఘవరెడ్డిని" అన్నమాటలు వినిపించి కిటికీవైపు చూసింది. ముసుగు తీసేసి రాఘవరెడ్డి "రమా! తలుపు తియ్యి. నీతో అర్జంటుగా మాట్లాడాలి" అన్నాడు. రమ వెళ్ళి కిక్కురుమనకుండా తలుపుతీసింది. "ఏం. ఇప్పుడెందుకు వచ్చావ్? ఎవరైనాచూస్తే" అంది భయపడుతూ.

"రమా! అర్జంటుగా ఐదువందలుకావాలి. తీసుకురా!" అన్నాడు భుజంతట్టుతూ.

ఒక్కక్షణం ఆలోచించి "సరే, అంటూ లోపలికెళ్ళి పది వందరూపాయల నోట్లతో తిరిగివొచ్చింది. ఐదు నోట్లు చేతిలోపెట్టి "చాలా ఇంకాకావాలా" అంది. ప్రస్తుతానికివ్వి చాలులే మళ్ల కలుసుకుంటాను" అని రమచేతులు పట్టుకున్నాడు రాఘవరెడ్డి. ఇంతలో ఎవరో వస్తూన్న చప్పుడైంది. ఇద్దరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి తిరిగి చూశారు.

"ఏంటేదొంగతనం" గుప్పున సారావాసన కొట్టింది.

"ఛీ నోర్ముయ్. తాగుబోతా" అరిచాడు రాఘవరెడ్డి.

"అయ్యగారికి చెప్పమన్నారా ఈ సంగతి. సదువుకున్నోళ్ళు చెయ్యవలసినపనేనా యిది" అంటున్నాడు తాగుబోతు. ఇంతలో రమ యేదోసైగ చేయడంవల్ల రాఘవరెడ్డి పరుగు లంకించుకున్నాడు. రమ "దొంగ, దొంగ" అని అరిచేసరికి ఊళ్లోవాళ్లంతా పోగయ్యారు. "ఏడేవెధవ" అనుకుంటూ నాయుడుగారొచ్చారు.

"అడుగో! తాగుబోతువెధవ. దొంగతనాలుకూడా మొదలుపెట్టాడు" అంటున్నారెవరో.

"తన్నండ్రా వెధవని. చూస్తారేం" అన్నారు నాయుడుగారు. అనడమే తడవుగా కఱ్ఱలుపైకిలేచాయి. పాపం! ఆతాగుబోతు మాట వినేదెవరూ? ఒళ్లు హూనం హూనం చేసి ఒదిలి పెట్టారు ఊరిపెద్దలు.

తూలుతూ రక్తపుమరకలతో గుడిసె చేరాడు. అతణ్ణి చూసి లచ్చి వొణికిపోయింది. జరిగిందంతా తెలుసుకొని కన్నీరుకార్చింది. "పాడులోకం! నిజాయితీకి స్థలంలేదు. డబ్బున్నవాడిదేపైచెయ్యి. పైకిమెత్తగాకనపడే యీదొరలంతా తేనెపూసినకత్తులు" అని తిట్టుకుంటూ తాగుబోతు గాయాలకి మందుపెడుతోంది.

రోజులు గడుస్తున్నాయి. ఎలక్షన్లు దగ్గరపడుతున్నాయి. రెడ్డిగారింటిముందు హరికథ జరిగితే, నాయుడుగారింటిముందు బుఱ్ఱకథ జరుగుతోంది. ప్రజలలో ఓటు యెవరికి వేయాలో తెలియక అవస్థపడుతున్నారు. తాగుబోతుకిమాత్రం తనసారా తనలచ్చి తప్ప ఇంకో ఆలోచనే లేదు. కాని వూళ్లో వాళ్ళందరూ వాణ్ణి "దొంగ వెధవా" అని తిడుతూనేవున్నారు. లచ్చికి తాగుబోతుతప్ప వేరేప్రపంచమేలేదు.

ఆరోజు అమావాస్య ఊరంతా చీకటిగావుంది. దూరాన్నెక్కడో నక్కలకూతలూ, కుక్కలుమొరగటమూతప్ప వేరే చప్పుడులేదు. ఆనిశ్శబ్దవాతావరణంలో తాగుబోతు ఒక్కడూ తూలుకుంటూ ఏదో పాడుకుంటూ నడుస్తున్నాడు. కొంతదూరం వచ్చేసరికి సన్నగా వెలుగు ప్రారంభించింది. ఏవోకొన్ని కంఠాలు గుసగుసవినిపించాయి. "అంటించండ్రా" అంటోంది ఒకగొంతు. "మెల్లిగా! సప్పుడుచెయ్యకండి" అంటోంది ఇంకో గొంతు. వెంటనే మంటలు ప్రారంభమయ్యాయి. చేనంతా కాలిపోతోంది. తాగుబోతు నాయుడుగారికి చెప్పాలని పరుగెత్తపోయాడు. కాని తూలిపోయి పడిపోయాడు. ఇంతలో ఎక్కడివాళ్లక్కడ పరుగెత్తి పారిపోవడం జరిగింది. ఈవార్త తెలిసిన నాయుడుగారు, లబోదిబోమంటూ ఉగ్రరూపందాల్చి పొలందగ్గరికొచ్చారు. దారంతా చీకటిగా వుండటంవల్ల, కాగడా చేతితో పట్టుకొని నాయుడుగారింటికని బయలుదేరుతూన్న తాగుబోతుని చూసి "ఓరే! నువంట్రా. దుర్మార్గుడా! దొంగతనం చేసింది చాలక పంటంతా పొట్టనపెట్టుకున్నావా? ఇవాళ నీఆయుషు మూడింది–పో" అనుకుంటూ పెద్దపొలికేక తేశారు.

దాంతో మళ్ల ఊరంతా మూగిపోయింది. "చచ్చినోడా! నిన్ను అప్పుడే చంపవలసిందసలు. పోనీ అని వదలిపెడితే ఇంతవరకూవచ్చింది. ఊ! తన్నండి'' అవగానే కొరడా నిర్భయంగా నిర్దాక్షిణ్యంగా పనిచేసింది. ఆ అమాయకపు త్రాగుపోతుమీద. ఆగుంపులో ఆదీనుడి రోదన వినేవారెవరూ? కొట్టికొట్టిఅలసిపోయారేమో, ఎక్కడివాళ్లక్కడ కొంత సేపటికి సర్దుకున్నారు. తాగుబోతు మైకంలోగాక సొమ్మసిల్లి పడిపోయాడు. రామిరెడ్డిపార్టీ మాత్రం ఉషారుగావుంది. ''జాముప్రొద్దెక్కినా యెందుకురాలేదా" అని లచ్చి వెదుక్కుంటూ వచ్చి క్రిందపడిపోయిన తాగుబోతుని చూసి భోరున యేడ్చింది. ''ఒంటినిండా ఈవాతలేంటి?'' అంది యేడుస్తూనే.

''గాపోళ్లపరాక్రమం'' అంటూ జరిగిందంతా చెప్పాడు, లచ్చి వెక్కివెక్కి యేడుస్తూ "నిజాయితీ లేని యీవూర్లో మనం వుండలేం బావయ్యా. ఏవూరుకన్నా పోదాంపద అంటూ బ్రతిమాలింది.'' సత్తెం యెన్నటికైనా బయటపడుతుంది. మనం యేతప్పుచేశామని పారిపోవాలి. నేనురాను'' అంటూ మెల్లిగా లేచి లచ్చి గడ్డంపట్టుకుని పద గుడిసికిపోదాం. నిజంభగవంతుడికి తెలుసు'' అంటూ లచ్చి ఆధారంతో మెల్లిగా అడుగులువేస్తూ ఆచీకటిలో లీనమయ్యారు.

''కొన్నాళ్లతర్వాత రామిరెడ్డినౌకరొకడు లచ్చిగుడిసెకొచ్చి, దొర అర్జంటుగా తాగుబోతుని రమ్మని చెప్పారని చెప్పాడు. మళ్లా ఏం కొంపమునిగిందోనని లచ్చి యేదువసాగింది. తాగుబోతుమాత్రం సరేనని వెళ్లాడు. రామిరెడ్డి ఎంతో అప్యాయంగా ఆహ్వానించాడు, ''నువ్వు నాకు నౌకరుగావుంటే, నీకు లచ్చికి రెండుపూటలా అన్నం పెట్టి సారాకూడా యిస్తాను. ఏమంటావ్'' అన్నాడు, ఈవింత పరిణామానికి తాగుబోతు మొదట అనుమానించినా ''ఆఁ! ఏంవుంటుందిలే'' అనుకుని ''సరే"నన్నాడు, తాగుబోతు చెయ్యవలసినపనల్లా రెడ్డిగారింటిముందు కాపలావుండటం.

రోజులు గడుస్తున్నాయి. వోటు యివ్వవలసినరోజు దగ్గరకొస్తోంది, ఊరంతా ఎటూ నిశ్చయించుకోలేక ఆందోళనలో వుంది. గేటుముందు కూర్చుని కునికిపాట్లు పడుతున్న తాగుబోతుకి ఎవరో ఇంట్లోంచి బయటికి వెళ్ళినట్లనిపించింది. వెంటనే ఆ ఆకారాన్ని వెంబడించ సాగాడు, ఆముసుగులో వున్న ఆకారం తిన్నగా నాయుడు గారిగేటు దూకి, డాబామీంచి, నాయుడు నిద్ర పోతూన్న గదిలో కెళ్ళింది. మరుక్షణమే ''చచ్చానర్రోయ్'' అన్న కేకలు వినబడటం, గదిలోని ఆకారం పరుగుతియ్యడం జరిగింది. కేకవిని లోపలికొస్తూన్న త్రాగుబోతుకి ఆ ఆకారం యెదురుపడింది. ''బాబు! మీరా? ఎంతపని చేశారూ?'' అన్న తాగుబోతుమాటలు విని చేతిలోని కత్తి కిందపడేసి పరుగులంకించుకున్నాడు రామిరెడ్డి.

ఈలోగా పోగయినజనం తాగుబోతుచుట్టూ ముట్టారు. వాడిపక్క నున్న రక్తపుకత్తినిచూసి ''దుర్మార్గుడా! చివరికి ఆయనప్రాణాలు పొట్టనపెట్టుకున్నదాకా ఒదిలావు కావు. దొంగతనంచేసి, పొలం తగలబెట్టినా, దయదలచి నిన్ను వదలిపెట్టినందుకేనా, నువ్వీ పనిచేసింది. ఇంక నువ్వు ప్రాణాలతో పోలేవు'' అంటూ అతన్ని బంధించి పోలీసులను పిలిపించారు. తాగుబోతుగొంతు బొంగురుపోయింది. నిజం చెప్పాలన్నా గొంతు రావడంలేదు, బిక్కుబిక్కుమంటూ దిక్కులూ చూడసాగాడు.

ఇంతలో బిలబిలమంటూ పోలీసులు వాను లోనుండి దిగి, తాగుబోతుచేతికి సంకెళ్ళుతగిలించారు. ఇది చూస్తూన్నా నాయుడుగారు, నిజంచెప్పాలని ప్రయత్నించినా మాటపైకి రాకుండానే కళ్ళుమూశారు.

ఇంకెవరికీ తెలుసు నిజం, నిజంతెలిసిన పెద్దమనుషులిరువురిలో ఒకరు అస్తమించారు, ఇంకొకరు ఆగుంపుతో సంబంధమే లేనట్టు, పైకి రాకుండా, మరునాడు ఎలక్షన్లగురించి ఆలోచించసాగారు. ''నిజం చెప్పే మహానుభావుడే లేడా" అన్నట్టు తాగుబోతుకళ్ళు వెదకసాగాయి. ''నాకు తెలుసు ఆనిజం. నువ్వాపని చెయ్యలేదు'' అంటూ లచ్చిగొంతు వినపడుతోంది. ''ఛీ. దీన్నవతలికి లాగండర్రా'' అంటున్నాడొకాయన. "తగిన శాస్తి జరిగింది'' అంటున్నాడింకొకాయన.

పోలీసువాను కదులుతోంది ''జన్మాంతరకారాగార శిక్షట'' అంటోంది ఒకకంఠం. ''అంతేకావాల'' అంటోంది మరోగొంతు, ఈమాటలు వినలేక కళ్ళుమూసుకు పడిపోయింది లచ్చి. "ఊ. పెద్దమనుషులు. నీతీ, నిజాయితీ లేక ఏఅన్యాయానికైనా ఒడిగట్టే, వీరేనా గ్రామపెద్దలు. తమస్వార్థంకోసం మరోప్రాణిని హింసించే వీరేనా పాలకులు" అని ఏదో గొణుక్కుంటున్నాడు తాగుబోతు. అతనిమాటలు గాలిలో కలిసిపోయాయి. పోలీసువాను రివ్వున వెళ్ళిపోయింది.

ఊరంతాయిప్పటికీ తాగుబోతుని తిడతారు. కానీ లచ్చి మాత్రం ''అంతమంచోడు. పెపంచంలో లేడు ఈవూరోళ్ళంతా కలిసి అణ్ణి పొట్టన బెట్టుకున్నారు'' అంటుంది.

(4-వ పుట తరువాయి)

మొత్తానికి పొదుపు విధానం ప్రభుత్వ సంస్థలమొదలు నిరుపేద ప్రజాసమూహంవఱకు పాటించాల్సిందే. దానికి కొన్ని పద్ధతులు కచ్చితంగా అవలంబించాలి. ప్రభుత్వాంగాల పొదుపు మొదట ముఖ్యం :—

1. దేశాధ్యక్షుల మొదలు రాష్ట్రమంత్రులవరకు అత్యవసరమైతేనే తప్ప, ప్రయాణాలు చేయటం మానుకోవాలి.

2. తమ వేతనాలకు రెండు మూడింతలు ప్రయాణకర్చు బత్తాలు వచ్చేటట్టు చూచుకునేమంత్రులూ ఉన్నతోద్యోగులు—తాము పొందే జీతాల్లో సగం మొత్తంపైగా అట్టి కర్చు బత్తాలు మించనివ్వ కూడదు.

3. తాము ఏ కార్యం చక్కబెట్టటానికి వెడుతున్నారో, ఆ కార్యానికి సంబంధించిన ఉద్యోగిని ఒక అటెండర్ను తీసికొని వెళ్ళటం సబబు. అట్లుకాకుండా తమ ప్రైవేటు, పర్సనల్, అఫిషియల్ సెక్రటరీలు మున్నగు ఏ డజనుమందినో వెంటబెట్టుకుని పోరాదు.

4. వారు వెళ్లే ప్రదేశాలలోని తాబేదార్లు మొదలగువారికి ముందుగానే స్వాగత పత్రాల అర్పణలు అల్పాహారవిందుళ్లు కూడవని ఆజ్ఞాపత్రాలు పంపాలి.

5. ప్రత్యేక సెలూన్‌లు మొదటితరగతి పెట్టెలు రిజర్వు చేసుకోక, సామాన్యులవలెనే మూడవ లేదా రెండవతరగతి పెట్టెలలో ప్రయాణం చేయాలి.

ఇలా పొదుపు విధానాన్ని మొదట తాము అవలంబించి తరువాత ప్రజలలో సంక్షేమసంఘాల మూలంగా ప్రచారంచేసేయెడల కొంతవరకు ప్రజాభ్యుదయానికి తోడ్పడిన వారవుతారు. అయితే ఈ ప్రబోధం స్థానికంగా పలుకుబడిగల సంస్థలు, వ్యక్తులు ఎడతెగక చేయటానికి పూనుకొన్నప్పుడే దాని విలువను తద్వారా కలిగే లాభాలను ప్రజలు గుర్తించి ఆచరణలో పెట్టగలరు.

స్వాతంత్ర్య దినోత్సవం

శ్రీ తెలిదేవర వేంకట బాలకృష్ణారావు

ఇది స్వాతంత్ర్య దినోత్సవమ్ము; ప్రజలన్ హింసించి శాసించు దు
ర్మద పాశ్చాత్యకిరాత జాతికి భయభ్రాంతమ్ము, స్వాతంత్ర్యతా
భ్యుదయ శ్రీలను గోరు దేశముల నుద్బోధించుగీతమ్ము; స
ర్వదిశాంతమ్ములు మారుమ్రోయగ జయధ్వానమ్ములన్ సల్పుడీ!

తమప్రాణమ్ములనొడ్డి, దేశజననీ దాస్యమ్ముదూలించి, అ
య్యమరత్వమ్ము గడించుకొన్న మహనీయశ్రేణి—యీ యుత్సవం
బమితాసక్తిని గాంచుచున్ సురపురోద్యానంపు గల్పప్రసూ
నములన్ జల్లుచునుండిరల్లదిగో! కాంచన్ రండహో! సోదరుల్.

నాయకులందు కొందఱు వినాయకులై, పదవీపిపాసులై,
న్యాయవిదూరులైరని మనమ్ముల గుందకుడయ్య! వీరి య
న్యాయ్యపుటెత్తులన్నిటిని నాశమొనర్పగలట్టివాడు-భ
ద్రాయితమూర్తి జహ్వారుడు రాజిలుచుండ విచారమేటికిన్?

వసంతా వీరభద్రీయం

శ్రీ యం. టీ. రామిరెడ్డి

దేవరాయలు పరిపాలనమున విజయనగరరాజ్యము మిగుల వైభవ ప్రాభవముల గాంచెను. అతడు బహు పరాక్రమశాలి. మేధాసంపన్నుడు. రాజ్యకాంక్ష గలవాడు. పెక్కురాజ్యములను స్వాధీనపరచుకొని తనరాజ్యము నాతడు పెంపొందించెను.

ఒకదినమున నిండోలగంబున నుండుతఱి ప్రధాన మంత్రి యగు నరసింహుడు భామినీరాజ్యమును దేవరాయలు జయించిన, నాతనికీర్తులు దిక్కుల వ్యాపించునని తెల్పెను. అమాటలకు రాజు సంతోషించి భామినీరాజ్యము నందలి రాయచూరు ముదిగల్లు దుర్గముల రహస్యముల నెఱుంగ చారుల నియమించెను.

♦ ♦ ♦

ముదిగంటికి పోవల్సిన దూత రాజశేఖరుడు శత్రు దోష రంధ్రాన్వేషియై విశ్వనాథుడను నామాంతరమున ముదిగల్లుదుర్గమునకు పోయి, దుర్గమును తిరిగితిరిగి బరిశీలించు సమయమున నాతని కంటికి నిరుపమానసౌందర్యవతి యగు వసంతకుమారి కన్పించినది.

ఆమె రూపమును, గాంచినంతనే, మోహితుడై తన, దాసిద్వారా, యామెను, లోబర్చుకొన, నిశ్చయించి యామెను, బిలిచి యొక బంగరునాణెము నొసంగి, "యోసీ! నీవలన, నాకొకయుపకారము, కావలెను. అద్దాని, నెరవేర్చితివేని, నీకింకను బహుమాన మొసంగెదను. ఎఱుగుదువు కదా? ఈనగరమునందలి, శివానందుని కూతురు, నవయౌవనవతి, వసంతయనుదానిని. ఆ యన్నులమిన్న నలరించి, నన్ను వరించునట్లు చేసి, నామనస్సున నామె పనోధనమును దెచ్చిపెట్టుము. నీవలన పొందిన, యీ యుపకారమునకు, నీయొడలంతయు, బంగారముతో నింపివైచెదను. వెలగల, దుకూలముల నొసగెదను" అని యనేకవిధముల, బ్రతిమాలెను.

ఆమెయు, వసంతకడకు బోయి, యామెకడ దాసిగ నుండెను. కొన్నిదినములు వెళ్లిన, పిదప సందర్భానుసారముగ, విశ్వనాథుని వృత్తాంతము నెఱింగించి, యాతని కామెపై, వలపు గలదని, తెల్పెను. విశ్వనాథుని నుతించెను. రాబోవుసంపదలను దెల్పి, యామెలో, నయ్యాశ రేకెత్త జేయ యత్నించెను. కాని, వసంత భారతరమణి. బాహ్యలక్షణముల కున్మత్తయై, ధర్మపథమునుండి జారుపతిత కాదు. ప్రేమ, వర్తకుని చేతి నాణెమువంటిది కాదని, యామె దాసి కెఱింగించెను. దాసి, విశ్వనాథునికడ కేగి, వసంతకుమారిని జూడవలయునను, వాంఛయే యున్నచో, నేటి సాయంకాలము, ఉద్యానవనమునకు రమ్మని, తెల్పెను.

విశ్వనాథుడు, వసంతను జూచు వేడ్కతో, సాయంసమయమున, విలువగల వస్త్రముల ధరించి సుందరవేషమున, నుద్యానవనమున విహరించుచుండెను. వసంత చెలికత్తెగా నున్న విశ్వనాథునిదాసి, ఆతడు వచ్చిన జాడ తెలిసికొని పుష్పములు గోయునెపమున, వసంతకుమారిని ఆతనికడకు, గొనివచ్చెను. అతడామెను గాంచి, తన హృదయము, నెఱింగించెను. ఆమె నిరాకరించెను. బలవంతమొనర్ప నెంచెను. ఆమె, వానిచెంపపయి ఛెళ్లన గొట్టి యుద్యానవనము వీడి, వెడలిపోయెను. విశ్వనాథుడవమానపడియు, ఇటునటు పరికించి, యొరులెవ్వరును జూడలేదుకదా, యని సర్దుబాటు చేసికొని, తనవిడిదికి పోయి, నిద్రాహారంబులు మాని, ఆమెను కైవసము చేసికొన, ప్రయత్నించుచుండెను.

♦ ♦ ♦

వసంత, యింటికి వచ్చి, గదియందు ఏకాంతమున, దనలో, "నేడు జరిగినదెల్ల, నాకేమియు అర్థమగుట లేదు. మున్ను, నాతల్లిదండ్రులు, నన్ను నామేనయత్త కుమారుడగు వీరభద్రునకిచ్చి, పరిణయము చేయుదుమని, వాగ్దానమిచ్చిరి. నేనందులకు, సంతసించి, యాతడు వచ్చినపుడు ఆతనిదప్పవేఱొకరిని చేపట్టబోనని వాగ్దానమిచ్చియున్నాను. ఇప్పుడతని విడువవలసి, వచ్చునా? ఎప్పుడు, నట్లు గానేరదు. భూమ్యాకాశములు, తలక్రిందులైనను సరియే, నేను, నాప్రియుడగు వీరభద్రునిదప్ప, మఱియొకరిని, జేపట్టను. మనోవాక్కాయకర్మలచే నేనాతనిని ప్రేమించితిని. ఇక నాతడే నామనోనాథుడు. అని పరిపరివిధముల దలంచికొని, స్థిరమనస్కయై, ఎప్పటికైనను విశ్వనాథుడు ముప్పు కల్గింపక మానడు. కాన తన్నాదుర్మార్గుని బారినుండి రక్షింప వేడుచు లేఖ వ్రాసి చెలికత్తెద్వారా తెలియపర్చెను.

రాయచూరు దుర్గమును రక్షింప, ఫిరోజిషావలన శాసితుడైన వీరభద్రుడు, సైన్యములతో నరుదెంచి మార్గాయాసమున బడలి, యొకసత్రములో విశ్రమించు సమయమున నొకవనిత యుత్తరమొకటి సమీపమున వదల్చి

పోయెను. అందు వసంతకుమారి తనకు విశ్వనాథునివలన రాబోవునాపదల శంకించుచు, తన్ను రక్షింప నాతని వేడుకొనుచు వ్రాసియుండుటను గ్రహించి ముదిగంటికి వచ్చి చూచుసరికి వసంత గృహమున లేదు. ఆమెకై తల్లిదండ్రులు ఏడ్చుచుండిరి. ఆమె నెవరో హరించిరని వారి యనుమానము.

వీరభద్రుడు వారి నోదార్చి విశ్వనాథుడే దీనికి బాధ్యుడని యూహించి వాని నెట్లైన బంధించి, వసంతను రక్షింప దలచినవాడై, దైవవశమున దొమ్మరసాని యాడు స్థలమున కరుదెంచెను. అచ్చట వసంత దాసివలన విశ్వనాథునిరూపము గుర్తించి వానితో స్నేహమొనర్చి వానివలన రహస్యముల నెఱింగెను. ఆమె బంధింపబడిన స్థలమును గ్రహించెను. అతడు తనయింటికి బోవుచున్నప్పుడు బ్రచ్ఛన్నముగా తనసైనికులవలన బంధింపజేసి యాతని నొకచోట కారాగృహమున నుంచెను. పిమ్మట వసంత బంధింపబడిన గుప్తగృహమునకు బోయి, యామెను విడుదల చేయించి పుట్టింటికి పంపెను.

◆ ◆ ◆

దైవానుగ్రహమున గారాగృహమునుండి తప్పించుకొని, విశ్వనాథుడు వెలుపలకు వచ్చి తన రాజుచెంతకరిగి, వసంతకుమారి, రూపమును వర్ణించి, యట్టికాంతయే, నీకు, భార్యయైనచో వేఱే చెప్పవలయునా యని దేవరాయల మనస్సున ప్రణయము జ్వలింపజేసెను. తన్ను నిరాకరించుట, తనకు పరాభవమని, రాజు తలంచి యామె నపహరింప నిశ్చయించి యామె, యెట్లు నిరాకరించునో చూచెదమనుచు, దనపురోహితునిచే, శివానందునకు, వర్తమానము పంపెను.

పురోహితుడు, ముదిగంటికి పోయి, రాజుఅభిప్రాయమును చెప్పినంతనే, శివానందుడు, వానిభార్య మిగుల సంతసించిరి. కాని, పురోహితుడు వసంతకుమారిని దర్శింపవలెనను భావముతో "అయ్యా! వివాహవిషయమున, పిల్లయభిప్రాయము అవసరముకదా" యనెను. వసంతకుమారిని తల్లిదండ్రులు పిలిపించిరి. తనకు, వివాహమవసరములేదని, స్పష్టముగ, జెప్పినది. ఆమెను. పురోహితుడు అనేకవిధముల బెదిరించెను. కాని లాభములేకపోయెను.

పురోహితుడావార్తను రాజునకెఱింగించెను. రాజు ఉగ్రుడై ముదిగంటి మీదకి దాడివెడలెను.

అంత, వసంత, భయమొంది, తనచెలికత్తెను ఫిరోజిషా వారి చెంత కంపుటయు, ఫిరోజిషాకడ కేగి, వారిచే నియుక్తుడైన వీరభద్రుని కలుసుకొని సంగతి నెఱింగించెను.

అందులకు వీరభద్రుడు, అంతటిసైన్యము నెదుర్కొనుట యెట్లా, యని, యాలోచించి—

విజయనగరమును ముట్టడించినచో, దేవరాయలు రాజధానిని రక్షించుకొనుటకై, ముదిగంటిని విడిచి వచ్చునని, దాన ముదిగంటిని రక్షింప సాధ్యమగునని యెంచి వెంటనే సైన్యముల నాయత్తపఱచెను. ప్రభుభక్తిపరాయణుఁడగు వీరభద్రుని హృదయములో విరాజిల్లుచున్న వసంతను రక్షించుట యెట్లాయను సమస్య పీడించుచున్నది. సేనలతో విజయనగరమున కేగు మార్గమున బురుష డొక డరుదెంచి "అయ్యా! ముదిగల్లుదుర్గము ముట్టడింపబడినది. దేవరాయలు ముప్పదివేలు సైన్యములతో వచ్చి దానిని ముట్టడించెను. దుర్గమాక్రమింపబడునేమోయని భయమొందుచున్నారని చెప్పెను. అతడెవడో యెఱుంగ వీరభద్రుడు అతనిని రహస్యముగ బిలిచి ప్రశ్నింప దన నిజరూపమును ప్రకటించెను. ఆవ్యక్తి పురుష వేషముధరించిన వసంతకుమారి.

"ప్రాణాపాయము సంభవించు పరిస్థితులలోగూడ ప్రాణాధికమైన ప్రణయమును గళంకపరుపలేని సతీరత్నముల మానవతుల సౌశీల్యమే సౌశీల్యము."

"సౌందర్యమునకు సౌశీల్యము కలిగినప్పుడే యేజీవితమైనను నందనపారిజాతమువలె శిరసావహింప దగినది."

"లక్ష్మికిని భర్త వక్షస్థలం బొసంగె,
గంగను శివుండు శిరము నెక్కంగనిచ్చె
వాణి నిలిచెను నాల్కపై వనజభవుఁడు
ప్రేమసూత్ర సంబద్ధంబు పృథివియెల్ల"

(ప్రేమ గీతాలు)

కేంద్ర సంఘ సంక్షేమ సభా సమావేశము

పై సభాసమావేశం న్యూఢిల్లీలో 12–8–61 వరకు జరిగింది. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు అధ్యక్షత వహించారు. ఆ సభ అనేక పథకాలనుగూర్చి సావధానంగా పరామర్శించింది. హిమాచలప్రదేశ్‌కు చెందిన "కులుం"– "దుర్గాపూరు" లలో టిబెట్టు శరణాగతులకు సంక్షేమ బోధనాభ్యసన కేంద్రాలను (Welfare Training Centres) 'మణిపూరు' 'దోహద్' 'ధుంకా' లలో కొండజాతుల తరిబీతు కేంద్రాలను, ఐక్యభారత ఆంతరంగిక శాఖామంత్రివర్గ సహకారంతో స్థాపించాల్నని దానికి తగిన పథకాన్నిగూడ తయారుచేసింది.

శ్రీమతి దేశముఖ్ గారు తన అధ్యక్షతా కార్య నివేదికను సభకు సమర్పిస్తూ, "స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలకు అవసరమయిన సహాయము, అధికారము మొదలయినవి సంక్షేమసంఘం కడచిన యెనిమిదేండ్లుగా ఇస్తున్న"దనిన్ని, "సంఘ సంక్షేమాభ్యుదయ కార్యాలను అట్టి స్వతంత్ర సంస్థలు నెరవేరుస్తున్న" వనిన్ని చెప్పారు. "స్త్రీలకు, పిల్లలకు, అంగహీనులకు ఏర్పడిన 6,000 సంస్థలకు 3.59 కోట్ల రూపాయలు గ్రాంటులుగా ఇవ్వబడ్డాయి. దాదాపు 750 సంక్షేమ కార్యక్రమ పథకాలు గ్రామసీమలలో అమలుకు తేబడ్డాయి. ఇంచుమించుగా 5,000 ల కేంద్రాలలో నానావిధ కార్యక్రమాలవల్ల మహిళలకు, పిల్లలకు జీవనాధారాలేర్పడ్డాయి. కడచిన రెండు (పంచవర్ష) ప్రణాళికల కాలంలో సుమారు 5.6 కోట్ల రూపాయలు పల్లెపట్లలోని సంఘ సంక్షేమకార్యాలకు ఖర్చు చేయబడ్డది. పలువిధాలయిన నిర్మాణ కార్యక్రమ సాధనాలలో పనిచేయటానికి అనుకూలించేటట్లు తగిన తరిబీతును సంక్షేపంగా నేర్పే విధానాలను అనుసరించి దాదాపు 2,000 మంది వయోధిక్యంగల మహిళలు ఉత్తీర్ణులయినారు"........

"రెండవ ప్రణాళికా కాలంలో సంఘ సంక్షేమ కార్యక్రమాలకై కేటాయించిన 9.2 కోట్ల రూపాయలు పూర్తిగా అయిదేండ్లలోను ఉపయోగించబడింది.—గ్రాంట్సు—ఇన్ ఎయిడ్ కోడు. (కడపటి) మనోదాను ప్రభుత్వం అంగీకరించింది. ఆకోడు(Code) సాధారణ సూత్రాలతో మాత్రమేగాక వెవ్వేరు వర్గాలుగా పనిచేసే సంక్షేమ సంస్థలకు గ్రాంటులు ఇచ్చే విషయంలోను కొన్ని నిబంధనలతో కూడింది" అని అధ్యక్షురాలయిన శ్రీమతి దేశముఖ్ గారు చెప్పారు.

సంక్షేమ సంఘసభలో ఇతర విషయాలతోబాటు, గ్రామస్తుల అభ్యుదయానికై యికమీద సంక్షేమ సంఘాలు ఏ యే అభివృద్ధి పథకాలను ఎలా విస్తరింపచేయాలి అనే విషయాన్నిగూర్చి కూడ చర్చింపబడింది.

("హిందూ" 14–8–1961)

స్త్రీ విద్యా సమస్య

కేంద్ర విద్యామంత్రి – శ్రీ - శ్రీమాలిగారు 14-8-'61 న లోకసభలో మహిళా జాతీయ విద్యా సంఘం కన్యలయొక్కయు స్త్రీల యొక్కయు విద్యా విషయాలకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వానికి తగిన సలహాలు, ఇచ్చే సంస్థ అనిన్ని, దానికి ప్రత్యేకంగా ద్రవ్యం కేటాయించ లేదనిన్ని చెప్పారు.

"మూడవ పంచవర్ష ప్రణాళికలో అట్టి కేటాయింపు తగ్గిన కారణంవల్లనే ఆ విద్యా సంఘాధ్యక్షురాలయిన శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు తన పదవికి రాజీనామా ఇవ్వటం నిజమేనా?"—అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, శ్రీ మాలిగారు ఇలా వివరించారు.

స్త్రీ విద్యా సంఘాధ్యక్షురాలు వ్రాసిన లేఖలో స్త్రీల యొక్క విద్యా సంబంధమయిన ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగించటానికి ప్రకృతం కేటాయించిన ఆర్థికోపపత్తి ఏ మాత్రం చాలని కారణంచేత తాను తనపదవినుండి విరమిస్తున్నానని తెలిపింది. విద్యా మంత్రివర్గసహకారం, లేకుండా ఈ జాతీయ స్త్రీవిద్యా సంఘం ఇదివరకు వలెనే తనపనిని చేస్తూ వచ్చింది. ఇప్పటికీ అది ఆస్థితిలోనేఉండి, పనిచేయగలగటం దుర్లభమనీ, ఇలాంటి సందర్భంలో తాను అధ్యక్షురాలుగా వనితా విద్యాభ్యుదయానికి తగిన కార్యాలు నెరవేర్చలేనని వివరించింది.

ఇంకా, ఆయన (శ్రీమాలి)గారు ఇలా వెల్లడించారు. మూడవప్రణాళికలో మొత్తంమీద విద్యాశాఖకు కేటాయించిన, పూర్తి మొత్తం 408 కోట్లరూపాయలు. అందులో 175 కోట్ల రూపాయలు బాలికల విద్యకయి అంగీకరింపబడింది. ఆ 175 కోట్లలో, ప్రత్యేకంగా ప్రాథమిక, మాధ్యమిక దశలలోవుండే

విద్యార్థినుల చదువులకు కేటాయింప బడింది. అంతే గాక, ఆయా రాష్ట్రాలలో బాలికల ప్రత్యేక పథకాల ననుసరించిన విద్యా కార్య క్రమాలు నెరవేర్చటానికి మరొక 11 కోట్లు ప్రత్యేకించబడి వున్నది, ఈ కార్య క్రమాలకు రెండవపంచవర్ష ప్రణాళికలో కేటాయించ బడిన మొత్తం రు 2.14 కోట్లు మాత్రమే.

మూడో పంచవర్ష ప్రణాళిక ననుసరించి 6–11 ఏండ్ల ప్రాయంగల పిల్లలకందరికి విద్య అందుబాటులో ఉండేటట్లు అనుకూలాలు కలిగించ బడినాయి.

(పై సమాధానాలు శ్రీ కుష్వంత్‌రాయ్‌గారు, మరొక 21 మంది సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గారు ఇచ్చినవి)

(15–8–'61 హిందూ)

ఆంధ్ర మహిళా సభ

హైదరాబాదు

పైసభ 15–8–'61 తారీఖున సభా వసతి గృహావరణంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని మహా వైభవంగా జరిపింది. శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు, యం. యల్. సి. అగ్రాసనాధిపత్యాన్ని వహించి పతాకావిష్కరణం చేశారు.

ఆవిష్కరణానంతరం సభా నివాసినులు, అతిథులు 'సూత్రయజ్ఞం' నిర్వర్తించారు.

శ్రీమతి లక్ష్మీబాయమ్మ గారు తమ అధ్యక్షోపన్యాసంలో 60 సంవత్సరాల కాంగ్రెసు చరిత్రను, 14 ఏండ్ల స్వాతంత్ర్యాన్ని, ఈ స్వల్పకాలంలో మనం చేసిన అభివృద్ధికార్యాల్ని మనోహరంగా సభ్యులకు ఆమోదం కలిగేటట్లు వివరించారు. ఈ సందర్భంలో 25 సంవత్సరాలుగా ఆంధ్ర మహిళాసభ దినదినాభివృద్ధితో అనేక శాఖలు నానారంగాలలో చేసిన మహత్తరమయిన కృషిని ప్రశంసిస్తూ, అందులకు శ్రీమతి దుర్గాబాయి దేశముఖుగారి నిరంతర పరిశ్రమయే కారణమని నొక్కి వక్కాణించారు.

మహిళాసభలో తరిబీతు పొందినవారు ముఖ్యంగా దేశసేవ చేయటమే. తమ ప్రధానకర్తవ్యమని విధ్యుక్తధర్మమని జ్ఞప్తియందుంచుకోవలెనని ఆమెగారు సూచించారు.

నగరవాసులీసభకు చాలామంది హాజరై, ఉత్సవంలో పాల్గొన్నారు.

శ్రీమతి కే. సుగుణమణి (సంయుక్తకార్యదర్శిని) గారి అభివందనములతో సభ సమాప్తమయింది.

మేలుకొలుపు

వై. రాంబాబు.

మేలుకో ! శ్రీ కృష్ణ ! మేలుకోవయ్యా !
మేలుకొని మమ్మెల్ల ఏలుకోవయ్యా !

వెలుగు రేఖలతోడ భాస్కరుడు వస్తాడు
తొలిప్రొద్దులో నీవు బజ్జున్నచో వాడు
మనగవాక్షమునుండి వెక్కిరిస్తాడు
కన్నులరవిచ్చుకొని. కళలన్ని కూర్చుకొని
లేవరా నిదుర, ఓ దైవరాయా ! ॥మే॥

ప్రేపల్లె గోపికలు వేడుకలు మీరగా
పెరుగు చిలికేవేళ కావచ్చినదోయి
మొలత్రాటి మువ్వలు మ్రోగింపగానింక
కన్నులరవిచ్చుకొని, కళలన్ని మార్చుకొని,
లేవరా నిదుర ఓ దైవరాయా ! ॥మే॥

ఆలోచనలు అంతర్యాలు

శ్రీమతి పద్మావతీ గంగాధర్

ఇలాంటి చల్లనిగాలంటే నాకెంతోయిష్టం. ఇలాంటి చల్లని వాతావరణానికి. నాకూ, ఎంతో అనుబంధం, సంబంధముంది. ఈ అనుబంధసంబంధం ఏదో మధ్య నేర్పడిందేమీ కాదు, నాకు ఊహ తెల్సినప్పటినుండీ వుంది. చిన్నతనంలో పిల్లలందరివలెనే వానలో బురదలో ఆడుకొనటం ఎంతోయిష్టంగా వుండేది. వయస్సువచ్చినా బుద్ధిలో అంతమార్పు రాలేదనే చెప్పాలి. మరీ ఉదయం చల్లగుంటే, బయటకు పోయి నడవటమెంతో యిష్టం. తుంపర్లుపడుతున్నప్పుడు, సన్ననిజల్లులో, తిరుగుతూంటే మనస్సుకెంతో ఆహ్లాదంగా వుండేది. ఆ వాన తుంపరలు గిలిగింతలుపెట్టి నాలో నూత్నానుభవాలను రేపుతున్నట్లుగా అనుభూతిని పొందుతుండే దానను. జోరుగా వానకురుస్తూ, బాగా చల్లనిగాలి వేస్తూంటే, హాయిగా దుప్పటికప్పుకొని, మెత్తటిపరుపుపై పరుండి, చక్కని నవల చదువటంకన్నా మానవుడు ఆశించవల్సినసుఖం, యీజీవితంలో లేదనుకొంటూండేదానను. అప్పుడప్పుడు కిటికీగుండా జల్లువచ్చి, వానచినుకులు నాపైబడి, చల్లగాలి నాకు తగులుతూంటే హృదయాన్ని గిలిగింతలు పెట్టినట్లుగా, ఆనందాన్ని అనుభవిస్తుండేదానను. అలా ఒక నాడు నాకెంతో ఆనందాన్ని కల్గించిన, యీచల్లని వాతావరణం. యీనాడు పుండుకు పుల్లలా తయారయింది. గాయం మానేటట్టు కన్పించటంలేదు. గాయాన్ని మాన్ప ప్రయత్నించటం, మరొకవిధంగా, గాయాన్ని రేపటం వంటిదనిపిస్తుంది.

నేను యిలా అనేకవిషయాలను నిష్కల్మషంగా చెప్పటం చాలామందికి ఆశ్చర్యం, అసహ్యం కల్గించవచ్చు. మానవులకు జంతువులకు తేడా ఎచ్చటుంది? మానవులవలె, జంతువులకు కూడ, ఆశలు, ఆశయాలు, అనురాగాలు, ఆలోచనలు, ఊహలు, భావనలు ఉండవచ్చు. అవి వాటిని వాటివాటిసహజధోరణిలో బయట పెట్టవచ్చు. కాని మానవుడు వాటిని ఎంతవరకు అర్థంచేసుకొనగలడనేదే ప్రశ్న. తోటిమానవుని. సవ్యంగా, నిస్వార్థంగా, అర్థంచేసుకొనలేని మానవుడు, వానిజాతికి చెందని, విప్పి, వివరంగా చెప్పలేని మరొకజాతిని అర్థం చేసుకొనగలడంటే నేను నమ్మను. మానవులు ఏదొకవిధంగా, వాళ్ళఆశలు, ఆశయాలు, ఆలోచనలు, భావనలు బయట పెడుతూనే వుంటారు. బయటపెట్టటానికి వాళ్ళు వాళ్ళు అనుసరించే మార్గాలే, వేరు, వేరుగా వుంటాయి. ఈ వేరు వేరుమార్గాలే, ఒకొక్కసారి మానవునికి మానవునికి మధ్య, భేదాభిప్రాయాలు కల్గిస్తుంటాయి.

నాకు పెళ్లయి దాదాపు 3 సంవత్సరాలవుతుంది. చూసిన వాళ్ళు, మమ్ములను ఎంతో ఆదర్శదంపతులక్రింద జమకడతారు. ఆనందఅనురాగాలతో చిలుక,గోరంకల్లా జీవిస్తున్నట్లుగా తలపోస్తారు. కాని అది ఎంతవరకు నిజం? అదే నాకు అర్థంకానిది. వాళ్ళందరనుకొనేది నిజమైతే, మేమేదో నాటకమాడుతూండాలని చాలామట్టుకు నటన ప్రాయంగా జీవిస్తున్నామేమోననికూడ నాకనిపిస్తుంది. రేపో మాపో తల్లి నవబోతున్న నేను, యిలాంటి ఆలోచనలతో కాలం గడపటం సమాజదృష్టిలో మన్నింపరాని ఘోరాతిఘోరమైన విషయం. కాని వ్యక్తిగత ఆలోచనలకు సమాజానికి సంబంధమేమిటి? అనేకరకాలుగా మానవుని నిర్బంధించి అతనిఅభిప్రాయానుసారంగా పనులు చేయకుండ, అతనిని చేయవచ్చు. కాని అతనిని ఆలోచించకుండ చేయటం, అనేదెవరు చేయలేనిపని. "అలాంటి ఆలోచనలుండగూడదు; నీలాంటివాళ్ళు యిలా ఆలోచించటం మంచిదిగాదు." అని ఎన్నో నీతిబోధనలు చేస్తూ ఎంతోమంది సలహాలిస్తూండవచ్చు. అది చాలా స్వాభావికమైన సంగతి. కాని వాళ్ళు, వీళ్ళు అందరూ ఆలోచిస్తూనే వుంటారు. ఆలోచనాతరంగాలలో తేలియాడుతూ, విహంగాలలా విహరిస్తూ, పవనంలా పయనించటం, ఆశనిరాశలతో దోబూచులాడటం బాధపడుతూండటం మానవనైజం. మానవుని జన్మహక్కు.

ప్రతివ్యక్తి జీవితంలోను, అతను మర్చిపోలేనిది, విడమర్చి యితరులకు చెప్పలేనిది- ఒకవేళ చెప్పినా, యితరులు అర్థంచేసుకొనక వేరుగా తలంచి, అతనికి విలువకట్టేది- ఏదో రహస్య ముండి వుంటుందని నానమ్మకం, అలాంటి రహస్యాలు కల్గియుండటం మానవునికి సహజమేమో! అదేమానవజీవితంలోనున్న మహాఘనత, ఉత్కృష్టతేమో!

మొన్నీనడుమ, మా ప్రక్క యింటి వారమ్మాయి, 'సుగుణ' మాటలసందర్భంలో, ఆ అమ్మాయిభర్తని గూర్చి చెప్పటం జరిగింది. అక్కా, అక్కా అంటూ నాతో, ఎంతో కల్సిమెల్సివుంటుంది.

"అప్పుడెందుకనోగాని నాకు చచ్చిపోవాలనిపిస్తుందక్కా"

"ఏమిటమ్మా, అశ్మశానవైరాగ్యం"

"నిజంగానే అక్కా" అంటుండగానే అదోరకంగా మారిపోయింది సుగుణమొఖం.

"అదేమిటి సుగుణ! నీకేమి. తక్కువ శ్రీమంతుల బిడ్డవు......... కొంపతీసి మామరిదిగారిపై కోపం రాలేదు గదా?" అన్నాను, సుగుణను సంతోషపెట్టాలని "నాకంత అదృష్టం లేదక్కా.... నాకసలు యిష్టంలేదు" అన్నది ఏడుస్తూ.

సుగుణ భర్త తల్లి తరపు చుట్టం. అతను అదోరకమైన వ్యక్తి. సుగుణకు యిష్టంలేకపోయినా, తల్లిపోరువల్ల, అమాయకుడైన తండ్రిని, వాళ్ళంతా కల్సి ఏమైనా చేస్తారేమోనని భయంతో, తనకొరకు కాకపోయినా, తనతండ్రి కొరకు చేసుకొన్నానని వెక్కి, వెక్కి ఏడుస్తూ చెప్పింది సుగుణ. కిల,కిలా నవ్వుతూ, ఎంతో ఆనందంగా వుండే, ఆ అమ్మాయిహృదయంలో అంతబాధ యిమిడివుందని, ఎవ్వరనుకొంటారు? ఆబాధ, వ్యధ, రగిలి, రగిలి, పెద్ద జ్వాలై వెర్రితలలు వేస్తే ఎవ్వరోర్వగలరు?

నాభర్త రాము, నేనూ, యీమూడు సంవత్సరాల నుండి,పాలుత్రాగుతున్న పిల్లులలా జీవిస్తున్నా మనిపిస్తూంటుంది. నిజానికి యీజీవితంలో ఎవ్వరు సుఖపడుతున్నారు. 'సున్నావచ్చినవాడికంటే, ఒక్కమార్కు వచ్చినవాడు మెరు'గంట, అలాగే యీజీవితంకూడాను. రామూ ఎంతోసౌమ్యుడు, మంచివాడూనూ. మంచివాడని నేననటం గాదు, అయినవారు, కానివారు, ఎరిగున్నవాళ్ళందరూ అదే మాటంటారు. ఆఫీసులో అతనిక్రింద పనిచేసేవారు, పైవారు, అంతా అతనంటే ఎంతో ఆదరాభిమానాలు చూపిస్తూంటారు, ఎంతోగౌరవం యిచ్చి ప్రేమిస్తూంటారు. అతనిలో ఏముందని, వాళ్ళంతా అలా అతనంటే, అంత అప్యాయంగా వుంటా?రనిపిస్తుంది నాకు. "హే రామూ. నీచిరునవ్వుతో లోకాన్ని మోసపుచ్చగలవు గాని, నన్ను మాత్రంగాదుసుమా! నీవు చెప్పకపోయినా దానివెనక ఎంత అవ్యక్తమైనబాధ వ్యధ యిమిడివున్నవో నాకు తెల్సు" అని అనాలని నాకప్పుడప్పు డనిపిస్తుంది. మేమిద్దరమెంతో సరదాగా, నల్గురు తలంచినట్లెంతో అనురాగపుటానందాలతో, బ్రతుకుతున్నా మాసంసారంలో ఏదో లోటున్నట్లు, నాకన్పించుతూంటుంది. మానవుడు తనను ప్రేమించే వ్యక్తినిగాక మరొకవ్యక్తిని ప్రేమించుతుంటాడనుకొంటా, అందువల్లనే జీవితం యింత క్లిష్ట సమస్యగా తయారయిందేమో!

రామూ తనకు తాను చెప్పకపోయినా, మాఅత్తగారి పొరుగింటావిడ చెప్పగా. అతనివిషయాలు కొన్ని తెల్సుకొనగలిగాను.

"రాముకుటుంబం ఒకప్పుడు బాగా ఉన్నకుటుంబమే. వ్యాపారంలో నష్టం వచ్చి, తరువాత బాగా చితికిపోయింది. వాళ్ళయింటికి, రెండుమూడిళ్ళవతలగా,వాళ్ళకు దూరపు బంధువులు బాగా ఉన్నకుటుంబం ఒకటుండేది. వాళ్ళకు "సరూ" అనే ఒకఅమ్మాయి ఉండేది. "సరూ" ఒక్కగా నొక్కకూతురు, ఎర్రగా. ఎంతో అందంగా చాలా చలాకీగా వుండేది. రాము, సరూ కల్సిమెల్సి చదువుకొంటూ కాలంగడుపుతూండేవారు. ఆరెండుకుటుంబాలు, వీళ్ళిద్దరూ భార్య, భర్తలై ఎంతో ఆనందంగా ఉంటారనుకొంటూ, వీళ్ళను చూచుకొని మురిసిపోతూండేవారు. స్కూలుఫైనలువరకు అలా యిద్దరూ కల్సే చదువుకొన్నారు. వాళ్ళిద్దరూ ఒకరినొకరు విడిచిపెట్టలేనట్లుగా ఉంటూండేవారు. తరువాత రాము చదువుకొనటానికి పట్నంవెళ్ళాడు. సరూని చదువుమాన్పించి, యింటివద్దనుంచి, సంగీతం,. హిందీ నేర్పిస్తూండేవారు. అలా రోజులు గడిచిపోతూండగా, మీమామగార్కి వ్యాపారంలో నష్టంవచ్చి కుటుంబం బాగా చితికిపోయింది. సరూకు వేరేసంబంధాలు చూస్తున్నారని తెల్సి ఒకనాడు మీమామగారు. వెళ్ళి సరూతండ్రిని అడుగుతానన్నాడట,- రామూవద్ద వెంతగానో చెప్పాడట. మీఅత్తగారు .మామగారు సరూ అంటే ఎంతో ప్రేమగా వుండేవారు. రామూ మాట వినక మీమామగారు వెళ్ళి అడిగారట- వాళ్ళు, పోయినతరంలో వాళ్ళకుటుంబంలో ఒక ఆడపిల్లను, మామగారికుటుంబంలో ఒకరికి యిచ్చారని, పెళ్ళయిన సంవత్సరంలోనే, పెళ్ళికొడుకు చనిపోయాడని, అందువల్లనే వాళ్ళకు, రామూకు సరూనివ్వటం యిష్టంలేదని, మరొకకారణమేమీ లేదని- చావుకబురు చల్లగా చెప్పారట, ఆంతకుముందు రాము పట్నంనుండి శెలవకు వచ్చి వాళ్ళింటికి వెళ్ళినపుడు, అతనంటే అదొకరకంగా వుండేవారట. అందువల్ల రామూకు కష్టంవేసి వాళ్ళింటికి వెళ్ళటం మానుకొన్నాడట. ఆతరువాత కొద్దికాలానికే 'సరూకు' పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. దురదృష్టవశాత్తు సంవత్సరం తిరగకముందే, 'సరూ'భర్త, గుండెజబ్బుతో చనిపోయాడు. తరువాత 'సరూ'తండ్రి, వాళ్ళద్వారా, వీళ్ళద్వారా, సరూని చేసుకొనమని రామూకు రాయబారాలు పంపాడట. రాము మొదట్లో, తను పెండ్లి చేసుకొనదల్చుకోలేదని, తరువాత, 'సరూ'ని చేసు కొన

నని చాలాగట్టిగా చెప్పాడట. అప్పుడే 'సరూ'కు బయట నుండి రెండు,మూడు సంబంధాలు వచ్చినా, సరూ వప్పుకొనలేదట. మాపెళ్ళయిన రెండునెలలో ననుకొంటా, 'సరూ' వురిపెట్టుకు చనిపోయింది. ఉండి ఎవరుఅనుభవించారు చెప్పు? ఆపిల్ల ఉసురు కట్టుకొన్నారు" అంటూ ఏవేవో ఆవిడగారు చెప్పింది.

ఆతరువాత వూరుకొనలేక మాచిన్న మరదలను పిల్చి చాటుగా "సరూ వదినను ఎరుగుదువా" అని అడిగా అదో రకంగా. "ఓ సరూవదిన ఎంత అందంగా వుంటుందనుకొన్నావు, చాలమంచిది." అంటూ ఆపదేళ్ళపిల్ల నాబాధను గ్రహించకుండా పరిగెత్తుకొనిపోయింది. "నేనుమాత్రం కాదా"? అని అడుగుదామనుకొన్నా. కొంత సిగ్గుతో, బాధతో, వ్యధతో అడుగలేకపోయాను. ఏదో కొద్దిగా. తెల్సి. పరిచయమున్నమామరదలే. సరూ అంటే అంత యిదిగ వుందిగదా, యిక రాముకెలా వుండివుంటుందో? ప్రేమించుకొన్నారు. పెళ్ళిచేసుకొని అనురాగ, ఆనందాలతో జీవితం గడపాలనుకొన్నారు, అలా ఎన్నో కలలు కన్న రాముహృదయగాయాన్నెవ్వరు మాన్పగలరు? నాకు ఆహృదయంలోను, సరూ, ఉండవల్సిన యింటిలోను, ఎలాంటిస్థానముంది? మొదలగు ఆలోచనలతో సతమతమవుతూంటాను, మరీ రాముా ప్రక్కనపరున్నప్పుడు, అతనేమీ ఎరగనట్లు, ఎంతో అప్యాయంగా, ప్రేమతో, కబుర్లు చెబుతూన్నప్పుడు, సరూ గుర్తుకువచ్చి ఏదోగా బాధపతుతూంటాను. అప్పుడు నాస్థానంలో సరూవుండటం జరిగితే, రాముా ఎంతో సంతోషానందాలతో, వుండేవాడో ననుకొంటూంటాను. వెంటనే నేను ఎక్కడవుంది. నాస్థితి గుర్తుకు రావటంతో, అతనిహృదయగాయాన్ని రేపుతానేమోనని భయంతో, తెచ్చిపెట్టుకొన్న నవ్వుతో, నేను నాపాత్రను నిర్వహిస్తూంటాను. నాగతజీవితం గూర్చి తెల్సి రాముాకూడ నాలా బాధపడుతూ ఆలోచిస్తూంటాడేమో !

"ఏవ్యక్తి చరిత్ర చూచినా
ఏముంది గర్వకారణం
కష్టసుఖాల సమ్మేళనం
గతంనాస్తి, గతం గతం
లేదు భవిత, లేదు. లేదు"

అనే రవిమాటల్లో ఎంతో సత్యముంది. ఆనాల్గుబంతులు, ఒకరోజున "రవి" ఒకపుస్తకం పుట్టినరోజు నాకు బహుమతిగా యిస్తూ, ఆపుస్తకంలో వ్రాసాడు.

"రవి" ఎంతోమంచివాడు. సన్నగా, బారుగా, ఎర్రగ వుండేవాడు. అతనికళ్ళు చూస్తే ఎప్పుడు దేనికొరకో వెదకుతూన్నట్లుండేవి. అతను నేను రెండుసంవత్సరాలు సహాధ్యాయులం. అప్పుడే మాయిద్దరకు స్నేహమేర్పడింది. క్లాసువక్తృత్వపోటీలలో, అనేక యితర functionsలో మేము యిద్దరమూ పాల్గొనేవాళ్ళం. తెలియనివాళ్ళముందు. ఏమీమాట్లడడు. అన్నింటికి 'ఊ' కొడుతూండేవాడు. చివరకు తను చేయదల్చుకొన్నది చేసి ఊరుకొనేవాడు. అతనితోపాటు కూర్చొని కబుర్లుచెప్పుకొంటూంటే కాలం తెలియకుండానే గడచిపోతుండేది.

అతను ఉన్నకుటుంబంలోనివాడు. ఒక్కగా నొక్క కొడుకు. ఎప్పుడు నీటుగా, శుభ్రంగవుండి కులాసాగా కాలంగడ్పటమంటే అతనికి తగనిసరదా. అతనికికూడ నామాదిరిగనే చల్లనిగాలన్నా, వానజల్లులో నడ్వటమన్నా మహాయిష్టం. ఒకటిరెండుసార్లు ఉదయం, నేను అలా చల్లగావున్నప్పుడు, బీచివెంట నడుస్తూండగా రవికూడా, అప్పుడప్పుడు తన కారులోనే కూర్చొని ఏదో పుస్తకం చదువు కొంటూండగా చూసాను. అలా మొదటిసారిగా మాయిద్దరకు పరిచయమయింది. ఆపరిచయం విడిచివుండలేని స్నేహానికి దారితీసింది. ఆస్నేహమనేది మానని గాయంగా, బాధపడుతూండేటట్లు నాజీవితాన్ని చేసింది. నావలె ఆచల్లని వాతావరణం కొరకు తహ, తహలాడే వ్యక్తి ఉన్నాడని, నావలె అతనుకూడ ఎంతోఆహ్లాదాన్ని పొందుతూంటాడని తెల్సుకొన్నప్పుడు ఎంతో ఆనందించాను. అభిరుచులు ఒక్కటైన వ్యక్తులు కల్వటం, వారి స్నేహం భవిష్యత్తును, పరిస్థితులను లెక్కచేయకుండా, నానాటికీ వృద్ధిచెందటము చాలాసహజమైనవిషయం అనుకొంటాను.

మానాన్నకు, అమ్మకు, చదువుమీద ఎంతోఅభిమానముండటంవల్ల, నాఅభీష్టానుసారంగా నేను చదువుకొనటానికి ఒప్పుకొన్నారు. నేనుకూడ వాళ్ళుయిచ్చిన అవకాశాన్ని, స్వేచ్ఛను అర్థంచేసుకొని, హద్దుపద్దులలోనే నడుస్తూండేదానను. కాని రవివిషయంలోమట్టుకు కొంతవరకు అలా ఉండలేకపోయాననే చెప్పాలి. నాకు, రవికి, ఉన్నసంబంధం, అమ్మకు, నాన్నకూ తెల్సునో లేదో నాకు తెలియదు. నేను ఎప్పుడు చెప్పనూలేదు. వాళ్ళు నన్ను అడుగనూలేదు. మాది అంత ఉన్నకుటుంబం కాకపోయినా, కూటికిగుడ్డకు కరువయిన కుటుంబం మాత్రం కాదు.

తరువాత రవికి నాకు చాలస్నేహమేర్పడింది. దాదాపు

ఎప్పుడూ మేమిద్దరంకల్సే అలాంటి చల్లనివాతావరణంలోని ఆనందాన్ని అనుభవిస్తూండేవాళ్ళం. చల్లగావుంటే సరి, బీచికిగాని, షికారుకుగాని వెళ్ళటానికి రవి రెడీ. ఒక్కొక్కసారి అలా బీచిలో కారును పార్కుచేసి, చెరొకపుస్తకంతీసి చదువుతూ, మాట్లాడుకొనకుండా, గంటలుగంటలు గడుపుతూండేవాళ్ళం. రవిని కనుక ఒక్కరోజైనా, చూడకపోతే, నామనస్సు పరిపరివిధాలుగా పోతుండేది. అతనిఆరోగ్యం ఎలాగుందోనని, కారు Accident ఏమైనా జరిగిందేమోనని భయపడుతూండేదానను. రవికి Carను చాల Speed గా drive చేయటం చాలాఇష్టం. నేను భయపడుతూంటే తాను చాల Speedగా drive చేస్తూ నవ్వుతూండేవాడు. నాకు లోలోపల చాల భయంగావున్నా పైకి చాలభీకరంగా కూర్చొనేదానను. ఒకటిరెండుసార్లు అలా మేము మెరినాలో వెళ్ళుతూండగా, accident జరిగినంతపనయింది. అతనలాంటప్పుడు నవ్వుతూ "ఏమిటిశశీ, భయంగావుందా? జీవితంపై అంతమమకారమెందుకు?" అనేవాడు. సరదాగా, కులాసాగా, నిశ్చింతగా కాలంగడుపుతుండే వ్యక్తినోటినుండి అలాంటిమాటలు విన్నప్పుడు మనస్సులో ఏలాగో వుండేది.

సూర్యోదయాన్ని తిలకిస్తూ, చంద్రోదయాన్ని ఆహ్వానిస్తూ, బీచిలో కూర్చొని కాలం గడుపుతూండేవాళ్ళం. చాలాకాలం స్వవిషయాలే మాట్లాడుకొనటం జరగలేదు. 'రవి' అంటే నాకెంతో యిష్టంగా వుండేది. అలా సరదాగా బ్రతికినన్నాళ్ళు కాలంగడ్పగల్గితే, ఎంతబాగుంటుంది, అని కలలుగంటూండేదానను. రవి తెల్సినవాళ్ళముందు, ఎంత ఖచ్చితంగా, నిష్కల్మషంగా మాట్లాడుతాడో, తెల్సుకొంటే చాలఆశ్చర్యంగా వుంటుంది. పరిచయంలేని క్రొత్తవాళ్ళముందు, మూగవానిలా, అమాయకునివలె కూర్చొనేవ్యక్తి అలా మాట్లాడుతాడంటే ఎవ్వరూ నమ్మరు. ఒకరోజున మెరీనాహోటలులో పైన కూర్చొని కాఫీ త్రాగుతున్నాము. ప్రక్క బీచిలో పిల్లలు ఆడుకొంటున్నారు. వేసవికాలం అవటంవల్ల బీచిఅంతా జనంతో నిండి కోలాహలంగావుంది. చల్లగాలికి బొరియలనుండి బయటకు వచ్చే పురుగులవలె, వేసవికాలం సాయంసమయాలలో జనమలా బీచికి వస్తారనిపిస్తుంది. ఏదో మాటలసందర్భంలో నాస్నేహితురాలు "రమ" నాకు రమ్మని ఉత్తరంవ్రాసిందని నేను వాళ్ళయింటికి వెళతాననిచెప్పాను.

"రమ.... నీ Room-mate యేనా?.... శేఖరుభార్య గదూ?" అన్నాడు రవి.

"అవును. నీకెలాతెల్సు?"

"నాకు యిద్దరు తెల్సు శశీ. రమను నాకు యిస్తామన్నారు తెల్సునా?" అన్నాడు నవ్వుతూ తలపైకెత్తి.

"మరి ఎందుకు చేసుకోలేదు?"

"లేదు.... అంతే...."

కొంతసేపు ఇద్దరిలో ఎవ్వరూ మాట్లాడలేదు. నేను రమనుగూర్చి ఆలోచిస్తున్నా. రమ, పోయినసంవత్సరం నా Room-mate. పెళ్ళవటంతో, చదువుకు స్వస్తి చెప్పింది. అతనుకూడ రమనుగూర్చే ఆలోచిస్తున్నాడో ఏమో నాకుతెలియదు.

రవి తలెత్తి "శశీ, ఒక్కవిషయం అడుగుతాను; నిజం చెబుతావా?" అన్నాడు నెమ్మదిగా.

ఏమి అడుగుతాడోనని భయపడ్డమాటమట్టుకు నిజం. అనదల్చుకొన్నమాట,,చాలగట్టిగా, ఖచ్చితంగా అనివేయటం రవికలవాటు. తనను పెళ్ళిచేసుకొనటం నాకిష్టమేనేమోనని అడుగుతాడను కొన్నా. తడబడుతూ "అడుగు....చెబుతా" నన్నా.

"రమ సుఖపడుతుందనా, నీఉద్దేశ్యం."

"ఎందుకు సుఖపడదు? ఇద్దరూ చదువుకొన్నవారే. డబ్బుకు డబ్బుంది" అన్నా. ఎంతో తేలికపడ్డహృదయంతో, ఒకవిధమైన నిరుత్సాహంతో.

"అక్కడే పొరబడుతున్నావు శశీ. ఏదో చదువుకొన్నంతమాత్రాన మానవునిలో పశుత్వంపోయి, అమరత్వం వస్తుందంటావా? అజ్ఞానికి అహంకారం అలంకారమట. అందులో డబ్బుంటేసరి, కన్నుమిన్ను కన్పించనే కన్పించవు." అని కొంతసేపు వూరుకొని "రమవిషయం నాకంతగా తెలియదు గాని, 'శేఖర్' విషయం మట్టుకు బాగాతెల్సు. నేనుకూడ ఆ భాగ్యవంతులతెగకు చెందినవాడినేనని నీకు తెల్సునా శశీ. డబ్బు, చదువుసంధ్యలుండటం వేరు, తోటిమానవుని అర్ధంచేసుకొనగల్గటం వేరు. నిజంగా నీవాళ్ళమాటలు వింటే, యింకా, యీకాలంలోకూడ అలాంటివాళ్ళుంటారా అని, చదువుకొన్నవారుకూడ అలాంటి ఆలోచనలు కలిగివుంటారా అని నీవు ఆశ్చర్యపోతావు. వాళ్ళే గొప్ప అనుకోవటం, తోటివాళ్ళను చాలతేలికగా చూడటం వాళ్ళకలవాటు.

వాళ్ళు నూతిలో కప్పలలా బ్రతుకుతున్నట్లు వాళ్ళకు తెలియదు. శేఖర్ కూడ అంతే. నీవు అచ్చటకు వెళ్ళినపుడు నీ స్నేహితురాలు, సరదాగావుండే నీప్రాణసఖి రమ, అచ్చట ఒకపంజరంలో చిలకని, స్వంతఉద్దేశ్యాలు, కోర్కెలు లేకుండా ఏదోగా కాలంగడుపుతున్న జీవచ్ఛవం అని — నీవే తెల్సుకొంటావుగా" అన్నాడు ఆవేశంగా. మేము అలా కల్సియుంటున్నా, అతని మనోఉద్దేశ్యాలు, సంపూర్ణంగా అడిగి తెల్సుకొనటానికి వెనుకాడుతూండే దానను. చెప్పుతూంటే, వింటూమట్టుకుండేదానను. ఆరోజులలో అలా వుండటం, అతనంటే గౌరవం వల్లనో, ప్రేమవల్లనో, భయంవల్లనో, మరెందువల్లనో యిప్పుడు చెప్పలేను. అలా ఆవేశంగా అతను చెప్పిన తరువాత నేను మరేమి అడుగలేదుకూడాను. నేను రమ వద్దకు వెళ్ళి రెండురోజులున్నాను. రమ నోటితో చెప్పక పోయినా, ఎంతనిస్సారంగా జీవితం గడ్పుతూందో, తెల్సుకొన్నప్పు డెందుకనోగాని రవి, 'రమ' నుగూర్చి అడుగనూలేదు, అతనిమాటలలో ఎంత సత్యముందో నేను చెప్పనూలేదు.

ఆనాడు మేము గడపినక్షణాలు, మాట్లాడుకొన్న అనేకవిషయాలు, అన్నీ గుర్తున్నాయి. గతాన్ని తల్చుకొనటం, ఆలోచించటం, బాధపడటం మానవనైజం. దానినుండికూడ ఒకరకమైన వూరటను, ఒక్కక్షణం పాటు, సుఖానుభూతిని పొందటం కద్దు. ఎవరివిషయ మెలావున్నా, నావిషయంలోమట్టుకు ముమ్మాటికీ నిజం. అవన్నీ తలంపుకు వచ్చినప్పుడల్లా చాలసిగ్గుగాకూడ వుంటుంది. నేను, అనేకసార్లు 'రవి' నాస్వవిషయాలను గూర్చి అడుగుతాడని "నన్ను పెండ్లిచేసుకొంటావా శశీ" అని సూటిగా ప్రశ్నించుతాడని, ఆశిస్తూండేదానను. ఎలా సమాధానంచెప్పాల్నని భయపడుతూండేదానను. కాని అనేక యితరవిషయాలు, నిర్మొహమాటంగాచెప్పి, సూటిగా అడిగేస్వభావంకలవ్యక్తి, యీ నావిషయంలో ఎందుకలా వుండలేదో ననిపిస్తుంది యిప్పటికీను.

ఒకసారి మాక్లాసుఅంతా కల్సి, మైసూరు బృందావన్ గార్డెన్సుకు వెళ్ళాము. రెండురోజు లక్కడే మకాం వేశాము. ఆరెండురోజులొకెత్తు, నాజీవితమంతా ఒకెత్తు. ఆరెండురోజులు మేమిద్దరం దాదాపు అందరినీవదలి, వేరు, వేరుగా తిరుగుతూండేవాళ్ళం. ఆరెండురోజుల లోనే మేమిద్దరం ఎంతో దగ్గరవారమయ్యాము. అలా అవ్వటం మంచో, చెడో, నాకుతెలియదు. నేను యీ నాటికీ పశ్చాత్తాపపడటంలేదు. ఆరోజు పౌర్ణమి. వెన్నెల పిండారబోసినట్లున్నది. అందులో వసంతకాల మవ్వటం వల్ల, మేమాశించినక్లైంతో, చల్లగా, హాయిగా, ఆహ్లాదంగా వుంది. అచ్చట గడ్డిపై ఒకరిప్రక్క నొకరుపడుకొన్నాము, కొంచెందూరంగా.

మానవుని జీవితంలోఅనేకసంఘటనలు అనుకోకుండానే జరుగుతూంటాయి. మనం ఎన్నోసార్లు చాలజాగ్రత్తగా ఆలోచించి, అలా ప్రవర్తించాలి, యిలా ప్రవర్తించాలి, అట్లుండాలి, యిట్లుండాలి, అలాంటి ప్రశ్నకు, యిలాంటి సమాధానం చెప్పాలి, అని పరీక్షకు వెళ్ళే విద్యార్థిలా, యుద్ధానికి తయారైవెళ్ళే సైనికునిలా, ఎన్నోఅనుకోవచ్చు,కాని ఆక్షణంలో అన్నీమర్చిపోతాము. ఏదోఆవేశంతో, మైమరిచి యేదొకటి చేసివేస్తాము. మరొకక్షణంలో దాని పర్యవసానాన్ని గూర్చి ఆలోచించటం, పశ్చాత్తాపమేననండి, సిగ్గుపడటమేననండి జరుగుతుంది.

ఆనాడు ఉన్నంతదగ్గరగా, నాహృదయంలో 'రవి' ఏనాడు లేడనిపించింది. అలాగే నేనుకూడ అతనిహృదయానికి చాలదగ్గరగా వున్నట్లు తలంచారు. ఎలా అడుగగల్గానో నాకు తెలియదు. ఇప్పటికీ నాధైర్యానికి నేను ఆశ్చర్యపడుతూంటాను.

"రవీ, నిన్నొకవిషయం అడగాల్ననివుంది..... నీవు వేరుగా తలంచక...."

"అడుగు శశీ. నీకెందుకంతభయం నేనంటే, నేనూ మానవుడనేగా"

''అదికాదు రవీ....''

"అడుగు భయమెందుకు? నేను నిన్ను అడగటం లేదూ?''

''నీవు అప్పుడప్పుడు ఏదో విచారంగా కనబడుతూంటావు. నిన్ను చూస్తే నీజీవితంలో ఏదో ఒకసంఘటన జరిగివుంటుందని నాకనుమానం.....''

''నీకలాంటి అనుమానమెందుకొచ్చింది?"

"వస్తుతా, చాల సరదాగా, కులాసాగా, నిశ్చింతగా జీవితం గడ్పతల్చుకొనేవాళ్ళలో నీవొకడవు. అప్పుడప్పుడు నీవు జీవితాన్నిగూర్చి, ఎంతోవిరక్తిగా మాట్లాడుతున్నప్పుడు, అలా సరదాగా, నవ్వుతుండటం గతాన్నిమర్చిపోవటానికి ఆడుతున్న నాటకమని, అనిపించుతూంటుందినాకు." అన్నా చాలనిర్భయంగా.

''అవును శశీ'' అని కొద్దిసేపాగి మరలచెప్ప సాగాడు.

‘‘మాఅమ్మకు, నేనొక్కడనే కొడుకుని. వాళ్ళు చాలభాగ్యవంతులుకూడాను, అందుకనే భాగ్యవంతులంటే నాకు చాల హేయంగా వుంటుంది. మావూళ్ళో మాకొక 10 ఎకరాల తోటవుంది. దానిలో, మేము వేసవికాలంలో, అప్పుడప్పుడు వెళ్లి వుండటాని కొక యిల్లుకూడ వుంది. మాతోటప్రక్కనే ఒకపేదకుటుంబంకూడ వుంటుండేది. వాళ్ళకూ ఒకేఒకకూతురు. చాల అందంగా వుండేది. ఆ అమ్మాయిపేరు ‘‘లలిత.’’ నేను ఆయింటిలో వున్నంతకాలం, ఆటపాటలలో, కల్సిమెల్సి, మేమిద్దరం కాలం గడుపుతూండేవాళ్ళం. వయస్సుతోపాటు, మేము ఒకరికొకరం, దూరమయ్యాము. అంతకన్నా నాకు, లలితకు ఎలాంటి సంబంధమూ లేదు. నేను లలితను పెళ్ళిచేసుకొనాలనుకొన్నా. ఒకనాడు నాఉద్దేశ్యం లలితకు చెప్పినప్పుడు, ఆమె చాలసేపు ఏమీ సమాధానం చెప్పలేదు. సిగ్గువల్లనేమో ననుకొన్నా. నేను చాలమూర్ఖుడ్ని శశి. ఆమెకు యిష్టమోకాదో, ఖచ్చితంగా చెప్పమని చాలకోపంగా అడిగాను.

‘‘రవీ అదెలా సాధ్యం’’ అంది నెమ్మదిగా.

‘‘ఎందుకుకాదు. నాపెళ్ళి నాయిష్టం. నీకు యిష్టమయితేసరి’’ ఎంతో ఆవేశంగా అన్నాడు.

‘‘రవీ, మనం కష్టాలను కొనితెచ్చుకొంటున్నాము, అంతే’’

‘‘అంటే........ఏఁఉద్దేశ్యం’’

“నీవు ఉన్నవారి బిడ్డవు, నేనా కూటికిగుడ్డకు కరువాసినవాళ్ళ పిల్లను....అలాంటప్పుడు అదెలా జరుగుతుంది?”

“నీకు యిష్టంలేకపోతే, యిష్టంలేదని చెప్పవచ్చుగా! ఎందుకిదంతాను, నాదే తప్పు నన్నుక్షమించు. నీవు మంచివాడ్ని చేసుకొని హాయిగుండు” అంటూ కోపంగా వెనుకకు తిరిగా. ‘‘రవీ” అంటూ పిల్చింది. వెనుకకు వెళ్ళి తిరిగి చూద్దునుగదూ. ఆమె కన్నీరుకారుస్తూంది. నేను ఏనాటికి ఆక్షణం మర్చిపోలేను శశీ. వేదాంతిలా భవిష్యత్తును సూచిస్తూ, ఎక్కువ చదువుకోలేకపోయినా, లలిత చెప్పినమాటలు, నామూర్ఖత్వానికి కారణంగా. కన్నీటితో నిండిన ఆమెకళ్ళు, పశ్చాత్తాపపడి తరువాత మేము ఒకరికొకరం బాసలుచేసుకొనటం, మరవాలన్నా, మరువలేకున్నా.

ఒకనాడు మాఅమ్మ నాపెళ్ళివిషయం ఎత్తింది. నేను మాఅమ్మతో చాల స్వేచ్ఛగా మాట్లాడగలను. నేను నామనస్సులో నున్న ఉద్దేశ్యం ఆమెకు చెప్పాను. కొంతకాలంతరువాత నేను మావూరు వెళ్ళేటప్పటికి, లలితతండ్రి చనిపోయాడని, మాతోటప్రక్క నున్న ఎకరంపొలం మాకమ్మి ఎచ్చటకో వెళ్ళిపోయాడని తెల్సింది. దానికంతటకు మానాన్నే పుణ్యంకట్టుకొన్నాడట. వూళ్ళో లలితకు, నాకు సంబంధముందని, లలిత తల్లే స్వార్థంకొద్ది మాయిద్దరకు సంబంధమేర్పరచిందని పుకార్లు బయలుదేరాయి. ఇవన్నీ భరించలేక, ఆతల్లీ, కూతురు అభిమానంకొద్దీ అక్కడనుండి వెళ్ళిపోయారు. మానాన్న ఎలాంటిపాత్ర వహించివుంటాడో నేను నీకు వేరుగా చెప్పనవసరంలేదు, దీనితరువాత ఒకనాడు, మానాన్న ‘‘రమ’’ను చేసుకొనుమని అడిగాడు. నేను చేసుకోనని ఖచ్చితంగా చెప్పాను. అసలు ఆయన ముందు నిల్చొని మాట్లాడటం నాకిష్టముండదు. తోటివాళ్ళను, పురుగులుగా చూసేవాళ్ళల్లో మానాన్న ఒకడు. నిజంగా ‘రమ’ అంటే యిష్టా,అయిష్టాలు నాకేమీ లేవు. అసలాఅమ్మాయిని నేను బాగా ఎరుగనుకూడాను. మానాన్న అడగటంవల్ల, మరొకఆలోచన లేకుండా, ప్రతీకారానికి తయారైనట్లు కాదన్నాను. దీనితరువాతనే ‘రమ’కూ, శేఖర్‌కు వివాహంజరిగింది. మానాన్నగార్కి చాలకోపం వచ్చింది. ఆయనంటే మాఇంట్లో అందరకూ హడలే. ఇంకా ఆయనకు కోపంవస్తే చెప్పనవసరంలేదు, ఆయన చాలకోపంగా నన్ను తిడుతూ, నాఅజ్ఞానికి, తెలివితక్కువతనానికి విచారిస్తూ, అంతస్థులు, కుటుంబగుణగణాలనుగూర్చి, లలితను, లలితతల్లిని దూషిస్తూ నీతిబోధనలు చేసాడు. లలిత తల్లి వ్యభిచారిణి అన్నాడు. అదే వారసత్వం కూతురికి కూడ వచ్చిందన్నాడు. అలా ఎవేవో యిష్టంవచ్చినట్లు మాట్లాడాడు. నేను కూడ నాకోపాన్ని అణచుకొందామని చాలప్రయత్నించాను. కాని రగలుతున్న నా హృదయం ఒక్కసారి గప్పుమంది. మాతాతలు ఏ అంతస్థునుండి ఏఅంతస్థుకి వచ్చారో గుర్తుతెచ్చుకొనమన్నా, మధ్యనువచ్చిన ముదనష్టాలవల్ల, గతాన్ని మర్చిపోవద్దని ఏదేదో, నానోటికి వచ్చినట్లు నేనూ వాగాను. ఆయనకెదురుపడి సమాధానం చెప్పినవాళ్ళింతవరకెవ్వరూలేరు, తనఅహంకారం దెబ్బతినటంవల్లనైతే నేమి, తనను కలలోకూడ తలంచని విధంగా, నేను సమాధానం చెప్పటంవల్లనైతే నేమి, మానాన్నగారు దెబ్బతిన్నబెబ్బులిలా లేచారు. కొడతారేమో ననుకొన్నాకూడాను. రోటిలో తలదూర్చి, రోకటిపోటుకు వెరవ

మెందుకన్నట్లు, ఏదో ఒకటి తెల్సుకొనటానికి భయపడకుండా నిల్చున్నా. లలిత కుటుంబ మెంత నీచకుటుంబమో ఏకరువుపెట్టడం మొదలుపెట్టాడు. ఆయన పూర్తిగా చెప్పినతరువాత, ఆయనగారు కొద్దినెలలక్రితం, మా తోటచావిట్లో చేసినపని గుర్తుకుతెచ్చాను అంతే, కాళ్ళు నేలకు కొడుతూ, నోటికివచ్చినట్లు తిట్టుతూ "నీవు నాకొడుకువిగాదు.... నాకడుపున పుట్టలేదు. నాయింట్లో నుంచి ఫో" అని అరుస్తూ అంగలు వేసుకొంటూ బయట కెళ్ళిపోయాడు.

ఇదిజరిగి దాదాపు సంవత్సరమయింది. నేనింత వరకు యింటికెళ్ళలేదు. మాతాతగారి— మాఅమ్మ నాన్నగారి— యింటికిమట్టుకు వెళ్ళుతూంటాను. అచ్చటే మాఅమ్మను అప్పుడప్పుడు కల్సుకొంటూంటాను. ఆమె చిక్కి శల్యమయింది. ఎప్పుడు ఏడుస్తూనే వుంటుందట, మాతాతగారే యిప్పుడు నాకు డబ్బు యిస్తున్నాడు. నాకాళ్ళమీద నిలబడి, నాబ్రతుకేదో, నాకు బ్రతకాలనుంది. ఆరోజు మరి ఎప్పుడువస్తుందో? అప్పుడప్పుడు మాతాత, మానాన్నగారు నేను యిలా వుండటం బాగాలేదంటారు. మానాన్నకు, నాకు ఎలాటి మన స్పర్థలూ లేవని, ఒకతరానికి, మరొకతరానికి ఆశయాల మధ్యకల్గిన సంఘర్షణేనని చెబుతూంటాను. నిజంగా మాఅమ్మనుగూర్చే నాకువిచారం. ఆమెకొరకే నేను యింకా బ్రతికున్నానుకూడాను. ఆమెను ఎప్పుడూ చూడాలనుంటుంది.... అంటూ ఎంతో ఆవేశంతో చెప్పాడు. తల్లిమాట వచ్చినప్పుడల్లా, అతనిగొంతుక వణకటం, నేను గమనిస్తూనేయున్నా. అతనికళ్ళవెంట నీళ్ళు కూడ వచ్చివుండాలి. అతనిముఖంలోకి చూడాలనుకొన్నా, కాని ఏదోబాధతో చూడలేకపోయాను. కొంతసేపు అయినతరువాత నాకు దగ్గరగా జరగి నారెండు చేతులుపట్టుకొని "నన్ను అసహ్యించుకొంటున్నావా శశీ?" అన్నాడు గద్గదస్వరంతో—

నేను ఏమీ మాట్లాడలేదు.

"శశీ, నాహృదయంలోని యీబాధ నింతవరకు ఎవ్వరికీ చెప్పలేదు. ఎవ్వరికీ చెప్పగూడదనుకొన్నా. నీకు మాత్రం చెప్పాలనుకొంటూండేవాడిని. కాని నీవు దీనిని ఏవిధంగా తీసుకొంటావో అనే భయంతో యిన్నాళ్ళనుండి నీకు చెప్పలేకపోయాను. ఈప్రపంచములో నాకేముంది? ఎవ్వరున్నారు?అటుఅమ్మా.... అంటూండగా, అతనికన్నీరు నాచేతులమీద పడ్డాయి. నాకళ్ళుకూడ నీటితో నిండాయి. గొంతుకలో ఏదో అడ్డంపడ్డట్లు మాట్లాడలేకపోయాను.

మైసూరునుండి వచ్చాము. ఆతరువాత యిద్దరం పూర్వంఅంత కల్సిమెల్సుండటం జరుగలేదనే చెప్పాలి. పరీక్షలు దగ్గరకురావటం ఒకటి, జరిగినదానికి యిద్దరం guilty గా కూడ feel అవుతూండటంకూడ కారణమేమో! తరువాత ఒకనాటిసాయంకాలంవచ్చి బయటకు వెళ్ళి కాస్త కాఫీత్రాగి, మెరీనాలో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకొనవచ్చు రమ్మన్నాడు. ఆరోజు యీనాటికీ నాకు ఎంతో బాగాగుర్తుంది. దాదాపు యీరోజుమాదిరి రోజంతా వర్షంకురుస్తూనే వుంది. అతను వచ్చేముందే వానవెల్సింది. ఎంతోఅందంగావుంటుంది బయట. ఆడ నెమళ్ళు, ఫించములు విప్పి వయ్యారంగా, సరసులను కవ్వించే సమయమది. నేను వెంటనే సమాధానం చెప్పలేదు. చాలసేపు అవిషయాలు, ఈవిషయాలు మాట్లాడుకొంటూ కూర్చున్నాము. నాకు ఆనాడు ఎందుకు యిష్టంలేదో, యీనాడు చెప్పగలనేమో! రోజులు దగ్గరకు వస్తున్నకొలది, అతనిప్రక్కన నాస్థానం తెల్సుకొనాలని తహతహలాడుతూండేదానను. అతను నాకు రావటం యిష్టంలేదని గ్రహించివుంటాడు. నేనుకూడ మాట్లాడుతూనే ఏదోఒక కారణంకొరకు వెదుకుతున్నా. మాటల మధ్యలోనే అతను "నీకు యీనాడు నాతో బయటకు రావటానికి యిష్టంలేదని నాకు తెల్సు. నేనొకపాపిని కూడానని నాకు తెల్సు, కానీ నేను చచ్చిపోతే నీవు ఏడుస్తావా శశీ" అంటూసమాధానంకెదురు చూడకుండగనే, దబ,దబా బయటకువచ్చి కారులో విసురుగా బయటకు బైలుదేరాడు. బిత్తరపోయి, వ్యాకులపాటుతో, అతను వెళ్ళినవైపే చూస్తూ నిల్చున్నా. మరొకక్షణంలో— రవి కారు చాల speed గా బయటకు వెళ్ళింది, ప్రక్కనుండి లారీవచ్చింది— కెవ్వుమని పరిగెత్తా. ఏముంది రవి రక్తంలో మునిగున్నాడు. ఆఖరుసారిగా కళ్ళుతెరచి "శశీ.... అమ్మా".... అన్నాడు. అంతే రవికినాకు ఋణంతీరిపోయింది. రవికి నాజీవితంలో ఆఅధ్యాయం ముగిసింది. దీనికికారణం.... నేనే.... ఆపాపం నాకు కొట్టకుండాపోతుందా?"....

"అమ్మా.... అమ్మా"....

"ఎవరూ.... లక్ష్మి. అప్పుడే వచ్చావేం? పనికి టైమయిందీ?"

"వచ్చి చాలసేపయిందమ్మా. బయట ముగ్గువేసి పాత్రలు బయటవేయటానికి వెళ్ళుతూండగా, మీ ఏడ్పు

వినిపించింది.... ఎందుకమ్మా అలా వెక్కి వెక్కి ఏడ్చారు. ''

''ఏడ్చానాలక్ష్మీ?''

''అదేమమ్మా, చారలు ముఖంమీద.... వంట్లో బాగుండలేదా? అయినా యీస్థితిలో మీరలా కుర్చీలో చల్లగాలిలో కూర్చొని నిద్రపోవటం మంచిదిగాదమ్మా''

''ఏమీ ఫర్వాలేదు లక్ష్మీ''.

''తలుపులన్నీ బార్లగా తీసున్నాయి. నేను వచ్చేటప్పటికి వానజల్లుతో గదంతా తడిసివుంది.''

తలుపులు వేయటం మర్చిపోయాను లక్ష్మీ''

''అలాఅయితే ఎలాగమ్మా. జాగ్రత్తగావుండాలి. వాన కురుస్తూంది కాబట్టి సరిపోయింది— ఈతావు అంత మంచిదికాదుకూడాను. బాబుగారు వచ్చేవేళయింది, కాస్త లేచి ముఖం కడుక్కొనండమ్మా.''

''మనసొత్తు అయితే మనవద్దనే వుంటుందిలక్ష్మీ. ఏదో మన తెలివితక్కువతనంవల్ల తాపత్రయపడ్డా అది మనదికానప్పుడు లాభం ఏమీవుండదు. కాని మనస్సు ఏదో వూరుకొనక అలా చేస్తూంటాము. అంతే. చల్లగా హాయిగావుంది. బయటకూడ వానతరువాత ఎంతో ప్రశాంతంగా వుందిగదూ!''

ఆంధ్ర మహిళాసభ-నర్సింగుహోమ్.

పై నర్సింగుహోమున తరిబీతుపొందిన ఈక్రింది (8–వజట్టు) మంత్రసానులు (ఉన్నతతరగతివారు) 1961సం॥ జూలై నెలలో జరిగిన అంతిమ **(Final)** పరీక్షలో ఉత్తీర్ణులయిరి:—

1.	కు॥	జి. లక్ష్మమ్మ.	9.	,,	ఏ. షి. సరోజిని.
2.	,,	ఏ. నవనీతం.	10.	,,	కే. కమలమ్మ.
3.	,,	యం. భాగ్యమ్మ.	11.	,,	జీ. నాగరత్నం.
4.	,,	యం. భాగ్యం.	12.	,,	ఏ. యశ్. గిరిజ.
5.	,,	డి. సుజనాబాయి.	13.	,,	ఏ. వి. యం. లక్ష్మి.
6.	శ్రీమతి॥	యస్. జే. యం. లిల్లీబాయి.	14.	,,	స్వరాజ్. హేమలత.
7.	కు॥	కే. నవనీతాబాయి.	15.	,,	టి. సరోజిని.
8.	,,	ఓ. సుగుణమ్మ.			

(Sd) యం. పావనాబాయి.
మెడికల్ సూపరింటెండెంటు.

తండ్రి సంపాదించి దాచియుంచిన డబ్బు
తనచేతి కబ్బినఁ, దక్షణంబ
జూదంబు పందెంబు, చుట్టలు, సిగరెట్లు
పెసరట్టు వడలు కాఫీలు టీలు
తిండికిన్ ముండకున్, మిండగాండ్రకు నెల్ల
దండుగలకు నల్లపండుగలకు
రొట్టెలకు, నీటి తొట్టెలకును, తోలు
పెట్టెను, రంగు బట్టలకు
సెలవు గావించి, క్రాపింగు శిరముతోడ

నెనసి యాంగ్లేయభాషా విహీనుఁడైన
రిక్తునకుఁ గల్గునే భుక్తి ముక్తులకట
ప్రకటధన మది లేకున్న సుకముసున్న!!

(సుకముసున్న శతకము)

అరణ్యక జాతులు :

బిరిజియాలు

వీరుకూడా బిరుహోర్ల మోస్తరే. ఛోటానాగ పూరు ప్రాంతంలోని ఆటవికుల తెగలకు చెందినవారే. వీరు వసించే పర్వత ప్రదేశాలు నరమాత్రులకు చాలా దుర్గమాలు. 1836 సం॥న ఈ ప్రదేశాన్ని పరిశీలించిన కెప్టెన్—జి. సి. డ్రిప్ అనే అతడు దీన్ని గూర్చి యిలా వర్ణించాడు.

ఈ బిరిజియాలు ఉండేచోట్లు అన్నీ-అభ్రకం (Mica) పటికరాళ్ళ (Crystal) శిలా ఖండాల మయమైనవి. ఈ రాళ్ళు చిత్ర విచిత్రాలయిన ఆకారాలతో ఒక దానిమీద ఒకటి పేర్చినట్లు కనబడతాయి. సూర్యకాంతులకు అవి దగద్ధగాయ మానంగా, అగ్గిమంటలుపైకి లేచాయా అన్నట్టు మండుతూంటాయి. ఈ పర్వత శిలాఖండాలు 'పాల్కోట'కు ఉత్తర దిక్కున సహజంగా నిలబడ్డ స్తంభాల మోస్తరుగా కొన్ని చోట్ల, గోళాకారాలుగా కొన్నిదిక్కుల ఉన్నాయి. ఈలాటి పాషాణాలతో చుట్టుకోబడ్డ నిర్మానుష్యాలయిన గుట్టలే, బిరిజియాజాతి నివాసస్థానాలు. ఆ తిప్పలు తూర్పునుండి పడమటికి వ్యాపించి ఉన్నాయి. సమభూమినుండి చూచేవాళ్ళకి ఆ కొండల శిఖరాలన్నీ ఒకఖేయెత్తు గలిగి దిక్చక్రవాళాన్ని (HORIZON) అంటుతున్నట్టు అగపడతాయి. కొన్నిచోట్ల — అనగా నేలకు సమంగా ఆరంభం అయ్యే దారులలో, చాల పటవాలుగా. నిచ్చెన మెట్లెక్కినట్టు ఎక్కి వెళ్ళాలి. మరికొన్ని కాలిబాటల్లో నేమో, నిట్టనిలువున గోడ పట్టుకొని పాకిపొయ్యేట్టు వెళ్ళాలి. వాటి శిఖరాల వరకు అలా వెడితే, చొక్కా మెడ (పట్టీల) కాలర్లవలె అన్నిదిక్కుల ఇరుకయిన కాలిదారులు కనబడతాయి. అవి కొండల పై భాగంలో కురిసే వర్షాన్ని కొంత వరకు ఆపుతాయి. ప్రవాహవేగాలకు పైన ఉన్న నేలమన్ను అంతా కొట్టుకొనిపోయి రాళ్ళ శిఖరాలు అంచులు మాత్రం నిలుస్తాయి. పర్వత పైభాగపు సానువుల్లో లోతుగాఉండే చోట్లలో మాత్రము మంటి నేలలు కొద్దిగా అగపడతాయి. అవి పైర్లు పెట్టుకోవటానికి పనికివస్తాయి. గుట్టల అంచుల్లో వన వృక్షాలు వృద్ధి పొందుతాయి. సాధారణంగా అక్కడ టేకు మ్రాకులు పెరుగుతాయి. ఈ గుట్టలన్ని ఒకేయెత్తు గలిగి సముద్ర మట్టానికి 1000 అడుగుల పొడవున వుంటాయి.

ఈ బిరిజియాలు మొదట ద్రావిడజాతికి చెందిన వారుగా తోస్తుంది. వీరిలో రెండు తెగలు ఉన్నాయి. మొదటిది సామాన్యమయిన బిరిజియాతెగే. రెండోది "ఆగోరియులు" — అనే వారితెగ. వీరు పరస్పరం ఇచ్చి పుచ్చుకొనే సంబంధాలు, సమానాచార వ్యవహారాలు గలవారే. ఉచ్చారణలో 'పంతోడి గ్రామ్య ముండారి' భాషను వీరు ఉపయోగిస్తారు. వీరి మూల పురుషులు కోలాగువారని కలనల్ డాల్టను అనే ఆయన చెప్పాడు. కాని ఈ బిరిజీలు తమకు సంబంధించిన పూర్వ చరిత్రను పూర్తిగా మఱచి, ఏ జనాంగం కూడా తమ ఆదిమం కాదంటారు. వీరిలో కొద్దిమంది "పాలమవు"లోయలలోని గ్రామాల్లో ప్రవేశించి కర్షక వృత్తిని అవలంబించారు. పెక్కుమంది ఇంకా మూడు నాలుగు కుటుంబాలుగా చేరి ఆ గుట్టల అంచులలోనే గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అయితే అది వాళ్ళకి స్థిరనివాసస్థానాలు కావు. అడవులను ఛేదించి క్రిందిచెట్ల మొదళ్ళను తెగగాల్చి, ఆ సంవత్సరానికి అక్కడ కాపురంచేయటానికి తగిన అనుకూలాలు, కల్పించుకుంటారు. అక్కడి నేలలో అత్యల్పంగా, తిలలు, కొర్రలు, ఆముదాలు పైరు చేసుకుంటారు. నాగేళ్లు, త్రవ్వుడు పాఱలు మొదలైన సాధనాల ఉపయోగం వాళ్ళకేమాత్రం తెలియదు. కూచిగా చేయబడిన వెదురు కర్రతో పల్లాలుచేసి గింజలు అందులో మొలవవేస్తారు. అలాంటి పంట వాళ్ళకు బొత్తిగా చాలనేచాలదు. అంతేగాక. వాళ్లు తమగుట్ట ఏ పల్లె సరిహద్దులో ఉన్నదో, ఆ గ్రామం పెద్దకు 2 లేక మూడు మణుగుల ధాన్యాన్ని పన్నుక్రింద చెల్లించాలి. ఒకకారు కాగానే రెండవకారుకు వారక్కడ తఱచుగా నివసించరు. వారు లక్క, మైనము, తేనె, అడవిదుంపలు మొదలగు వాటిని సేకరించి పెట్టుకోటంలో మంచి నిపుణులు, వారు వాటిని కొండల క్రిందిఊళ్ళకు తెచ్చి, ధాన్యం, ఉప్పు, పొగాకు వీటికి వినిమయంగా ఉపయోగించుకుంటారు.

అడవిలోని కాయ గసురులు, గడ్డలు, — ఈ లాటి వాటిని వారు ఆహారార్థం వినియోగించుకుంటారు.

ప్రభుత్వ అటవీశాఖవారు, సంరక్షణార్థమై అరణ్యాలను తమ స్వాధీనం చేసుకొని, చట్టప్రకారం కొన్ని నిర్బంధాలను అమల్లో పెట్టటంవల్ల వారినిత్య జీవితం దుర్భరం అయింది.

బిరిజియా తెగవారిముక్కులు మొనదేరిఉంటాయి. దవడలయెముకలు పెద్దవిగాను, కండ్లు లోతుగాను ఉంటాయి. బిరిజియాలుగాని, ఆగోరియులు గాని

కోళారుజాతికి చెందినట్లుచెప్పటానికి వీలులేదు. యువతులుగా ఉన్నప్పుడు స్త్రీలుమాత్రం 'ముందా'జాతి వనితలవలె కనబడతారు. వారి మతప్రకారం పితరుల ఆరాధనమే దేవపూజగా పరిగణిస్తారు,

ఋతుమతులు కాని కన్యలపెండ్లిండ్లు చాలా అరుదు. వారి వివాహాలలో ఆడంబరాలు ఎక్కువగా వుండవు. వరుని తండ్రి తనతమ్ముణ్ణిగాని, స్నేహితుణ్ణిగాని, కన్యాజనకునివద్దకు పిల్లను తనపిల్లవాని కిమ్మని అడగటానికి పంపుతాడు. అలా వెళ్లేపెళ్లిపెద్దకు వాళ్ల భాషలో 'అగువా'— అంటారు. అతడు వధువు తండ్రితో మాట్లాడి, కన్యానిశ్చయం చేసికొని వారిజాత్యాచారాన్ని అనుసరించి పెండ్లివిందుకు అతనియొద్ద నుండి కొంతడబ్బు తీసికొనివచ్చి— ఒకశుభదినాన (ముహూర్తంనాడు) విందుకు ఏర్పాటు చేస్తాడు. ఇరుపక్షాలవారు బంధుమిత్రులతో కన్యాగృహానికి లగ్నంవేళకు సరిగా వచ్చి సమావేశం అవుతారు. ఆపరిణయసంబంధంగా చాలాదినాలవరకు వేడుకలు జరుగుతాయి. మొదటినాటిరాత్రితో కల్యాణకాండ సమాప్తి కాగానే, నూతనవధూవరులు మరునాటిఉదయమే విందులో అందరితోబాటు పాల్గొంటారు.

బిరిజియాలనృత్యాలు 'యురోను'ల నృత్యాలను పోలివుంటాయి. అయితే వాటికంటే ఉత్సాహవంతంగాను, త్వరితపుమార్పులతోను ఉద్రేకంగాను ఉంటాయి, వాళ్లు నృత్యంచేసేటప్పుడు తలవెండ్రుకలను, భుజాలను నెమిలిపురులతో అలంకరించుకొని, వాటిని కట్టగాకట్టి తోకలమోస్తరు వెనుకదిక్కున వ్రేలాడేట్టు ధరిస్తారు. స్త్రీలు సహజంగా పుష్పాలు తలలో అలంకరించుకుంటారు. యురోనుల సంగీతంకంటే, ఈబిరిజీయులసంగీతం మృదుమధురంగాను, వినటానికి ఇంపుగాను ఉంటాయి. అవి ప్రేమగీతాలతో నిండివుంటాయి. కాని అందులో కొన్ని ప్రాచీనులయిన బిరిజీయుల-యుద్ధవీరులప్రతాపాన్ని వెల్లడించేవికూడా ఉంటాయి అంతేగాక, 'పాలమౌ'మీదికి దండెత్తివచ్చిన రాజపుత్రుల (రసపుత్రుల) చరిత్రలగూర్చి వర్ణించేవిన్ని వుంటాయి.

బిరిజీయు లిప్పుడిప్పుడు గ్రామోద్ధరణకార్యాల మీద మోజు చూపుతున్నారు. వారిమోస్తరు వాసయోగ్యాలయిన దగ్గరి గ్రామాల్లో ఇండ్లుకట్టుకుంటున్నారు. సంఘసంక్షేమ సేవకులు, భూదానోద్యమ కార్యకర్తలు, వాళ్లు పయికిరానటానికి తగినమార్గాలను బోధిస్తూ ఆర్థికంగా ఎంతోతోడ్పడుతున్నారు. ఒకనాడు కేవలం అనాగరకులుగా వుండిన యీ తెగవారిలో చాలమంది నేడు గ్రామీణజీవనానికి పనుపడి. ఉత్తమజీవితాన్ని నడిపేవారులుగా తయారుకావటం భారతదేశజనయిత్రి భాగ్యవిశేషం అనకతప్పదు.

(శీశకుంతలా శ్రీవాత్సనగారి వ్యాసాని కనువాదం)

మాతృ సేవ!

శ్రీమతి కవులలక్ష్మీ నరసమ్మ (అనకాపల్లి)

మాతృ సేవ చేయనీకు
అత్రుతేల కలుగలేదు?
ముక్తినిచ్చు నామె సేవ
శక్తినంత ధారపొయ్యి!

మాతృ సేవ కంటెమంచి
మార్గమొకటి వేరెలేదు!
దైవస్వరూపమైన
తల్లిని పూజింపవోయి :

అవయవాలు బాధపడగ
నవమాసములు మోసి!
నిన్ను కనిపెంచినట్టి
కన్నతల్లిని మరువకోయి!

నీ సౌఖ్యమె తనదియని
నీ పురోభివృద్ధి కొరకు!
నిత్యము మదినిలోతలచెడి
నీ తల్లిని విడువకోయి!

ముసలితనము రాగానే
విసుగుకొనకు తల్లిపైన!
లేవలేని స్థితిలోన
సేవజేసి తరియింపుము!

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the Month of July, 1961.

OUT-PATIENT REGISTER:—

No. of Surgical cases treated		32
„ „ Medical „ „		672
„ „ Ante-natal „ „		128
„ „ Post-natal „ „		39
„ „ Gyneac „ „		109
„ „ E.E.N.T. „ „		41
„ „ Dental „ „		3
Total „ „ New Patients		1024
„ „ „ Old „		1215
	Grand Total	2239

ADMISSION REGISTER:—


No. of Patients admitted for Normal Deliveries		111
„ „ „ „ „ Abnormal „ Forceps Breech I.P. Versian		10
No. of Patients Post Natal Cases treated		2
„ „ Ante-natal „ Toxeamia		3
„ „ „ „ False pains		24
„ „ Gyneac „		31
„ „ Medical „		17
„ „ Babies admitted as Lodgers		112
	Grand Total	310

(True Copy)

(Sd.) Dr. K. R. AMBUJA,
Resident Medical Officer.

(Sd.) Dr. M. PAVANA BAI,
Medical Superintendent.

Smt. V. LAKSHMI PARVATI.
Secretary.



అసలు కీలకం

సత్వరసేవకు ముఖ్యసాధనం

దేశంలోని వివిధ పోస్టాఫీసులు ప్రతి ఏడాది సుమారు ఒకటిన్నర కోట్ల వుత్తరాలను రిటర్న్డ్ లెటర్ ఆఫీసులకు పంపుతున్నాయి. ఎంత శ్రమ తీసుకుని ప్రయత్నించినప్పటికీ, వీటిని బట్వాడా చేయడం సాధ్యపడడంలేదు. దీనికి మూలకారణం చిరునామా పూర్తిగా లేకపోవడమే. రిటర్న్డ్ లెటర్ ఆఫీసులు వీటిలో నూటికి 90 వంతులను చిరునామాదారులకో, లేక అసలు వుత్తరం వ్రాసినవారికో అందజేయగలుగుతున్నాయి. ఇదైనా అనూహ్యమైన కృషి. కాలవిలంబన జరిగిన తరువాతనే సాధ్యపడుతోంది.

చిరునామా అసంపూర్ణంగా, అస్పష్టంగా వుంటే
మీ ఉత్తరాలు
చేరడం ఆలస్యమౌతుంది

"చిరునామా పూర్తిగాను,
విస్పష్టంగాను వుంటే
ఉత్తరాలు శీఘ్రంగా
గమ్యస్థానం చేరుతాయి"



మీసౌకర్యం కోసం మాతో సహకరించండి

తంతి తపాలా శాఖ

DA 60/426

తగనిశిక్ష

సారథి

వృదయం దాదాపు పదిగంటలు కావస్తుంది. తలంటి పోసుకున్న శిరోజాలను చక్కబెట్టుకుంటూ తన్నొక్కసారి నిలువుటద్దంలో చూచుకుంది సుధ. అద్దంలో తన ప్రతిబింబాన్ని తనివితీరచూచి తనే నవ్వుకుంది. ఆనవ్వులో గల ప్రత్యేకాకర్షణకు గల కారణం ఆనిమిషానికి సుధకుమాత్రమే అర్థమౌతుందేమో! నవ్వుతూ వెళ్లి ఛేర్‌లోకూర్చొని తదేకధ్యానంగా భర్తఫోటోపై దృష్టినిల్పింది. వెంటనే ఫోటోను తీసి గాఢంగా హృదయాని కదుకుంది. మళ్లీ దాన్ని యథాస్థానంలోనే ఉంచి ఆరోజే తనభర్తవద్దనుండి వచ్చిన వుత్తరాన్ని తీసి మనస్సులోనే చదువుకుంది. అప్పటికీ తృప్తి చెందలేదు కాబోలు, మరొక్కసారి బిగ్గరగానే చదువనారంభించింది :

సుధా!

మన మిదివరలో ఒకరికొకరు ఎన్నోవుత్తరాలు వ్రాసుకున్నాం. ప్రతివుత్తరానికి ఇద్దరం సన్నిహితులవుతున్నట్టు ఫీలయ్యాంగా, ఇన్నిరోజులు. ఈవుత్తరంతో ఆ శుభఘడియకూడ దగ్గరకొచ్చింది.—అంటే, రేపు నేను నీసన్నిధానంలో ప్రత్యక్షమవుతున్నా—దేవి ఈభక్తుడ్ని అనుగ్రహిస్తావో లేక ఆగ్రహిస్తావో—

మిగతంతా ముఖాముఖిని మాట్లాడ వుచ్చుళ్లారు—

నీ ప్రియభర్త,

కృష్ణ.

వుత్తరంచదవడం ముగించి,

"ఆహా– ఎంతకొంటెతనం. నేనుదేవి– తనుభక్తుడా! రానీ, ఈసారికి మెత్తగా బుద్ధిచెప్పాల్సిందే" అని అనుకుంది.

ఎంతసేపు ఆలా అనుకుంటూ కూర్చుందో తెలియదు, కాని ఏదో వసారాలో అలికిడవడంతో ఈలోకానికొచ్చి పడ్డది. వెంటనే లేచి వసారాలోకొచ్చి చూడ్డంతో సుధ అలా శిలాప్రతిమలా నిల్చుండిపోయింది. నోటిలో మాటలు పెగలడంలేదు. తానేమి కలకనడంలేదని నిర్ణయించుకున్నతర్వాత అక్కడికొచ్చిన వ్యక్తిని నఖశిఖపర్యంతం పరిశీలించింది. ఆమెలో ఆనందం కట్టలు త్రెంచుకుని పొర్లడంలో, గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకోప్రయత్నించింది.

"తన ఒక్కగానొక్క అన్నయ్య, సుమారు ఆరుసం॥లకుముందు నాన్నతో ఘర్షణపడి వెళ్లిపోయాడు. ఆరోజు తను ఇంట్లోకూడ లేదు. వాడు అలా వెళ్లిపోవడానికిగల కారణాన్నిసైతం ఇంట్లో ఎవ్వరు తనతో చెప్పలేదని చాలబాధపడిం దిన్నిరోజులు. అటుతర్వాత రెండుమూడు సం॥లలో ఒకరితర్వాత ఒకరుగా అమ్మ, నాన్న పోయారు.— తనకు మిగిలిందల్లా ఆ ఒక్కగానొక్క ఇల్లు.— అప్పట్లో తన్ను కృష్ణ ఆదరించి ఆదుఃఖసాగరం నుండి గట్టుకీడ్చుకుండవుంటే ఇప్పటికి తాను నామరూపాలు లేకుండాపోయేది– ఒకందుకు తానదృష్టవంతురాలనుకుంది, తర్వాత అన్ననుగురించి బాధపడ్డప్పుడల్లా, ఎంతోప్రేమతో, తన్ను కృష్ణ లాలించేవాడు. ఆమాటలు. ఇంకా చెవుల్లో రింగుమంటున్నాయి—

"వూరుకో– సుధా! నిన్ను వెదుక్కుంటు ఒకరోజు మీఅన్నయ్య తప్పకవస్తాడులే– అనవసరంగా ఊ విషయాన్నిగురించి బాధపడడంలో అర్థంలేదు– సుధా! నామాటనమ్ము. మీఅన్నయ్యను నీముందు నిల్పాల్సిన భారం నాది"

"ఆ అన్నయ్య, ఈరోజు హఠాత్తుగా ఎవరిసహాయం లేక తనయెదుట సాక్షాత్కరించడంతో, సుధ వుక్కిరిబిక్కిరియై మాటలురాక నిల్చిపోవడం ఆశ్చర్యమనిపించదు.

మూర్తి తన్ను ఎంతసేపటి సుధ పలుకరించకపోవడంతో పాపం చాలబాధపడిపోయాడు, "ఒకవేళ తన్ను మర్చిపోయిందేమో" అనికూడ వాపోయాడు, అయినా తమాయించుకుని "సుధ– నేను నీకు జ్ఞాపకమున్నానో లేనో కాని, నిన్నుమాత్రం ఈదౌర్భాగ్యుడు మర్చిపోలేదు. చెల్లీ, అనడంతో సుధ "అన్నయ్య" అంటూ అప్యాయతతో పలకరిస్తూ అతనిచేతులు పట్టుకుంది.

"నిన్ను మర్చిపోయేంతటిదాన్ని కాను అన్నయ్యా" నీవు ఇన్నిరోజులనుండి అర్థం చేసుకుంది "ఇదేనా, రా– లోనికెళ్దాం" అంటూ మూర్తిని లోపలికి లాక్కెళ్లింది.

"అన్నయ్య నిన్ను ఈస్థితిలో చూస్తుంటే ఇన్నిసం॥లుగా నాలో దాగున్న అనురాగం పెల్లుబుకుతుంది. తత్ఫలితంగా నీతో తనివిదీరా నాబాధను వెళ్లగ్రక్కాలనుకుంటున్నా. కాని అదేంమాయో ఒక్కమాట పెగలడంలేదు "అంటూ వాపోయింది.

"చెల్లీ– ఎందుకలా బాధపడ్తావు. నేను నీదగ్గర కొచ్చేసానుగా. ఇక ఎప్పుడు నీచెంతకూర్చొని నిన్నానందపరచడమే నాజీవితలక్ష్యం– నేను వట్టిఅప్రయోజకుడ్నని,

ఎవ్వరికి పనికిరానివెధవనని అమ్మ నన్ను తిట్టిపోస్తుండేది. ఆమాట ఇంతవరకు అక్షరాలా నిజమయింది. ఇక ఆమాటకున్న విలువకు ప్రాధాన్య మివ్వదలచుకోవడం లేదు నాలంత రాత్మ'' అన్నాడు ఆవేశంగా మూర్తి.

"అన్నయ్యా– నీవు త్వరగా స్నానంచేసిరా, భోం చేసి తీరిగ్గా మాట్లాడుకుందాం'' అంటూ తువ్వాలు అం దించి వంటగదిలో కెళ్లిపోయింది సుధ.

స్నానంచేస్తు మూర్తి పరిపరివిధాలా యోచిస్తూవుండి పోయాడు. "చెల్లాయిలో అప్పటికి, ఇప్పటికి ఏమార్పు కన్పట్టంలేదు– అదే ఆదరణ, అదే అనురాగం ఈదీనుడి మీద– కాని తను ఇన్నాళ్లు సర్వం మరిచి వున్నాడుకాదా! ఎంతటి కృతఘ్నుడ్ని'' అని బాధపడ్డప్పుడు అతనికంట్లో అశ్రువులు నిల్చాయి.

అన్నంవడ్డిస్తూ మళ్లీ సుధే ప్రారంభించింది:—

"అన్నయ్యా– నీవు ఇల్లువిడిచిపెట్టి వెళ్లిపోయిం తర్వాత అమ్మ, నాన్న ఎంతగా బాధపడ్డారోతెలుసా– నీవు తప్పక తిరిగివస్తావని చాలరోజులుగా ఎదురుచూచి, చివరకు నీవు ఇకరావన్న నిస్పృహతో, అదేవ్యధతో. ఒకరి తర్వాత ఒకరుగా, ఈలోకంలో నన్నేకాకిగా విడిచిపెట్టి, వెళ్లిపోయారు. తర్వాత నాపరిస్థితి అధ్వాన్నంగా తయా రయింది. అప్పట్లో ఆయనేగాని నన్ను ఆదుకుని కాపాడక పోయుంటె ఇప్పుడు నీముందు వుండేదాన్నికాను– అయినా నీవు ఇల్లు విడిచిపెట్టాల్సిన అగత్యం ఎందుకేర్ప డిందో. నాకింతవరకు అర్థంకానిసత్యంగానే వుంది– అన్నయా''

"అదోపీడకల అనుకుంటా– నీకు తెలుసో లేదో, నీస్నేహితురాలు ఉషకు నేనంటే బహిఃప్రాణం, నేను ఆమెను పెండ్లాడదాని కిష్టపడ్డప్పుడు, అమ్మానాన్న వుమ్మడిగా ప్రతిఘటించారు. పర్యవసానం నేను ఇల్లు వదలి వెళ్లిపోవలసివచ్చింది. ఇన్నిరోజులు ఏవిషయం అంతగా పట్టించుకోక నాస్వయంకృషితో పైకివచ్చాను. డబ్బుకూడ బాగా ఆర్జించాను. నిన్నటివరకు నాజీవితం ఏలాటిఒడు దుడుకులు లేకుండా సాగింది. నాకు మనశ్శాంతి ఏర్ప డిందని భ్రమించాను. ఇంతవరకు, కాని మళ్లీ అది నాలో కరువైందిగా కన్పిస్తుంది– నిన్న నేను విచిత్రపరిస్థితు లలో, నాస్నేహితుడైన శత్రువుని కలుసుకున్నా. నేనిన్ని రోజులు పడ్డకష్టాలకన్నిటికి ఒకందుకు వాడే కారణం- చెల్లీ. ఆరోజు ఉషతో నాపరిచయాన్నిగురించి మనఇంట్లో వాడు చెప్పకుండా వుంటే, నేను ఇల్లు వదలి వెళ్లాల్సిన అవసరం వుండేదికాదు.— నీవిలా నీఅన్నయ్యకు దూర మయ్యేసందర్భం ఏర్పడివుండేది గాదు.—

మేమిద్దరం రైల్లో రద్దీవల్ల ఒకరిప్రక్కనొకరు నిల్చుకుని ప్రయాణం సాగిస్తూవచ్చాం. నన్ను వాడు పోల్చుకున్నాడో లేదో కాని, నేను వాడ్ని గుర్తుపట్టేశా. నాలో మానవత్వం జనించిపోయింది. ఇంగితజ్ఞానం, విచక్షణబుద్ధి కోల్పోయాను. నేనేంచేస్తున్నానని తెలి యక, అదనుచూచుకుని, అమానుషంగా వాడ్ని అమాం తం ఆరైలుపెట్టెలోనుండి త్రోసేశా. నేచేసినపనికి ఇప్పుడు బాధపడ్తున్నా.— నాలోని ప్రతీకారవాంఛ నన్ను అవివేకుడ్నిచేసింది అప్పట్లో.— వాడేమయ్యాడో పాపం– చెల్లీ– అంతటి కఠినహృదయుడు. ఖూనీకోరు, పాపిష్ఠి యైన ఈదౌర్భాగుడ్ని చూస్తూ ఎలాసహించుకొంటావో– నన్ను నీవు మాత్రం క్షమించానంటే అదే నాకుపదివేలు– లోకాన్నిగురించి నేబాధపడను అంటూ బోరున ఏడ్చాడు మూర్తి.

"అన్నయ్యా– వూరుకో– జీవితంలో కొందరు పరిస్థితులప్రభావానికి అహుతయిపోతుంటారు.— నీకు ఇప్పుడు అదేగతి ఏర్పడింది. జరిగిపోయిన విషయం గురించి అనవసరంగా అర్థంలేని ఆలోచనలతో నీ మనస్సు పాడుచేసుకోకు. కష్టాలు మానవులకుగాక జంతువులకు రావుగా.— లే అన్నయ్యా– నీవు విశ్రాంతి తీసుకో. అన్నంముందు ఇలా కూచొని బాధపడటం నేనహించలేను'' అని ఏడ్వసాగింది సుధ.

సుధప్రవర్తన అర్థంకాక అయోమయంలో పడ్డాడు మూర్తి. అతికష్టంతో లేచివచ్చి డ్రాయింగ్‌రూంలో కూర్చున్నాడు.

సుధ ఏంమాట్లాడక అలాగే అచేతనంగా నిల్చొని ఆలోచిస్తూ వుండిపోయింది. ఆలోచనతెరలనుండి బయటపడడంలోగా "టెలిగ్రాం" అన్న కేక వినబడి త్రుళ్లిపడింది. వణికేచేతులతో టెలిగ్రాంను అందుకుని ఆతురతతో చదవడంలో తనక్రిందభూమి దిగబడి పోతున్నట్లు, ప్రపంచమంతా తనయెదుట తిరిగి పోతున్నట్లు బాధపడింది.

తర్వాత కొంత సేపటికి తెప్పరిల్లుకుని అతికష్టంతో "అన్నయ్యా'' అని పిల్చింది– అరచింది– గొంతుచించు కుంది. కాని అన్నయ్య ఎంత సేపటికి డ్రాయింగ్‌రూం వదలి రాకపోవడంతో, తనే లోనికెళ్లింది. అక్కడ మూర్తి లేకపోవడంతో కొద్దిగా ఆశ్చర్యం చెందింది.

వెంటనే సుధ తనభర్తఫోటో క్రిందపడియుండడాన్ని చూచి కలవరం చెందింది. అతికష్టంతో ఆఫోటోను తీసి టేబిలుపై వుంచడంలో అప్రయత్నంగా ఆమెదృష్టి అక్కడున్న వుత్తరంపై పడింది.

గబగబా వుత్తరాన్ని చదువ నారంభించింది— చెల్లీ!

అమ్మ సదా అంటూండేది, నేను ఎవ్వరికి పనికిరాని వాజమ్మనని,-ఆమాట మరొక్కసారి నిజమైపోయింది. చూస్తూచూస్తూ నీజీవితానికే ముప్పుతెచ్చేశాను. నేను రైలునుండి త్రోసిన నామిత్రశత్రువు కృష్ణ, నాఅనుంగు చెల్లెలికిభర్త అన్నవిషయం ఇక్కడున్నఫోటోను చూడ్డం వరకు తెలియకపోయింది. నేచేసిన పాపానికి పరిహారం లేదు. చెల్లీ— అన్నెం పున్నెం ఎరుగని నిన్ను— నిర్దాక్షణ్యంగా నిర్దయతో— నీజీవితంతో చెలగాటమాడి, నీకు తగనిశిక్ష విధించాను. తెలియకచేసింది నేరమైనా,నా నేరానికి సరైన సంజాయిషీ ఇచ్చుకోవల్సిందే. నేనెంత విలపించినా నేచేసింది మహాపాపం. ఈ నాపాపిష్టి ముఖాన్ని నీకు చూపించలేను- నేను నిన్ను క్షమించమని యాచించలేను- చెల్లీ- కారణం నేజేసింది క్షమించ గలిగిన నేరంకాదే!

నాస్వయార్జితమంతా నీకప్పగిస్తున్నా- ఈలాటి అప్రాచ్యుడు, నీఅన్న అన్నవిషయాన్ని మరచిపోయావంటె నాకు అదేచాలు. —మూర్తి.

వుత్తరం చదువుతూ ఎంతసేపు ఏడ్చిందో కాని ముఖమంతా కందిపోయి కళ్లుచెక్కిళ్లు జేవురించి పోయింది. వుత్తరాన్ని టెలిగ్రాంను మార్చిమార్చి చూస్తూ దిగ్భ్రమతో నిల్చిపోయింది.

ఏదో నిశ్చయానికొచ్చినదై. సాయంత్రంరైల్లో బయలుదేరి ఆవూరెళ్లింది. రాత్రికి రాత్రి తనభర్తను గురించి ఆదుర్దాతో, హాస్పిటల్‌లో వాకబుచేసింది.

వుదయానికిగాని మృతదేహాన్ని తనకప్పగించరన్న కటువైన జవాబు వింటూ శోషిల్లి పడిపోయింది పాపం ఆ అబల.

అటుతర్వాత మూడురోజులకు గుర్తుపట్టడానికి వీలు కాని ఒకయువకుని శవం రైలుపట్టాలమీదుండినట్లు పేపర్లో పడ్డది.

శ్రీ వెంకటేశ్వర కళాశాల న్యూఢిల్లి

శంఖుస్థాపన మహోత్సవ సమయంలో

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారు

సమర్పించిన నివేదికలోని సారాంశము

ఢిల్లీ కళాశాలలందు ప్రవేశం లభించక ప్రతియేట దాదాపు రెండువేలమంది విద్యార్థులు కష్టపడుతూవుండగా ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికై ప్రత్యేకశ్రద్ధ తీసికొన్న నేను, ఈ విషయంలో విశ్వవిద్యాలయాధికారులు, విద్యామంత్రివర్గంలోనివారు. యూనివర్సిటీ గ్రాంటు కమీషన్ సభ్యులు పడుతూన్న శ్రమనుచూచి యెలా యీ సమస్య తీర్చగలమా అని చాలా కాలంగా ఆలోచించాను.

కొన్ని ప్రజాసంస్థలు సహవిద్యా పద్ధతి నంగీకరించి విద్యార్థినీ విద్యార్థులకు కళాశాలను స్థాపించి, ఢిల్లీయూనివర్సిటీవారి యాజమాన్యాన్ని అంగీకారాన్ని పొందినాయి. అయితే యూనివర్శిటీ గ్రాంటు కమీషన్ 1000 కి అధికంగా విద్యార్థులను ఏ కళాశాలకూడా చేర్చుకోవటానికి సమ్మతించదు. ఢిల్లీ యూనివర్సిటీకూడా అలాటి అభిప్రాయాన్నే కలిగివున్న కారణంచేత సంవత్సర ప్రతి సంవత్సరం కళాశాలలు క్రొత్తవి ఏర్పడుతూ వుండినా, విద్యార్థులకు అందరికీ ప్రవేశం దొరకక మిగిలిపోతూనే వుండినారు.

ఈలాటి పరిస్థితులను గమనిస్తూ, వుండిన నేను ఇదివరకే ఢిల్లీలో ఆంధ్ర విద్యాసంఘం (Andhra Educational Society) అనే ప్రత్యేక విద్యాసంస్థను స్థాపించి దాని పక్షమున 1100 మంది బాలబాలికలకు విద్య నేర్పే సౌకర్యాలు కలిగించాము. కాని కళాశాల స్థాపనమంటే

అంత సుకరమైంది కాదు. విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం 5 లక్షల రూపాయలు నిధిగా ఏర్పడాలి. అనుకూలమైన కట్టడాలు వగైరాలకు మఱొక పదిలక్షల రూపాయలు కావాలి. ఇంత పెద్దమొత్తాలు సమకూడే మార్గమేది?

కాని, అలాటి దీక్షవుంటే, ధనం సేకరించటానికి దారి యేర్పడక పోతుందా? అనే దృఢ నిశ్చయంతో ప్రయత్నించాము. సరిగా (1960 సం॥ అగస్టునెల 26 వ తేదీ) ఈనాటి కొక యేడాదిక్రితం అనేక విద్యా సంస్థల్ని పోషిస్తున్న వేంకటేశ్వరుడు స్మరణకు వచ్చాడు. తిరుమల తిరుపతి దేవాలయ ధర్మసంస్థని ఆశ్రయిస్తే కార్య సాఫల్యం కావచ్చుననితోచి, దాని కధికారి అయిన శ్రీ అన్నారావుగారికి 'ఫోన్' ద్వారా ఢిల్లీలో కళాశాలా నిర్మాణాన్ని గురించి తెలిపి, తోడ్పడాల్నని కోరాము. వారునూ తమ ఆమోదాన్ని తెలుపుతూ, తిరుమల తిరుపతి దేవాలయ ధర్మసంస్థా సంఘంవారి అనుమతికై యీ విషయాన్ని వారి సభలో సమాలోచనకి తెస్తామని అభయమిచ్చారు,

దానికి తగినట్లు స్థానికులుగా ఢిల్లీలో ఉన్న కొందరు స్నేహితులనుగూడ కలసి కొని చెప్పగా, – వారు కార్యరంగానికి దిగి శక్తికొలది పనిచేసే ఒక చిన్న కార్యనిర్వాహక సంఘంగా యేర్పడ్డారు. అందులో శ్రీ పి. వి. రాఘవరావు, డాక్టరు–కే. యల్. రావు, డాక్టరు సి. దక్షిణామూర్తి మొదలయిన ప్రముఖులు సభ్యులు. ఈ కళాశాలా ప్రాథమిక కార్యాలన్నిటిలోను శ్రద్ధ వహించి, ముందంజ వేస్తూ వచ్చిన శ్రీ రాఘవరావుగారి నాయకత్వాన త్వరలో దానికొక రూపం యేర్పడింది. యూనివర్సిటీ రిజిస్ట్రారు శ్రీ అయ్యరుగారు యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్‌వారు మేమీ కళాశాలా స్థాపన విషయంలో ఎలా నడుచుకోవలెనో, ఎప్పటి కప్పుడు, తగిన సలహాలిస్తూ వచ్చారు. ఢిల్లీలోని మా. సంఘంవారి తీర్మానాలను, తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మసంస్థకు అప్పుడప్పుడూ అందజేస్తూ వచ్చాము. ఢిల్లీయూనివర్సిటీ అధికార్లు మా కళాశాలా నిర్మాణాన్ని అంగీకరింపగోరి సెప్టెంబరు 23 తారీఖున విన్నపం పంపుకొన్నాము, వైస్ ఛాలన్సరైన శ్రీ సిద్ధాంతంగారు వెంటనే మా కోరికను అనుసరించి, కళాశాలా సహవిద్యాపద్ధతిని పనిచేయటాని కంగీకరించారు. మా కళాశాల సర్వసిద్ధంగా ఏర్పడే విషయాన్ని తిరుమల ధర్మసంస్థకు తెలుపగా వారు 1960 సెప్టెంబరు 27 న మా విన్నపాన్ని ఆమోదించారు.

ఆనాడే ఢిల్లీయూనివర్సిటీ వారిచే నియమించబడిన విద్యాసంఘం (Academic Council) ఆంధ్ర విద్యాసంఘ పాఠశాలా ప్రదేశాన్ని తనిఖీచేసి ఒక నివేదికను 2–12–60 న తయారుచేసి, 16–1–1961 న యూనివర్సిటీ వారి కందజేసింది. ఇది ఇలావుండగా నగర ప్రదేశాభివృద్ధిశాఖకు (Land and Development Department) కళాశాలా నిర్మాణానికి తావుకై విజ్ఞప్తి పంపుకోగా. ఆవాఖవారు 12–6–1961 న కిచ్నర్ రోడ్డు (Kitchner Road) సమీపంలో 15 ఎకరాలనేలను శాంక్షనుచేసారు. అక్కడ నూత్నభవనాలు కట్టేంతవరకు ఆంధ్ర విద్యాసంఘ పాఠశాలా ఆవరణంలోనే కొన్ని క్రొత్త కట్టడాలు కట్టి కళాశాల ఏర్పచటానికి తీర్మానించుకొని పని జరిపాము. తదనుసారం 1961 జూలై 15 కళాశాలను ప్రారంభించారు.

భవననిర్మాణ శంఖుస్థాపన మహోత్సవం, ఐక భారతోపాధ్యక్షులవారిచే 20–8 61 న జయప్రదంగా జరుపబడింది. యూనివర్సిటీ ఛాన్సలరయిన శ్రీ రాధాకృష్ణన్‌గారి ప్రోత్సాహానికై వారికి కృతజ్ఞతాభి వందనములు చెల్లిస్తున్నాము. ఈ మహోత్సవసభకు అధ్యక్షత వహించిన కేంద్ర విద్యామంత్రి, శ్రీ శ్రీమాలిగారికికూడా మా కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు,

తిరుమల తిరుపతి ధర్మసంస్థవారికిని ఆంధ్ర ప్రదేశ, దేవాలయాది ధర్మసంస్థల మంత్రిగారైన శ్రీ చంద్రమౌళిగారికిని మా వందనములు. మత ధర్మ సంస్థాసంఘ (Religious & Charitable Endowments Commission) అధ్యక్షులయిన శ్రీ బి. డి, లక్ష్మయ్యగారికి మా అంజలులు.

యూనివర్సిటీ గ్రాంట్సు కమీషనుకు ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న శ్రీ డాక్టరు కొఠారిగారికిని, మునుపటి అధ్యక్షులైన డాక్టరు దేశముఖుగారికిని, మా కన్ని విషయాలలో తోడ్పడుతూ వచ్చిన శ్రీ చాబ్రాగారికిని మా వినతులు.

కళాశాలకు అడుగగానే, ఏ మాత్రం ఆలస్యంలేకుండా స్థలాన్ని శాంక్షనుచేసిన–శ్రీ వి. కే. వి. రావు గారికి, శ్రీ కె. బి. మీనన్‌గారికి మాకై మోడ్పులు. కొలది కాలంలోనే యీ స్థలాన్ని రమణీయంగా దిద్దితీర్చి మా స్వాధీనం చేసిన శ్రీ రామారావు, సి. పి. డబ్ల్యు.డి. చీఫుఇంజనీరుకును ఈ మహోద్యమంలో సహకరించిన తక్కిన మిత్రులకు హృదయపూర్వకాభి వందనములు.

పేరలుక

శ్రీ ఈమని నర్సింహమూర్తి

"పేరలుకన్ జెందిన యట్టికాంత లుచితవ్యాపార ముల్ నేర్తురే!" అన్న తిమ్మనగారి పద్యపాదం, సార్థక మని శారదవిషయంలో ముక్కుపై వేలు వేసుకోనక తప్పలేదు. శారద గొప్పింటి ఆడబిడ్డ, తొలి చూపుల్లోనే మనస్సు దొంగిలించిన మా బావ మల్లికార్జునం, ఆమె భర్త. తరంగాలుతరంగాలుగా దొర్లే ఆయన ప్రేమ ప్రవాహంలో కొట్టుకువచ్చిననావ 'శారద'. ఆమె తన ఆశగా, వెలుగు నీడగా, ప్రేమమూర్తిగా, ఆరాధించిన మా బావ ప్రేమ, మామయ్య మక్కువ వాణ్ణి విధిగా శారదతో కల్పింది.

శారద మొదటిసారి అత్తవారింటికి వచ్చిన రోజులవి. క్రొత్త కోడలుకదా యని మొదటి రోజులల్లో బాధ్యత వప్పగిస్తే, బాధపడుతుందని అత్త మంగాయమ్మ కొంచెం చనువిచ్చి. కులాసాగా కబుర్లుచెప్పి, కాలం గడిపేది. ఆదినం ఆదివారం. బావకు ఆఫీసుకు శెలవుమూలాన యింటివద్దే, వాడుకప్రకారం. లేచి కాలకృత్యాలు తీర్చుకుని ఫైళ్ళ గుట్టలో మునిగి పోయాడు. శారద మాత్రం లేవలేదు. "ఏమే యింకా తెల్లవారలేదా" అన్న ఆత్తయ్య మాటలు, శారద చెవుల్లో గింగురుమని మేల్కొలిపి, అగ్నిజ్వాలగా రగుల్కొల్పింది కోపాన్ని. "దాన్నింకా లేపకే" అన్న బావమాటకు నీకు మరీ చులకనయిందిరా నా మాట, దాన్నే వెనకేసుకొస్తా వెందుకు అస్తమానూ! ఏదో కొత్త కోడలు కదా అని చనువిస్తే, నెత్తికెక్కి కూర్చో బెట్టుకోమంటావా? అన్న అత్తయ్య ధోరణి గాలిలో కలిసి, శారద చెవిని పడ్డాయి. కలకాదుగదా అనుకొంది. ఇంతకీ శారదాంబగారు లేస్తేగా! వచ్చిన కాస్త చదువుతోటి, లేనిగొప్పలు తెచ్చిపెట్టుకొని, విద్యారంభంలోనే ప్రేమించి, పెళ్లిచేసుకొని. ఆ విద్య కాస్తా శారదా పీఠాన్నెక్కించిన ఆమె చదువు వారి మనోభావాలకి అడ్డుతగిలింది. మామయ్య చదువుకొన్న కోడలొచ్చినందుకు ఎంతో మురిసిపొయ్యేవాడు. అత్తయ్యకు ఆంతరంగికంగా నచ్చినా, పైకి అత్తగారి పెత్తనం, కాస్త చూపించేది. చదువుకొన్న కోడళ్లొస్తే యిదే చిక్కు ఆనుకొనేది.

బావ శారదను లేపి 'కాస్త కాఫీ కాయరాదటే' అన్నమాట ఆమెను మరీ వెర్రెక్కించింది. 'ఛీ! పాడు మనుషులు; కాస్త లేచే సరికి కాఫీ అయినా యివ్వరు' అన్న శారదమాట అత్తయ్యను పురికొల్పింది. దానితో అత్తయ్య "ఏమిటే మరీ యిదవుతున్నావు. ఏదో క్రొత్త కోడలుకదా యని కాస్త చనువిస్తే, మరీనెత్తికెక్కుతున్నావు. అన్న ఆత్తయ్య ఆధికార స్వరం, బావ క్షమాక్షపణకు దారితీసింది. శారదా, మరేం అనుకోకు. అమ్మ అంతేలే! కొంచెం పెందరాళే లేవకపోతే ఎలాచెప్పు. వెళ్ళి, లేచి ముఖం కడుక్కొని కాఫీ త్రాగు' అన్నాడు. బావ త్రోటుపాటు ఆమెకు వెగటుగా తోచి 'నన్నింత చులకనగా చూస్తారెందుకు? మీ కిష్టంలేకపోతే నన్నింటికి పంపేయండి. లేదా నేనే పోతానంది. అంతే, కొద్ది క్షణాలలో 'శారద!' అన్న నా మాటలు చెవినిపడ్తేగా. తొందరగా సర్దుకుని, స్టేషనుకు బయలుదేరింది. మామయ్య నారదావతారమెత్తేసరికి, శారద రిక్షా ఎక్కింది. బావ శ్రీ కృష్ణపరమాత్మేగా ... లేచి సారించాడు దృక్కులు ... స్టేషనుకు తనూ పయనం సాగించాడు. దిగబెట్టకపోతే తనకేం ముప్పు వస్తుందేమోనని నా ... అపహారణ యింతటితో పూర్తగు ననుకొన్న సంశయం బావ తీర్చేడు. ఆమెను రైలెక్కించి తిన్నగా యింటికి వచ్చాడు. 'ఆమెను ఎంత బ్రతిమాలినా రానన్నదనిన్నీ. వేరేకాపుర, మయితే వస్తానందనిన్నీ, చెప్పిన బావ మాటకు అత్తయ్య 'పోనీలే! అంతవరకువస్తే నేనేనా ఊరుకునేది. చూస్తాగా! దీని ఆ అతిశయం. చదువుకున్న దానినని గొప్పగా చలాయిస్తుంది కాబోలు' అన్న అత్తయ్య మాటలు. 'నే ఉత్తరం వ్రాస్తాలేరా!' అన్న మామయ్య ఓదార్పుమాటలు, బావ హృదయానికి సంకోచవ్యాకోచాలు ఎక్కువ చేశాయి. మనస్సు పరిపరి విధాల పోయింది. గొప్పగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న. మిత్రుల కిప్పుడేమి సమాధానం చెప్పాలా ఆని ఆలోచించసాగాడు, యింతకీ తన్నేగా వారంతా అనేది. ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాడాయె. చూస్తే సముద్రఘోష కత్తుల్ని సహితం దూసుకుపోతోంది. లోకం అంతా తన్ని ఆడిపోసుకోదూ?

కొన్నాళ్ళయిన తర్వాత పరిస్థితుల్ని బాగా అర్థం చేసుకొని శారదకు ఉత్తరం వ్రాసాడు తప్పకుండా, ఆమెలో మార్పుతీసుకొచ్చి, తన ఎడారి జీవితం పూలవసంలా చేసుకుందామని. ఎవరికుండదా ఆశ? జీవితంలో కష్టసుఖాల నిష్పత్తి సమసంబంధ సామ్యములో నుంటుందన్న నానుడి సత్యం అనుకున్నాడు.

"ప్రియమైన శారదా! నీవేమో, నాన్నని, అమ్మని అపార్థం, అయితే చేసుకున్నావు కాని, వారి కనువుగా మెలగి, మనస్సుల నర్థంచేసుకుని, వారి మన్ననలు పొందగలిగేవుకావు. యిదంతా మన దుర దృష్టం. ప్రేమించి పెళ్లి చేసుకున్న వాళ్ల రీతి అంతా యింతేనా? కొద్దిగా పరిస్థితుల నర్థం చేసుకొని, మెలగి శాశ్వతసుఖాన్ని పొందలేక పోయావు. అంతా నీ దురదృష్టం. 'కోడికూతతో లేచినలోకం, లోకులలో ఒకరిల్లా నడిస్తే, కోడై కూస్తుం'దని నీవు నమ్మవా! నన్నంతా ఎన్నివిధాల చెరగి పారేస్తున్నారో నీకేమైనా తెలుసా? ఇంతకీ ప్రేమపెళ్లి విలువ మంట గలిపావు. 'స్వాతివానకు ముత్యపు చినుకా; అన్న అర్థోక్తికి మన ప్రేమైక జీవితం, నాంది అంటే, దాన్ని పునాదుల్లోనే కూలదోశావు. ఆనాటి మనమొదటి సన్నివేశం, గుర్తుందా!.... క్లాసులోఅంతా ఉపాధ్యాయులు సహితం, నీకాలేజిగరల్, స్పయిల్సుకు, వట్టి పోకిరిపిల్ల అని రిమార్కు చేసారు. కాని మన కన్నులతో పలకరింపు, నన్ను వాళ్లకాళ్లు పట్టుకొనేలా చేసి, వారందరితో విరోధం తెచ్చిపెట్టుకున్నా... ఫలితం, నిన్ను పొందగలిగా.... కాని అందమయిన, చల్లని చంద్రునికి, మచ్చ, కళంకంలాగ, నాజీవితాన్నొక మోడుపోయిన పూల వనంలా తయారు చేసావు. నీవానాడు ఎగిరి గంతువేసే, కాలేజిజీవితం, వేరొకందుకై యుండొచ్చు, కాని, ఆ నాత్యాగం, నాఅందం, మితారిచూపులచకోరికై, అన్నట్టుగా, నావశం, అయ్యావు. కాని, యిన్నిసంఘటనలు, మన వలిగిన జీవితాన్నంటి పెట్టుకున్నా, వాటిని క్షణంలో చెరపిపారవేశావు. పైగా ఎన్నో కబుర్లు చెప్పావు. 'అంతమంచివారు లేరండి. అనవుసరంగా, మీరెందుకు కలుగజేసుకున్నారు, లోకం బాధ భరించలేరుగా' అన్నావు. 'ఇదంతా వట్టిఆడవాళ్ల మోసమేనా? వలపుతీరినతోటే, జీవితం, వంటరితనం చేసుకొనే, కాంతల, కళాజీవితం, కాదుగదా! అందుకే, బంధంగా, పెళ్లిచేసుకొన్నాం. కాని, చదువుకున్నా, యింతతెలివిలేనిదాని వయ్యావంటే, నాదురదృష్టం' అనిచెప్పాలి. నాన్న అమ్మలధి, రాతి గుండెకావచ్చు.... మరి నీహృదయం, ఏమయింది....? పరిస్థితుల నర్థం చేసుకోలేని, నీచదువు విలువేది? పైగా సమాజాన్ని బాగు పరుస్తానన్నావు యిలాగేనా! ప్రేమంటే యింతేనా? ప్రేమికుల కిదా మనం చూపే దారి....? నాయీ ఉత్తరం, నీలో జ్ఞానాన్ని కలిగిస్తుందని ఆసిస్తా!"

—ఇట్లు "నీమల్లి"

కూతురు అసభ్యరాతకు అసలేకారాలు, మిరియాలు నూరుతున్న నారాయణగారు, ఉత్తరం, చూసి, మరీచికాకు పడ్డారు. ఎన్నోవిధాల బ్రతిమలాడి, 'శారదా! బయలుదేరు, అట్లేఅయితే, నీజీవితం, సర్వనాశనం అవటం, నాపరువు మంట గలవటం, జరుగుతుంది. లే! త్వరగా మెయిలుకు తయారవ్వు' అన్న నారాయణగారిమాటలు శారదను కించపరిచినై. అభిమానం, చంపుకొని యింటివద్దనుంటే, కలకాలం, ఎడారిజీవితాన్ని అనుభవించాలి, పోనీ అని వెళితే, తను వాళ్లందరికీ చులకనయి పోదూ! ఏదో వింతవింత ఊహలతో, తన భావిజీవితసౌధాన్ని నిర్మించుకొంటూ, చివరికి ఒకనిర్ణయానికి వచ్చినదానికిమల్లే 'నేను వెళ్లను నాన్నా! కావలిస్తే, అయన్ను ఎక్కడికయినా, ఉద్యోగం వేయించుకోమను, తప్పకుండా వస్తాను, నువ్వేచెప్పి'రా" అన్న శారద పెంకితనపు మాటలు, నారాయణగార్ని లోతుకిముంచి అట్లే పైకి ఎత్తినట్లయింది. ఏమైనా, చిన్నతనంకదా అని తనే సరిపుచ్చుకొని బయలుదేరి, పెళ్లివియ్యంకుడితో వినయంగా మాట్లాడి, అల్లుని ఒప్పించి, వారిప్రక్క ఊరిలోనే, ఉద్యోగం, వేయించుకొనే ఏర్పాటు చేసాడు. యిదంతా గమనించిన శారద అత్తగారు "ఏమైనా ముందొచ్చినకొమ్ములుకన్న, వెనకొచ్చినచెవులు వాడికదా! యింతకీ మీరూ, మీరూఒకటే, నేనేగా పరాయిదాన్ని; నామాట ఎవరూ వినిపించుకోరు" అన్నగోడు విని, నారాయణగారు, ఆవిడకు కూడా వచ్చచెప్పి యింటికి తిరిగివచ్చాడు.

శారద తనపంతమే నెగ్గిందని, ఎన్నోఆశలు పెంచుకొని, భర్తకి ఉద్యోగమయిన ఊరుచేరి, మల్లిఖార్జునాన్ని గెలిచేసేది. అసలే మిడిమిడి జ్ఞానం మరీచికాకని, బావ అట్లేగొడవయితే, మరి చికాకని, మచ్చికగా'శారదా! అంతా నీమంచికేనని యోచించి, మా యింటిదగ్గరుంటే, కాదని పంతం కొద్దీ, ఒంటరితనాన్ని తెచ్చిపెట్టుకొన్నావు. అంతా, చికాకుగా ఉందియిక్కడ' అన్నమల్లి మాటకు శారద పరవాలేదు. ఆరునెలలుపోతే, మనకే కావలసినంత తోడు' అని సిగ్గుతో, బావకౌగిట్లో వరగిపోయింది. మీఆనందం, నాఆనందం అని, చందమామ మబ్బుచాటు నుంచి తొంగిచూచాడు.

—

భారతదేశము: పంచవర్ష ప్రణాళికలు

శ్రీమతి గాడిచెర్ల సుబ్బాయమ్మ

1 సీ. ఒకనాడు నీకున్న. సకలసంపదగాంచి
పాశ్చాత్యులకు నీర్ష్య ప్రభవమాయె
ఒక్కనా డుగ్రూతలూగించె పరదేశ
రాజన్యవరుల నీరాజనీతి
ఒకనాడు నీదుశౌర్యోన్నతి వీక్షించి
ప్రముఖవీరావళి- ప్రణతులైరి
ఒకనాడు నీశిల్పవిలసనమ్మును జూచి
వేనోళ్ల బొగడెను- విశ్వమెల్ల

గీ. అట్టి నీతేజమెల్లను- నణగిపోయి
దాస్యశృంఖల బంధాన- దాగినావు
తేరుకొనుచున్నదమ్మ నీ తేజమిపుడె
అఖిలభారత పూర్వపుణ్యంబువలన॥

2 శా. శ్వేతద్వీప నివాసపాలనము—
నిశ్శేషంబు గావించెనో
మాతా! నీగుణరూపసంపదల—
ధర్మగ్లానితో దాసివై
చేతోమోదము లేకయుంటివిగదా!
చిక్కుల్దీరె! నీనాటితో,
మాతాతయ్యతపంబు పండినది—
సన్మానంబుతో వెల్గుమా॥

3 సీ. భారతాంబా! నీవు పాశ్చాత్యులకు జిక్కి
అస్వతంత్రపుబాధలందినావు
తేజంబువిడనాడి— దీనాతిదీనవై
పరజాతిదాస్యాన వరలినావు
ఆత్మస్వతంత్రుల యధ్యాత్మశక్తిచే
దాస్యబంధనముల దలగినావు
ఖండఖండాంతర ఖ్యాతి సంపాదించి
పూర్వపుతేజంబు బొందినావు

గీ నేడు మాపుణ్యవశమున నీయశస్సు
భారతీయులకెల్ల నాధారమయ్యె
నిన్ను శోభింపజేయగా— నేర్పినాము
పంచవర్షప్రణాళికా— సంచయముల॥

4 సీ. ప్రాజెక్టులెన్నియో— వర్ధిల్లుచుండెను
ప్రజలకు సౌఖ్యజీవనము నొసగ
విద్యాలయములెన్నో— విస్తరిల్లుచునుండె
బాలుర జ్ఞానసంపదలు పెరుగ
వైద్యాలయములెన్నో- ప్రభవిల్లుచుండెను
రోగముల్ వాపి యారోగ్యమొసగ
ఉచితబోధాలయా లుత్పత్తియగుచుండె
పెద్దవారికిగూడ, విద్యనొసగ

గీ జాతిమతభేదములకెల్ల- స్వస్తి జెప్పి
పంచవర్షప్రణాళికా- సంచయముల
భారతీయులు సకలసంపదలతోడ
వెలుగనున్నారు స్వాతంత్ర్యవీరులగుచు॥

5 గీ ఎటుల పరిపూర్తిగావింతు రీతృతీయ
పంచవర్షప్రణాళిక యంచు నీకు
దిగులువలదమ్మ, జయము. సాధింపగలరు,
ఐకమత్యంబునొంది- నీయాత్మసుతులు॥

6 సీ. ధనమిచ్చికొనుటకా,- తగినస్తోమత లేదు
భారతావనికి సంపదలుగూర్ప
అన్యదేశంబుల నదలించి బెదరించి
యార్జింపతగిన సైన్యములు లేవు
అధికవ్యయంబుల- నరికట్టుకొనుటకు
పరదురాక్రమణ, లాభయము మెండు,
అన్యరాజన్యుల- నర్థింతమనుకొన్న
అభిమానవృత్తికి- హానికలుగు

గీ పొందుగా భారతాంబ- సర్వోదయంబు
ప్రాప్తమగునట్టు జేయుము- పంచశీల
విశ్వరూపముజూపించి- వేడ్కతోడ
కార్యదక్షులజేయుము- గారవమున॥

7 సీ. సాహసులై తొల్లి స్వాతంత్ర్యసమరాన
భారతాంగనలెల్ల బాటుపడిరి
స్థైర్యధైర్యములతో దర్పంబుజూపించి
శత్రులనెదిరించి, జయముగొనిరి
దిట్టలై భారతదేశసౌభాగ్య మో
యన నిల్చి రన్నిటియందు నేడు
విజ్ఞానసంస్కృతుల్. వెలయింప దీక్షతో
రాజకీయములందు రాణలైరి

గీ. పంచవర్షప్రణాళికా బద్ధమయిన
రామరాజ్యాన, భారతప్రజలు సర్వ
సంపదలు గాంతురనుటకు సందియంబు
గలదె? మహిళలు కార్యరంగమున నిలువ॥

(26-1-61 తేదిని ఆల్ ఇండియా రేడియో మహిళా మండలి కార్యక్రమంలో స్వీయకవిత శీర్షిక క్రింద స్వాతంత్ర్యము జన్మహక్కు భావమును తెలుపు ఈపద్యములు ప్రసారను చేయడమైనది.)

ఆంధ్ర మహిళా సభ—బర్కత్పుర

ఈ. యస్. యల్. సి. లో నెగ్గినవారు.

ఈ:కింద పేర్కొన బడినవారు హైదరాబాదు-బర్కత్పుర 'ఆంధ్ర మహిళా సభా విద్యాలయాన, ఈ. యస్. యల్. సి. పరీక్షకు శిక్షణపొంది 1961 సం॥ ఏప్రిల్ లో జరిగిన పరీక్షలలో ఉత్తీర్ణులయిన మహిళా మణులు:—

2418	శ్రీమతి.	యం. పార్వతమ్మ.	2442	,,	సి. హెచ్. దుర్గామహాలక్ష్మి.
2436	,,	కే. సత్యవతి.	2433	,,	వి. సుందరమ్మ.
2420	,,	ఏ. రాధాకస్తూరి.	2428	,,	వి. సీత.
2429	,,	యస్. ప్రభావతి.	2440	,,	యం. సీతామహాలక్ష్మి.
2434	,,	యన్. ఇందిర.	2431	,,	పి. యన్. సుశీల.
2446	,,	పి. జయలక్ష్మి.	2438	,,	యస్. కామేశ్వరి.
2444	,,	యస్. భానుమతి.	2421	,,	కే. సుబ్బలక్ష్మి.
2445	,,	ఏ. విమలావతి.	2424	,,	కే. కోటేశ్వరమ్మ.
2447	,,	కే. శ్రీమతి.	2425	,,	యస్. సుబ్బలక్ష్మి.
2449	,,	పి. మంగతాయారమ్మ.	2435	,,	జీ. శ్రీదేవి.
2484 B.	,,	వి. పుష్పావతితాయారమ్మ.	2422	,,	యల్. మాలతి.
2484 C.	,,	పి. నాగేంద్రమ్మ.	2426	,,	జీ. మాలతి.
2417 A.	,,	పి. సత్యవతి.	2441	,,	కే. మారుతీదేవి.
2484	,,	బి. దుర్గమ్మ.	2423	,,	యం. లలిత.
2484 A.	,,	యల్. ఈశ్వరమ్మ.	2439	,,	ఏ.బి. గజలక్ష్మి.
2448	,,	సి. హెచ్. గోవర్ధనమ్మ.	2430	,,	జి. రామసీత.

2443 ,, జి శకుంతల

ఆంధ్ర మహిళా సభ - మద్రాసు

స్వాతంత్ర్య దినోత్సవము

ఆగస్టు 15-వ తారీఖున మహిళా సభావరణంలో మహాలక్ష్మి అను బాలికచే జాతీయ పతాకము ఆవిష్కరింపబడెను. తరువాత శ్రీమతి శివలింగ కామాక్షమ్మ గారిచే 'నాగేశ్వర శిశువిహార్'లో నూతనముగా నిర్మింపబడిన భవనమందలి మొదటి అంతస్తు బాలికల ఉపయోగార్థము తెరువబడింది. విహార్‌కు సంబంధించిన బాలికలు పతాక వందనాలు సమర్పించి జాతీయ గీతాలు పాడేరు.

ఆంధ్ర మహిళా సభకు సంబంధించిన రోజరీచర్చి రోడ్డులో ముద్రణాలయం పనివారు, నేతశాఖ పనివారు ఉదయం సమావేశమై పతాకావిష్కరణంజరిపి జాతీయగీతాలు పాడేరు, వచ్చినవారికెల్ల మిఠాయిలు పంచిపెట్టారు.

పశ్చిమ జర్మన్ మహిళా లోకం

మనదేశంలో. చాలా కుటుంబాలలో ముఖ్యంగా నాగరిక కుటుంబాలలో, ఆడపిల్లలకి వంట అన్నా, యింటిపనులన్నా నచ్చకపోవడం నేడు చాలామంది అనుభవంలో వున్న విషయమే. యువతులకి గృహ కార్య క్రమాలలో అయిష్టత నేడు ప్రపంచం అంతటా వ్యాపించి వున్న రుగ్మతే. ఉదాహరణకి పశ్చిమ జర్మనీలో యీ మధ్యనే జరిపిన పరిశీలనా ఫలితంగా నూటికి ఎనభయిమందికి పైగా గృహిణులు తమకి ప్రత్యేకంగా యింటిపనులలోనే నిమగ్నులవడం నచ్చడంలేదని నిష్కర్షగా చెప్పారు. ఒక వందమంది కన్యలని ప్రశ్నిస్తే వారిలో 90 మంది తాము వివాహం చేసుకున్నా గృహ కార్య క్రమాలలో తమకి ఎంత మాత్రం యిష్టంలేదని చెప్పారు. ఇతర దేశాలలో కూడా యీ ధోరణి బాగా కనపడుతోంది. జర్మనీలో యీ ధోరణికిగల కారణాలు కూడా పరిశీలించారు. జర్మనీలో గృహిణులు గృహ కార్య క్రమాలకన్న యితరపనులు వాంఛించడానికి కారణం డబ్బు సంపాదన ఒక్కటేకాదు. పరిమితమైన నారీలోకం దాని వాతావరణం విడిచి జీవితవాహినిలో మునిగి తేలాలన్నదే వారి అభిలాష.

మహిళలలో యీ రకం ధోరణి పెరగడానికి చాలావరకూ బాధ్యత పురుషులపైనే ఉంది. చాలామంది భార్యలు తమ అయిష్టతకి కారణాలు వివరిస్తూ, తామెంతచేసినా. తమ భర్తలు మెప్పు మెహర్బాని ప్రదర్శించరని ఫిర్యాదు చేశారు. భర్తలు తమ తమ పనులలోనూ, వృత్తులలోనూ, ఏ రోజు నయినా రవంత కష్టం కల్గినా, పని ఎక్కువ అయినా సానుభూతి వాంఛిస్తారేగాని, రోజుకు పన్నెండు గంటల సేపు విధివిరామం లేకుండా రెక్కలు కొట్టుకున్నా, "అయ్యో! కష్టపడుతున్నా"వన్న చింత వారికి లేదని చెప్పారు.

జర్మన్ గృహిణుల సంఘం యీ సమస్యయావత్తు పరిశీలించి, అసంతృప్తి పొందిన గృహిణులు, యింటి పని లేని సమయాలలో. ఆఫీసులలోను, ఆస్పత్రులలోనూ, సహాయకులుగా పనిచేస్తే బాగుంటుందని సూచించారు. కాని చాలామంది పురుషులు యీ సూచనని త్రోసిపుచ్చి, తమ భార్యలు కష్టపడి అదనపు డబ్బు సంపాదించవల్సిన అవసరంలేదని తెలియచేశారు.

నిజానికి యీసమస్య ఏ కుటుంబానికి ఆకుటుంబం పరిష్కరించుకోవల్సిన సమస్య. అదీకాక యిందులో కూడా ఆలోచించవల్సిన సమస్యలనేకం ఉన్నాయి. జర్మనీలో 1957 నుంచీ, స్త్రీ పురులకి సమానహక్కులని వినియోగించుకోక పోవడం గమనించ వల్సిన సంగతి. దీనికి కారణం భర్తలు భార్యల హక్కులన్నీ పూర్తిగా గౌరవించడమేనని తెలుస్తోంది. దీనిని గురించి జరిగిన పరిశీలనా ఫలితాలవల్ల మూడింట ఒక వంతుకిపైగా జర్మన్ భర్తలు తమ సంపాదనయావత్తు భార్యల హస్తగతంచేసి తమ రోజువారీ ఖర్చులు భార్యలదగ్గరనుంచి తీసుకుంటారు అని తెల్సింది. మరో చిత్రమయిన విషయం, ఏయింటి అద్దెవాడో, సామాన్లవాడో కొద్దిగా అదనంగా డబ్బు కావాలంటే "మా ఆవిడనడిగి చెబుతా"ననడం నూరింట 99 మంది దగ్గర నుంచి వినేమాటే.

ఇక స్త్రీల పేషన్లవిషయంలో పురుషులు ఎప్పుడూ ఏవిధమైన జోక్యం కల్గించుకోరు. ప్రతీఏడు పాషన్లు మారి కొత్త రకాల దుస్తులు వాడుకలోకి వస్తున్నా నూరింట 29 మంది మాత్రమే యీ కొత్త బట్టలకోసం ప్రాకులాడడం గమనించ వల్సినసంగతి. మిగిలిన 70 మందీ ఏదో పండుగ కోసమో, లేదా పుట్టిన రోజుకు మాత్రమో కొత్తదుస్తులు కొని ధరిస్తారు. కాని రోజూ కట్టుకోడానికి ప్రయత్నించరు. అందుచేత జర్మన్ స్త్రీలలో అధికసంఖ్యాకులు తమ కుటుంబంలో వారికి ఏది సంతుష్టి, ఆనందం కల్గిస్తుందో అదే ధరిస్తారు కాని. వీధిలో తిరిగేవారి మెప్పుకోసం అధునాతనమైన దుస్తులు ధరించరు.

ఒక జర్మన్ భర్త యీ దరియాప్తుల గురించి వ్యాఖ్యానిస్తూ, జర్మనీజాతీయ ఆదాయంలో నాల్గింట మూడువంతులు ఆడవారి చేతులలోనే ఉంటుంది. నన్నడిగితే అది మంచిదేనంటాను. ఆడవారికి ఖర్చు పొదుపు చేయడం బాగాతెలుసు" అన్నాడు.

"ఇంట్-రా"

వార్తావళి

'నాగా' ప్రజాసభాధ్యక్షుడును, నాగాపర్వతప్రదేశ మధ్యకాల రాజ్యాంగ సభానాయకుడును అయిన డాక్టరు ఇంకోంగ్ గ్లిజా అవోను 'మోకాక్ చంగ్' ప్రాంతంలో ఒకానొక హంతకుడు రివాల్వరుతో కడుపుమీద ప్రేల్చి సమీపారణ్యములకు పాఱిపోయి, అదృశ్యుడుకాగా, 'అవో'ను సైనికవైద్యశాలకు చికిత్సకై తీసుకొనివెళ్ళి చేర్చారు. కాని, అతడు 24-8-61 న మరణించాడు. అతనివయస్సు 58 సంవత్సరాలుమాత్రమే. ఇతడు 1957లో నాగాల్యాండుకు ప్రత్యేకపరిపాలనము కోరి ఢిల్లీకి రాయబారం నడిపాడు. ఇతడు దౌర్జన్యాన్ని ప్రోత్సహించే తిరుగుబాటుదారుల నాయకుడైన ఏ-జడ్-ఫీజో విధానాన్ని ఖండించుటచేత నాగాప్రజల అనురాగానికి పాత్రుడై ప్రఖ్యాతివహించాడు.

పరిశ్రమలు పెంపొందించే విషయంలో ఆయా రాష్ట్రాలకు నిర్ణయింపబడిన పథకాల(Plans) లో హెచ్చుతగ్గులు లేకుండా వుండేటట్లు తయారుచేసిన మూడవపంచవర్షప్రణాళికను పథకాలమంత్రి- శ్రీ గుల్జారిలాల్ నందా 24-8--61న లోకసభామోదంకొఱకు సమర్పించగా, ఏకోన్ముఖంగా దాన్ని సభ్యులంగీకరించారు.

సోవియట్ మంత్రివర్గ సభాధ్యక్షుడయిన, శ్రీ- యన్. యస్. కృశ్చేవ్ 1960సం॥ భారతదేశానికి వచ్చియుండినపుడు, మనప్రధాని పండితనెహ్రూను సోవియట్‌యూనియనుకు రమ్మన్న ఆహ్వానాన్ని పురస్కరించుకొని శ్రీనెహ్రూ సెప్టంబరు 6వ తారీఖునకు మాస్కోలో ఉండగలడని ప్రకటించబడింది.

హంగేరియన్ ప్రధాని- డాక్టరు- ఫెరంకు మునిచ్ (Dr. Ferenc Munnich) 24-8-61న ఉదయం ఢిల్లీకి వచ్చినప్పుడు, ప్రధాని శ్రీనెహ్రూ, మరికొందరు మంత్రులు 'పాలం' విమానాశ్రయంలో కలుసుకొని స్వాగతమిచ్చారు. ఆయన శ్రీనెహ్రూను కలిసికొని 45నిమిషాలు సంభాషించాడు.

పంజాబీసుబాసమస్య సుతిమించి రాగాన పడింది. శ్రీ శాంత ఫతేసింగు ప్రధానికోరికను అనుసరించి ఢిల్లీకి వచ్చి ప్రధానిని కలిసికొని యిప్పటికి రెండు పర్యాయాలు దీర్ఘచర్చలు జరిపాడు. మరల ఇంకొకసారికూడ కలుసుకొంటానని పత్రికాప్రతినిధులుతో ఆయన చెప్పాడు. ఇంతవరకు పరిస్థితులు కొంచెమయినా, సుముఖంగా లేవని తెలుస్తున్నది. మాస్టరు తారాసింగు తననిరశనవ్రతాన్ని మానని కారణంచేత కొన్నిపౌనులు తగ్గిపోయినాడని, గుండెల్లో కొద్దిగా నొప్పి యేర్పడిందని తెలుస్తున్నది. మొత్తంమీద అతడు ఉత్సాహంగానే కనబడుతున్నాడు.

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపబడిన మూడు పాలిటెక్నిక్ తరిబీతు సెంటర్లలో ప్రప్రథమంగా ఒకటి మహిళలకై హైదరాబాదులో ఇటీవల స్థాపించబడింది. అందులో 300మందికి పైగా తరిబీతుపొందటానికి అవకాశం కలిగించబడింది.

విద్యార్థులు తప్పక కొనదగిన పాఠ్యగ్రంథాలమీద కూడ ఆంధ్రప్రదేశ ప్రభుత్వం సేల్సుటాక్సు వసూలు చేయవచ్చునని తీర్మానించింది. ఇది బళ్లకు బిడ్డలను చదువుటకుపంపే పెద్దలకు చాలనిరుత్సాహాన్ని కలిగిస్తుంది.

పక్షవాతం సోకినందున 22-8-61న చికిత్సకై జనరల్ ఆస్పత్రిలో చేర్చబడిన శ్రీ- ఏ. వేదరత్నం పిళ్లగారు 24-8-61 పరమపదించారు. చనిపోవునప్పటికి ఆయనవయస్సు 64ఏండ్లు. అతడు గడిదేరిన కాంగ్రెసునాయకుడు. చాలసారులు జైలుకు వెళ్లివచ్చాడు. తమిళనాడు దక్షిణభారత హిందీప్రచారసభకు అధ్యక్షుడు. అతని దేహాన్ని సమాధిచేయుటకు వేదారణ్యానికి తీసికొనివెళ్లారు.

"ఉత్తముఁడు పోవుదారికి
వత్తురు సామాన్యజనులు, వాఁడేగుఱిపైఁ
జిత్తమునిడు నా గుఱిపైఁ
జిత్తమునిడి లోక మెదురు సెప్పక నడుచున్"

(గీతాంగణము)

గ్రంథసమీక్ష

సత్యదృష్టి: రచయిత. శ్రీ అ. సత్యనారాయణ. దేవసదన్. గోవాడ, గుంటూరుజిల్లా. వెల: రు 1. న. పై. 50. క్రౌనుసైజులో 154 పుటలగ్రంథం.—

గ్రంథకర్త గారు కేవలం భౌతిక వాదులుగా కనిపిస్తున్నారు. అంతే, నాస్తికవాదులని కాదు మా అభిప్రాయం. ఐహికానికి సంబంధించిన విషయాల నన్నిటిని, మన ఊహలను అనుసరించి పారమార్థికాలకు ముడిపెట్టి రెండవదానికంటె మొదటిదే శ్రేష్ఠమనటంలో 'సత్యదృష్టి' యెంతవరకు ప్రసరిస్తుందో మనం చెప్పలేం. కాని ఒక్కటి మాత్రం నిజం. ప్రత్యక్ష సిద్ధాంతాలు కూడ కొన్ని చోట్ల తప్పటడుగు వేస్తూండటం అనుభవజ్ఞులకు విదితమే. ఇది తెలిసిననాడు మనం వేదాదుల జోలికి పోము.

ఆర్యులను వీరు జాతివారన్నారు. కొండొకచో పురోహితులనుగూడ ఈసడిస్తారు. మన దేవళ్ళపేర్లను వారి ఊహలనుబట్టి వ్యాఖ్యానిస్తారు. ధర్మతత్వ జిజ్ఞాసతో మహర్షులు చెప్పినది వీరంగీకరించరు.

సంగ్రహంగా ఈయబడిన వీరి జీవితంలో వీరు అనేకరంగాలలో కృషిచేసే విచక్షణులుగా గోచరిస్తారు. వస్తుతత్వశాస్త్రానికి ప్రాధాన్యం ఇచ్చేభౌతికవాదం పారంపర్యంగా వస్తూండే భారతీయ ధర్మాన్ని నిర్ణయించే కొలబదగ ఉపయోగించుకోలేము. ఈ సత్యాన్ని గుర్తించిననాడే మానవలోకానికి 'సత్యదృష్టి' అలవడుతుంది.

తత్సమశతకం: కర్త. శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావు. భారతీ సమితి, పాముఋ, కృష్ణాజిల్లా. వెల. 0–6–0. విద్యార్థినీబృందానికి శ్రీ రావుగారు చేస్తున్న అమోఘమైనసేవ శ్లాఘ్యమయింది. లోగడ వీరుకొన్ని శబ్దాలకు 'రూపాంతర శతక'మనే చిన్న శతకంలో రూపాంతరాలు తెలిపారు. ప్రకృతం 'తత్సమశతకం' ప్రచురించారు. ఇందులో ఎన్నో తత్సమపదాలకి అచ్చ తెలుగు పదాలు ఇచ్చారు. విద్యార్థిలోకానికి ఈ శతకం కల్పవృక్షం లాంటిది.

స్వీకారము

1. వ్యాసమంజూష: విద్వాన్. కే. సంజీవరాయ శర్మవిరచితము వెల రు 1 న. పై. 25, వలయువారు గ్రంథకర్త పేర— యస్. కే. పి. డి, బాలురఉన్నత పాఠశాల, మద్రాసు- 1 అని వ్రాసుకోవాలి.

2. మిత్రబోధ: కర్త: శ్రీబులుసు వెంకటరామమూర్తి, అష్టావధాని, గోగినేనిపురం, గూడూరు, నెల్లూరుజిల్లా,- వెల తెలియదు.

3. విశ్వకవి: శ్రీజాస్తి వెంకటనరసయ్యగారు, ప్రధానాంధ్ర పండితులు, ఆర్. వి. యస్. హయ్యరు సెకండరీస్కూలు, చిలకలూరిపేట- గుంటూరుజిల్లా, వెల 75, నయాపైసలు.

4. సినిమారంగం (ఆగస్టు నెల సంచిక)

మాతృదేశ మహిమ.

ధైర్యస్థైర్యములతో నీమాతృదేశమగు భారతసీమయొక్క ప్రభావమును నిలబెట్టుకొనుము. అట్టిప్రభావము ప్రపంచమందలి ప్రజానీకము గుర్తించినట్లు వర్తింపుము. భరతమాతృ పుత్రీపుత్రులయిన మీరెల్ల రామెయే మీజననీమతల్లి యని విశ్వసింపుడు; ఆరాధింపుడు, మీరామెను– ఆమెసత్యమునందు, ఆమెసంస్కృతియందు, ఆమెకళలయందు, ఆమెవిద్యయందు, ఆమెపరిశ్రమలయందు, ప్రత్యక్షీకరించుకొని యెల్లప్పుడు సేవింపుడు, అప్పుడే మీరామె నిజతత్వముం దెలిసికొని, 'అంతటి ప్రభావముగలతల్లికి మనము సంతానముగదా!' అని గర్వింపగలరు.

ఆమె సంతతియందు పెక్కురు ఆమెయందు తమకుగల ప్రేమను గౌరవమును విస్మరించిరి. అట్టివారామెనుగూర్చి కాక, తమ్ముగూర్చియే నిరంతరము తలపోయుచుందురు, వారు పరదేశీయులనే అనుకరింతురు. అకారణముచేతనే ఆర్యావర్తము బలహీనమయి ఏకార్యమును నిర్వహింపజాలని అసమర్థతను చాటుచు తక్కిన దేశములమధ్య రాణింపజాలకున్నది.

(డాక్టరు జార్జి యస్. అరండేల్)

'ఆంధ్ర మహిళ'

(ఆంధ్ర మహిళాలోకాభ్యుదయ మాసపత్రిక)

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్.

విడి పత్రిక—37 నయాపైసాలు ప్రత్యేక వార్షిక సంచికతో కలిసి
సం॥ చందా - రూ. 6-00.

పంచాయతీ సంస్థలకు. సంక్షేమ సంఘాలకు, పౌరజన గ్రంథాలయాలకు
పాఠశాలా పుస్తక భాండాగారాలకు సగము చందా సం॥ రం॥ కి రూ. 3-00 లు.

పత్రికా విక్రయసంస్థల యేజంట్లకు

1. 'ఆంధ్ర మహిళ' ఆరింటికంటె తక్కువ ప్రతులకు ఇచ్చే ఆర్డర్లు గమనింపబడవు.
2. పత్రికకు 1 కి 12 న. పైసాలు కమీషను ఇవ్వబడును. పోస్టేజి మేమేభరింతుము.
3. విక్రయంకాని సంచికలు వాపసు తీసికోబడవు.
4. ప్రతినెల "ఆంధ్ర మహిళ" ఎన్నిప్రతులు కావలెనో సూచిస్తూ, అసలుక్రయంలో కమీషను మొత్తం మినహాయించుకొని, తక్కిన మొత్తంతో వచ్చే ఆర్డర్లు అంగీకరింప బడును.
5. ప్రత్యేక వార్షిక సంచిక ప్రతి 1. కి రూ. 2 లు, అయినా, యేజంట్లకు రూ. 1. 50 కే, (అనగా 25. కమీషన్ మినహాయింపుతో) ఇవ్వబడుతుంది.

ఆంధ్రమహిళ

ప్రకటన రేట్లు

సామాన్యమైన పుట 1 కి. రూ 60. లు,

అట్టకాగితం 2 వ పుట, 3. వ పుట (ఒకేరంగుతో) రూ 80 లు.

4. వ పుట (ఒకేరంగుతో) రూ 100 లు.

కొయ్య దిమ్మెలుగల బ్లాకులు అంగీకరించ బడును. ప్రకటనలు, బ్లాకులు పత్రిక వెలువడే తారీఖునకు 10 దినములు ముందే మాకు చేరాలి.

మేనేజరు,
ఆంధ్రమహిళ
7 ఎ. రోజరీచర్చిరోడ్డు,
మైలాపూరు—మద్రాసు 4.

Printed at Andhra Mahila Press, 7/A, Rosary Church Road, Published and Owned by Andhra Mahila Sabha, Madras. Editor - Secretary, Andhra Mahila Sabha.